సూర్య 18వ వసంతంలోకి ...
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఆదివారం | 1 డిసెంబర్ 2024 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 40
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, కార్తీక మాసం అమావాస్య ఉ.11.01 వరకు అనూరాధ మ.2.27 వర్జ్యం ఉ.9.20 నుంచి 11.02 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం సా.3.56 నుంచి 4.40 వరకు

## పాలస్తీనా ప్రజలకు అండగా ఉంటాం

● పాలస్తీనియన్ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నాం ● పాలస్తీనా ప్రజలకు భారత ప్రధాని మోడీ లేఖ.. ● హమాస్-ఇజ్రాయెల్ మధ్య శాంతియుత చర్చలు జరగాలని పిలుపు

పాలస్తీనా ప్రజలకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లేఖ రాశారు. పాలస్తీనా అభివృద్ధికి తాము మద్దతుగా ఉంటుందని తెలిపారు. పాలస్తీనాలో కొనసాగుతున్న ఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హమాస్, ఇజ్రాయెల్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ యుద్ధం వల్ల వేలాది మంది ప్రజలు చనిపోయారు.. అలాగే, ప్రపంచంలోని చాలా దేశాలు అనేక రకాలుగా నష్టపోయాయని వెల్లడించారు.



6లో

## సంపద సృష్టి ఇస్తాం ఫలాలు పంచుతాం

● రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం ● సాంకేతికతను అనుసంధానం చేసి సెల్ ఫోన్‌ల ద్వారా పౌర సేవలు అందజేస్తాం ● రాష్ట్రంలో ల్యాండ్, గంజాయి మాఫియాలు లేకుండా చేస్తాం ● పీఎం సూర్య ఘర్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానల్స్ అందిస్తాం ● రాయదుర్గం ప్రాంతాన్ని ఎడారికీకరణ కాకుండా చర్యలు తీసుకుంటాం ● లబ్ధిదారులు 1, 2 నెల పెన్షన్లు తీసుకోకపోయినా మూడు నెలలు మొత్తం కలిపి ఒకేసారి చెల్లిస్తాం ● నేమకల్లు ప్రజావేదికలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు




2లో

## అంతరిక్ష రంగంలోనూ స్టార్టప్‌ల జోరు..

● గ్లోబల్ మార్కెట్‌లో పెరిగిన భారత్ వాటా! ● ఇప్పటి వరకు 431 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించిన ఇస్రో ● అంతరిక్ష రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందన్న సోమనాథ్ ● ఇస్రో విజన్ భారత స్పేస్ టెక్ కంపెనీల పెరుగుదల అనే అంశంపై కీలక ఉపన్యాసం



6లో

## మహా సీఎం రేసులో కొత్త పేరు

● కేంద్రమంత్రి మురళీధర్ మొహొల్‌కి అవకాశం? ● మహారాష్ట్ర సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారంటూ ఊహాగానాలు ● సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పోస్టులపై స్పందించిన ఎంపీ ● అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేసిన కేంద్ర మంత్రి



6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## రైతులకు పండగ తెచ్చాం



● అభివృద్ధిని అడ్డుకోవద్దు ● గత ప్రభుత్వాలు భూసేకరణ చేయలేదా ● బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంకు లక్ష కోట్లు ఖర్చు చేసింది ● బిఆర్ఎస్ ప్రజలను మోసం చేసింది ● గడీల పాలన కూల్చిన రోజు ● రాష్ట్రంలో రైతు రుణమాఫీపై చర్చకు సిద్ధమా ● కేసీఆర్, మోదీకి సీఎం రేవంత్ సవాల్

వివరాలు-3లో

## టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్ర వెంకటేశం



2లో

టీజీపీఎస్సీ చైర్మన్గా విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశం నియమితులయ్యాయి. టీజీపీఎస్సీ చైర్మన్గా బీసీకి కాంగ్రెస్ సర్కార్ అవకాశాన్ని ఇచ్చింది. తెలంగాణ మొదటి పబ్లిక్ సర్వీస్ కమిషన్గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గంట చక్రపాణి నియమితులవగా... ఆ తర్వాత జనార్దన్ రెడ్డి నియామకం జరిగింది. అయితే వివిధ ఆరోపణల నేపథ్యంలో జనార్ధన్ రెడ్డి స్థానంలో మహేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారు.

## మన యువతే మన భవిష్యత్తు



2లో

● మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ● కెఎల్ యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవంలో పాల్గొన్న మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ● 42 బంగారు పతకాలు ● 37 రజత పతకాలు ● 166 మంది పి. హెచ్. డి 604 మంది ఫస్ట్ గ్రాడ్యుయేషన్ ● 3936 అండర్ గ్రాడ్యుయేషన్


## అంతే ఇంతే!




గతంలోలా పింఛన్ టెన్షన్ లేదంటున్నాడు సార్

## తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేధం

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు



2లో

తిరుమల పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ నిర్ణయించింది. నిత్యం గోవింద నామాలతో మారుమోగే పవిత్రమైన తిరుమల దివ్య క్షేత్రంలో, గత కొంతకాలంగా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన రాజకీయ నాయకులలో కొంతమంది, దర్శనానంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది.

## పోషకాహార తెలంగాణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

● అంగన్ వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో గ్యాప్ ఉండొద్దు ● 100 శాతం టార్గెట్‌ను రీచ్ కావలిసిందే ● మూడు నెలల సమయం ఇస్తున్నాం ● పాల సరఫరాను విజయ డెయిరీ మెరుగు పరుచుకోవాలి ● ఆరోగ్యలక్ష్మీ పథకంపై మంత్రి సీతక్క సమీక్ష

వివరాలు-3లో



## పవన్ చర్యలు కరెక్టే

● కాకినాడ రేవు నుంచి పీడీఎస్ బియ్యం రవాణా ● 11 కోట్ల మంది బీజేపీ సభ్యత్వం ● ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, పురందేశ్వరి



2లో

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు చెందిన బియ్యం స్మగ్లింగ్ వ్యవహారంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జోక్యం చేసుకోవడాన్ని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్వాగతించారు.



# పవన్ చర్యలు కరెక్టే -పురందేశ్వరీ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు చెందిన బియ్యం స్మగ్లింగ్ వ్యవహారంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకోవడాన్ని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్వాగతించారు. పీడీఎస్‌పై పవన్ కళ్యాణ్ తీసుకున్న చర్యలు సరైనవేనని ఆమె స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలను అడ్డుకుంటే తప్పు ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు. శనివారం విజయవాడలోని నిర్వహించిన సంఘటన్ పర్వ్ 2024 రాష్ట్ర స్థాయి సదస్సులో బీజేపీ నేతలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. అంతర్జాతీయ పీడీఎస్ మాఫియాపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఏ మాత్రం తప్పు కాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లోని గోడౌన్లలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా తనిఖీలు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో భాగంగా కాకినాడ పోర్ట్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. గత పాలకుల్లో కొంత మంది ఈ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో పీడీఎస్ బియ్యం వ్యవహారంపై తాము పలుమార్లు ప్రస్తావించిన విషయాన్ని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. పీడీఎస్ బియ్యం అంశంలో పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ వ్యవహరిస్తున్న తీరు సరైనదేనని దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. పేదలకు అందించే బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.ఏడాది సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా చాలా తక్కువ సమయంలో.. 11 కోట్ల మంది సభ్యత్వం పొందారని దగ్గుబాటి పురందేశ్వరి వివరించారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 25 లక్షల మంది కొత్తగా బీజేపీలో సభ్యత్వం పొందారన్నారు. అందుకు పార్టీ కార్యకర్తల కృషిని ప్రశంసనీయమైనదన్నారు. కార్యకర్తల కృషి వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. భవిష్యత్తులో పారదర్శకంగా.. సమర్థవంతంగా సంస్థాగత ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు.

# సంపద సృష్టి ఇస్తాం ఫలాలు పంచుతాం

● రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం ● సాంకేతికతను అనుసంధానం చేసి సెల్ ఫోన్ల ద్వారా పౌర సేవలు అందజేస్తాం ● రాష్ట్రంలో ల్యాండ్, గంజాయి మాఫియాలు లేకుండా చేస్తాం ● పీఎం సూర్య ఘర్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానల్స్ అందిస్తాం ● రాయదుర్గం ప్రాంతాన్ని ఎడారికీకరణ కాకుండా చర్యలు తీసుకుంటాం ● జీడిపల్లి, భైరవానితిప్ప ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత తీసుకుంటాం.. ● లబ్ధిదారులు 1, 2 నెల పెన్షన్లు తీసుకోకపోయినా మూడు నెలలు మొత్తం కలిపి ఒకేసారి చెల్లిస్తాం ● నేమకల్లు ప్రజావేదికలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో సంపద సృష్టి ద్వారా అభివృద్ధి చేస్తూ ఆ అభివృద్ధి ఫలాలను తిరిగి పేదలకు అందజేస్తామని, ఇదే తమ ఎన్డీయే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అనంతవరం జిల్లా బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో శనివారం మధ్యాహ్నం లబ్ధిదారురాలు పాల్తూరు రుద్రమ్మ / పాల్తూరు మరిచేడప్ప ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పథకం కింద 4,000 రూపాయల వితంతు పెన్షన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా అందజేశారు. అనంతరం ఇందిరమ్మ కాలనీలో గ్రామస్తులతో ముచ్చటించి వారితో రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటో దిగారు. తదనంతరం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో లబ్ధిదారురాలు బోయ భాగ్యమ్మ / బోయ ముక్కన్న ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పథకం కింద 15 వేల రూపాయల వికలాంగుల పెన్షన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా అందజేశారు.ఆ తరువాత ప్రసిద్ధి గాంచిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి చేరుకుని శ్రీ ఆంజనేయస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు. దేవాలయంలోని స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ముఖ్యమంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక – పేదల సేవలో.. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. తమ్ముళ్లు హుషారుగా ఉన్నారా.... ఆడబిడ్డలూ.. ఆనందంగా ఉన్నారా అంటూ ఆప్యాయంగా పలకరించి ప్రసంగాన్ని ప్రారంభించారు. తాను ప్రతిపక్షనేతగా ఏప్రిల్ 11వతేదీన అనంతవురం జిల్లాలోని కనేకల్లుకు వచ్చాను. తిరిగి మరల ఈరోజు వచ్చాను. ఆరోజు నేను 11న వచ్చినందుకు ఈరోజు మీరు ప్రతిపక్షానికి 11 సంఖ్యనే ఇచ్చి కూటమి సర్కారును అధికారంలోకి తీసుకువచ్చారు. ఆరోజు గ్రామలకు మంచి రోజులు వస్తాయని, మీ బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయని, భూకబ్జాలు చేసే వారి భరతం పడతానని ఆనాడు హామీ ఇచ్చాను. రాయలసీమను రాళ్ల సీమ కాదు రతనాలసీమగా చేస్తామని చెప్పాను. మీ ఆశలు ఏ ప్రభుత్వం నెరవేస్తుందో ఆ ప్రభుత్వానికే మీరు పట్టం కట్టారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 93 శాతం స్ట్రైకింగ్ తో, 57 శాతం ఓట్లు వేసి కూటమి సర్కార్ ను గెలిపించారు. ఆ ఘనత మీకే దక్కిందన్నారు.

అనంతవురం వెనుకబడిన జిల్లా అని, అందులో రాయదుర్గం ప్రాంతం మరింత వెనుకబడి ఉందని, ఈ రాయదుర్గం ప్రాంతం ఎడారికీకరణ మారిపోకుండా ఉండడానికి రాయదుర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకొని మీ జీవితాల్లో వెలుగు తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. హంద్రీనీవాపై 4,500 కోట్లు ఖర్చుపెట్టాం, రాయలసీమలో 12,500 కోట్లు ఇరిగేషన్ పై ఖర్చు పెట్టామని, భైరవాణితిప్పకు సంబంధించి 968 కోట్లు మంజూరు చేసి 35 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన వాటన్నిటిని పూర్తిచేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. మీ ఊరు, ఈ ప్రాంత అభివృద్ధి కోసం నాకు ఆత్మస్థైర్యాన్ని, శక్తిని, ధైర్యాన్ని, తెలివితేటలు ఇవ్వమని మీ ఊరి ఆంజనేయస్వామిని ప్రార్థించానన్నారు.

పేదల పక్షాన ఉండాలని ఎప్పుడూ నా ఆలోచన ఉందన్నారు. కష్టాల్లో ఉన్నవారికి పూర్తిగా అండగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను నెలకు 3,000 నుంచి 4 వేలకు పెంచి ఏప్రిల్, మే, జూన్ నెలల అరియర్స్ తో కలిపి అందించామన్నారు. రాష్ట్రంలో 64 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్లను ఇస్తున్నామని, ఐదు నెలల కాలంలో 18 వేల కోట్లు పేదలకు ఇవ్వడం ద్వారా నా జీవితం ధన్యమైందన్నారు. 64 లక్షల మందికి నెలకు 2,790 కోట్లు ఖర్చు చేస్తున్నామని, సంవత్సరానికి 53,099 కోట్లు పింఛన్లపై తమ ఎన్డీఏ ప్రభుత్వం ఖర్చు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు 1, 2 నెల పెన్షన్లు తీసుకోకపోయినా మూడు నెలలు మొత్తం కలిపి ఒకేసారి చెల్లిస్తామన్నారు. పింఛన్ దారు ఎవరైనా చనిపోతే వారి భార్యకు కూడా వెంటనే పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 4,000, 6,000, 10,000, 15,000 రూపాయల ప్రకారం పెన్షన్లు ఇస్తున్నామని, అలా పేదవారికి సహాయం చేస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. ఏ రాష్ట్రంలో కూడా మన రాష్ట్రం ఇచ్చినంత విధంగా పెన్షన్లు ఇవ్వడం లేదని, కర్ణాటకలో 1,200, కేరళలో 1,600, ఒరిస్సాల 700, తెలంగాణలో 2,000, మధ్యప్రదేశ్, వెస్ట్ బెంగాల్లో వెయ్యి రూపాయలు చొప్పున పెన్షన్లు ఇస్తున్నారని, కానీ తాను అన్ని రాష్ట్రాల కన్నా అధికంగా పెన్షన్లను ఇస్తున్నానని, ఈ వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. అధికారంలోకి రాగానే ఉద్యోగుల మాదిరిగానే ప్రతినెలా ఒకటవ తేదీనే పెన్షన్లను అందించే ఏర్పాటు చేశామని, ఒకటో తేదీ సెలవు రోజు ఉన్న కారణంగా ముందు రోజే 30వ తేదీనే పెన్షన్లను మీ ఇంటి వద్దకు వచ్చి అందించామన్నారు. రాబోయే రోజుల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించి నేరుగా లబ్ధిదారులకు తాను ఫోన్ చేస్తానని, ఆలస్యంగా ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పింఛన్ల పంపిణీ బాధ్యతగా చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించానని, పింఛన్ల పంపిణీ అవినీతి రహితంగా చేయాలని, మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని ఆప్యాయంగా పలకరించి పింఛన్లను అందజేయాలని ఆదేశించామన్నారు. అందుకే ఈ కార్యక్రమానికి పేదల సేవలో అని నామకరణం చేశామన్నారు.

గత ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, విధ్వంస పాలన చేశారని, తవ్విన కొద్ది అవినీతి, అప్పులు కనబడుతున్నాయని, 10 లక్షల కోట్లు అప్పు చేశారని, అయినా కూడా నెల నెల జీతాలు ఇచ్చేవారు కాదన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని అధికారంలోకి వచ్చి మద్యాన్ని 25 సంవత్సరాలు తాకెట్టు పెట్టి అప్పులు తీసుకువచ్చారన్నారు. చాలా దుర్మార్గమైన పనులు చేశారని, ఎమ్మార్వో కార్యాలయాలను, ఆసుపత్రులను సైతం తాకట్టు పెట్టారన్నారు. నాకున్న అనుభవంతో మళ్ళీ రాష్ట్రాన్ని గట్టి ఎక్కిస్తామన్నారు. ఇందుకోసం ఆరు నెలలుగా శ్రమిస్తున్నానని, ముఖ్యమంత్రి అయ్యాక తొలి 5 సంతకాలలో ఒకటి డీఎస్సీ ఫైల్ పై సంతకం పెట్టానని, త్వరలో పిల్లలకు ఉద్యోగాలు వస్తాయన్నారు.

రెండవది పింఛన్ల పెంపు చేశామని, అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, పేదలందరూ అతి తక్కువకే ఐదు రూపాయలకే ఉదయం, మధ్యాహ్నం, రాత్ర కడుపు నిండా తింటున్నారని, రాష్ట్రంలో ఇప్పటికే 195 అన్న క్యాంటీన్లు ప్రారంభించి ఒక కోటి 25 లక్షల మందికి ఆహారం అందజేసిన ఘనత మాకు దక్కుతుందన్నారు. ఏ ఆడబిడ్డ కష్టపడకూడదని గతంలో మా ప్రభుత్వంలో ఉచితంగా దీపం గ్యాస్ కింద కనెక్షన్లు ఇచ్చామని, ప్రస్తుతం దీపం టు పథకం కింద మహిళలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నామని, మీ ఖర్చు తగ్గించాలని ఆదాయం, జీవన ప్రమాణాలను పెంచాలని ముందుకు వెళ్తున్నామన్నారు. ఇందుకోసం ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. మీరు ముందస్తుగా చెల్లించే సొమ్మును కూడా ప్రభుత్వమే చెల్లించే యోచనలో ఉందని, ప్రస్తుతం మీరు చెల్లించిన మొత్తాన్ని తిరిగి 48 గంటల్లోనే మీ ఖాతాలోకి జమ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 55 లక్షల మంది గ్యాస్ బుక్ చేసుకుని, 2,684 కోట్ల రూపాయలు ఈ పథకానికి ఖర్చు చేస్తున్నామన్నారు.

రైతుల మేలు కలిగేలా ల్యాండ్ టైటిలింగ్ రద్దు చేసామని, భూ కబ్జాల నిరోధనకు ఆంటీ ల్యాండ్ గ్రాబింగ్ ఆక్ట్ తీసుకొచ్చామన్నారు. మీ భూమి జోలికి వస్తే వారి తాట తీస్తామన్నారు. భూ రికార్డులు కూడా గత పాలకులు ఇష్టానుసారంగా మార్పు చేశారన్నారు. తనకు అందే అర్జీలలో 40 నుంచి 50 శాతం పిటిషన్లు భూ సమస్యలపైనే వస్తున్నాయన్నారు. గత పాలకులు మద్యాన్ని కూడా ఆదాయంగా మార్చుకున్నారని, ఇప్పటికే మీరు చూస్తున్నారు మద్యంపైన చెక్ పెట్టి దానిని కూడా ప్రభుత్వ ఆదాయంగా మారుస్తున్నామని, నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నామన్నారు. మద్యం తయారీ నుంచి షావులలో అమ్ముకునే వరకు వారి మనుషులని పెట్టి వచ్చినంత దోచుకున్నారన్నారు. మద్యం ధరలు రేషనలైజేషన్ చేసి నాణ్యమైన మద్యం ఇస్తున్నామని, ప్రస్తుతం ప్రభుత్వానికి ఆదాయం పెరిగే పరిస్థితి వచ్చిందని, ఆ ఆదాయం సంక్షేమ కార్యక్రమాలకే ఉపయోగపడుతుందన్నారు. మద్యం దోపిడీకి అడ్డుకట్ట వేసామని, ఎవరైనా సరే ఎక్కడైనా బెల్టు షావులు పెడితే తాను కూడా బెల్టు తీస్తానని స్పష్టంగా చెప్తున్నామన్నారు.

# మన యువతే మన భవిష్యత్తు

● మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ● కెఎల్ యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవంలో పాల్గొన్న మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ● 42 బంగారు పతకాలు ● 37 రజిత పతకాలు ● 166 మంది పి. హెచ్. డి 604 మంది ఫస్ట్ గ్రాడ్యుయేషన్ ● 3936 అండర్ గ్రాడ్యుయేషన్




మంగళగిరి మేజర్ న్యూస్: కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవం శనివారం నాడు వడ్డేశ్వరంలోని వర్శిటీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ గౌరవ అతిథిగా హాజరయి విద్యార్థులకు డిగ్రీలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ మాట్లాడుతూ తనను కెఎల్ వర్శిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించినందుకు ఆనందంగా ఉందన్నారు. యువతే మన భవిష్యత్తు అని అన్నారు. ముఖ్యంగా మనదేశంలో ఉన్న యువతకు శారీరక దృఢత్వం అవసరమన్నారు. యోగా , ప్రాణయామం, వ్యాయామం లాంటి కసరత్తులు చేస్తూ యువత ఎప్పుడూ దృఢంగా ఉండాలన్నారు. విద్య వలన వినయం వస్తుందన్నారు. వినయం మనిషిని ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందన్నారు. 21వ శతాబ్దంలో కేవలం డిగ్రీ ఉంటే సరిపోదన్నారు. డిగ్రీతో పాటు నైపుణ్యాలు నేటి యువతకు అవసరమని పేర్కొన్నారు. ప్రపంచం నూతన ఆవిష్కరణలతో దూసుకుపోతుందన్నారు. అందుకు భారత యువత కూడా ఏమాత్రం తీసిపోదన్నారు. నిత్యం నేర్చుకునే తత్వమే అత్యంత శక్తివంతమైన ఆయుధమని అన్నారు. చదువుకునేందుకు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారు ఎంతో మంది ఉండి ఉంటారని, అయితే తాను కూడా గ్రామీణ ప్రాంతం నుండే వచ్చానని చెప్పారు. ఉన్నత పాఠశాల విద్య కోసం ప్రతీ రోజు 6 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి వచ్చేవాడినని తన బాల్య జీవితాన్ని గుర్తు చేసుకున్నారు.

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ అధ్యక్షులు కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ తాము తమ వర్శిటీలో చదువుతున్న విద్యార్దులకు చదువుతో పాటు సామాజిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు తమ విద్యార్దులు వెళ్లి పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. దేశంలోనే అత్యున్నత అంతర్జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాలు కలిగి ఎ ప్లస్ సర్టిఫికేట్ ఉన్న తమ వర్శిటీ లో విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్దులు దేశ విదేశాల్లో రు.57 లక్షల రూపాయల జీతాలతో ఉద్యోగాలు సాదించి చరిత్ర సృష్టించారని తెలిపారు.

వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 4 వేల 7వందల 6 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు తెలియచేశారు. ఇందులో 166 మంది పి. హెచ్. డి, 604 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్, 3 వేల 9వందల 36 మంది అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. అలాగే గత విద్యా సంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరచిన 42 మంది విద్యార్థులకు బంగారు, 37 మందికి రజత పతకాలను, నగదు బహుమతులను అందించనున్నట్లు ఆయన చెప్పారు. తమ విశ్వ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఆయా విభాగాలలో సుమారు 170కి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. అందుకుగాను యుజిసి నుండి కెఎల్ యు కు వంద కోట్ల రూపాయల వరకు నిధులు కేటాయించబడినట్లు పేర్కొన్నారు.

# వైసిపి పాలనలో కుదేలైన టెక్స్‌టైల్ రంగం

● కేంద్ర మంత్రి పెమ్మసాని కామెంట్ ● శిలాఫలకాలు ఆవిష్కరించిన కేంద్ర మంత్రి ● చిలకలూరిపేటలో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్న మంత్రి ● వర్చువల్‌గా పోస్టల్ భవనాలు ప్రారంభం ● ప్రత్తిపాటి హయాంలోనే చిలకలూరిపేట అభివృద్ధి



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : చిలకలూరిపేట మండలంలోని గోపాలం వారి పాలెంలో గల గుంటూరు టెక్స్ టైల్ పార్క్ ను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా టెక్స్ టైల్ ఇండస్ట్రీ నిర్వాహకులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అక్కడున్న సమస్యలు, ఏ విధంగా ముందుకు తీసుకు వెళ్ళవచ్చు? ఏం చేస్తే ఎంప్లాయిమెంట్ డెవలప్ చేయగలం? అనే అంశాలపై పరిశీలన చేస్తున్నామన్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో పత్తి రైతులకు నీళ్లు ఎక్కువ అందుబాటులో లేకపోవడం వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్వాలిటీ సీడ్స్, నీటి సరఫరా పెంచగలిగితే రైతులకు సహకారం ఉంటుందన్నారుజిన్నింగ్, స్పిన్నింగ్, ఫ్యాబ్రిక్ వర్క్ సంబంధించిన వర్క్ ఇక్కడ జరుగుతుంది. సెంట్రల్ గవర్నమెంట్ నుంచి ఏదైనా 50% సబ్సిడీ వచ్చే అవకాశం ఏదైనా ఉంటే పరిశీలించాలి. మిగిలినది ఇండస్ట్రీ నిర్వాహకులు భరిస్తే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

అలాగే పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుంది అనేది నరసరావుపేటఎంపీకృష్ణదేవరాయలు, తాము కలిసి టెక్స్ టైల్ మంత్రి తో చర్చించి చర్యలు సుకునేందుకుప్రయత్నిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ లావు కృష్ణదేవరాయలు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి వుల్లారావు తదితర టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు పాల్గొన్నారు. చిలకలూరిపేటలో పోస్టల్ శాఖ నూతన భవన నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఆవిష్కరించారు. అక్కడున్న వృద్ధులకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాల, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి వుల్లారావు తో కలిసి.పెన్షన్లు అందజేశారు ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ 1వ. తేదీ ఆదివారం కావడంతో పెన్షన్ దారులకు ఇబ్బంది కలగకుండా ఒకరోజు ముందుగానే నవంబర్ 30వ తేదీన కూటమి ప్రభుత్వం పెన్షన్లను అందజేసిందని తెలియజేశారు. రాష్ట్రంలోని పేదలకు, పెన్షన్ దారులకు, బీద, బడుగు వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందనడానికి ఇదొక ఉదాహరణ అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.అనంతరం స్థానిక నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా ప్యాపిలీ, ఎర్రగొండపాలెంలోని పోస్టల్ శాఖ భవనాలను వర్చువల్ గా ప్రారంభించారు.పోస్టల్ శాఖ కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడారు మీలో ఒకడిగా కలిసి తిరిగి, మున్సిపల్ స్కూల్లో చదువుకున్నానని చెప్పారుమంత్రి అయిన తర్వాత తొలిసారిగా పల్నాటి గడ్డపై అడుగు పెట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు నన్ను తొలిసారిగా రాజకీయాలకు రమ్మని పత్తిపాటి వుల్లారావు గారు ఆహ్వానించారు చిలకలూరిపేటలో అభివృద్ధి జరిగింది అంటే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి పోరాడిన పత్తిపాటి వుల్లారావు హయాంలోనే జరిగిందన్నారు.

పోస్టల్ శాఖ గురించి గుంటూరు జిల్లా ఏపీలో ముందుండాలని, భారత దేశంలోనే ఏపీ నెంబర్ వన్ గా ఉండాలని కోరుకునే వ్యక్తిని తానని చెప్పారు.ఆ ప్రయత్నంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ను దేశస్థాయిలో నిలబెట్టినందుకు పోస్టల్ శాఖ ఉన్నతాధికారులకు నా ధన్యవాదాలు తెలిపారు పల్లెలను, పట్టణాలను పోస్టు కార్డు ద్వారా ఒక పేగు బంధం లాగా ముందుకు తీసుకు వెళుతున్న పోస్టల్ శాఖ అధికారులను అభినందించారు.ఖాకీ చొక్కా ధరించి, కరప్షన్ కు దూరంగా పనిచేసే శాఖ ఏదైనా ఉందంటే అందులో పోస్టల్ శాఖ ఒకటన్నారు. ఒక లైఫ్ ఇన్సూరెన్స్, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ఉత్పత్తులను అమెరికా వంటి విదేశాలకు సైతం పంపించే విధానంలో గానీ, కస్టమ్స్ వారితో ఇంటిగ్రేట్ చేయడం గానీ, పాస్ పోర్ట్ సేవలు సైతం మీ ఇంటి ముందుకు వచ్చాయి అంటే అది కేవలం పోస్టల్ శాఖ ద్వారా మాత్రమే సాధ్యమైంది. పోస్టల్ నుంచి ఒక లేఖ వచ్చినా, ఒక పార్సెల్ వచ్చినా, ఒక పోస్టల్ ఖాతా తెరిచినా ఒక నమ్మకంతో, కమ్యూనికేషన్స్ తో కూడుకున్న సేవలుగానే ప్రజలు గుర్తించారు ప్రస్తుతం రూ 2.60 కోట్ల నిధులతో నూతన పోస్ట్ ఆఫీస్ భవనాల నిర్మాణం చేయిస్తున్నాం అలాగే కర్నూలు జిల్లాలోని ప్యాపిలి, మార్కాపూర్ డివిజన్లోని ఎర్రగొండపాలెం ప్రాంతాల్లో కూడా నూతన పోస్ట్ ఆఫీస్ భవనాలు నిర్మింప చేస్తున్నాం. నేడు ఆంధ్రప్రదేశ్ లో పదివేలకు పైగా పోస్ట్ ఆఫీసులు ఉన్నాయి. సామాన్యుడు పార్శిల్లను పంపిస్తే దాన్ని ట్రాకింగ్ చేసే విధానం గాని, కొరియర్ పంపిస్తే అందించే సేవలు గానీ, ఆధునిక సాంకేతిక విధానం ద్వారా పారదర్శకంగా ఉండేలా పోస్టల్ శాఖ పని చేయబోతుంది. కొండవీడు ప్రాజెక్టు గురించి కూడా ఇప్పుడే మాట్లాడుకున్నాం. త్వరలోనే అందరం చర్చించి దానిపై స్పష్టమైన డిపిఆర్లు సిద్ధం చేయించి బాధ్యత తీసుకుంటాం.

కార్యక్రమము అనంతరం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఎర్రికి పోస్టల్ శాఖ ఉద్యోగులు శాఖపరమైన సమస్యలను వివరిస్తూ వినతులను అందజేశారు. అలాగే వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహుకరించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి వుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పోస్టల్ శాఖ పి.ఎం.జి మూర్తి, సిపిఎంజి ప్రకాష్, కలెక్టర్ పి. అరుణ్ బాబు, ఆర్డీవో మాధురి, తదితరులు పాల్గొన్నారు.

# టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్ర వెంకటేశం



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: నవంబర్ 30: టీజీపీఎస్సీ చైర్మన్గా విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశం నియమితులయ్యాయి. టీజీపీఎస్సీ చైర్మన్గా బీసీకి కాంగ్రెస్ సర్కార్ అవకాశాన్ని ఇచ్చింది. తెలంగాణ మొదటి పబ్లిక్ సర్వీస్ కమిషన్గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గంట చక్రపాణి నియమితులవగా... ఆ తర్వాత జనార్దన్ రెడ్డి నియామకం జరిగింది. అయితే వివిధ ఆరోపణల నేపథ్యంలో జనార్ధన్ రెడ్డి స్థానంలో మహేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారు. ఇప్పుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన బుర్ర వెంకటేశం ముఖ్యమంత్రి నియమించారు. నాలుగు సంవత్సరాల పాటు బుర్ర వెంకటేశం.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవీలో ఉండనున్నారు. డిసెంబర్ 3తో మహేందర్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. ఆ స్థానంలో బుర్ర వెంకటేశంను నియామిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. ఈనెల 20న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ నియామకం కోసం నోటిఫికేషన్ విడుదలైంది. అదే సాయంత్రం 5 గంటలకు వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో టీజీపీఎస్సీ చైర్మన్ పదవి కోసం దాదావు 45 అప్లికేషన్లు వచ్చాయి. అందులో రిటైర్డ్ ఐఏఎస్లు, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు కూడా టీజీపీఎస్సీ చైర్మన్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే చివరకు విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీగా ఉన్న బుర్ర వెంకటేశంను టీజీపీఎస్సీ చైర్మన్గా సీఎం రేవంత్ రెడ్డి ఎంపిక చేశారు. అనంతరం చైర్మన్ నియామకానికి సంబంధించిన ఫైలును గర్నవర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం కోసం రాజ్భవన్కు పంపించారు. ఈ క్రమంలో నియామకానికి సంబంధించిన ఫైల్పై గవర్నర్ ఆమోదముద్ర వేశారు. దీంతో టీజీపీఎస్సీ చైర్మన్గా బుర్ర వెంకటేశం పేరును కాంగ్రెస్ సర్కార్ అధికారికంగా ప్రకటించింది.

# అదాని అవినీతిపై గప్ చుప్

● అక్కడ ప్రధాని, ఇక్కడ సీఎం, డిప్యూటీ సీఎం ● మౌనం పాటిస్తున్న నేతలు ● అంతా జగన్ పైనే గురి



అదాని అవినీతిపై అధికార పార్టీ నేతలెవరూ పెదవి విప్పడం లేదు. ప్రధాన నరేంద్ర మోది నుంచి ఇతర రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు, ముఖ్యంగా ఏపీలోని సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు మౌనం పాటిస్తున్నారు. అవినీతిని ప్రోత్స హించిన అదాని గురించి మాట్లాడకుండా అదాని నుంచి ముడుపులు తీసుకున్న రనే ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్ పైనే అంతా గురి పెట్టారు. ఆయనపైనే దాడి చేస్తు న్నారు. అదాని గ్రూవు సంస్థలు ఉత్పత్తి చేసే సౌర విద్యుత్తును దేశంలోని వివిధ విద్యుత్ పంపిణీ సంస్థలు కొనుగోలు చేయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు అదాని గ్రూవు భారీగా ముడుపులు చెల్లించిందని అమెరికా కోర్టులో కేసు నమోదు కావడం పెను సంచలనం కలిగించింది. ముడుపుల మొత్తం రూ. 2,029 కోట్లు అందులో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దకు రూ.1,750 కోట్లు ముట్టజెప్పారన్నది ప్రధాన అభియో గం. దీంతో గౌతం అదాని ఒక అంతర్జాతీయ మోసగాడని మరోసారి రుజువయింది.

**మోడీ సర్కారు వింత వాదన** : ఈ కుంభకోణంతో కేంద్రానికి సంబంధం లేదనీ ఆ ఐదు రాష్ట్రాలదేననీ కేంద్ర ప్రభుత్వమూ, బిజెపి పెద్దలూ అంటున్నారు. కానీ ఈ పాపాల వుట్ట కేంద్రం నుండి వుట్టిందే కదా! దేశంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు తాము వినియోగించే మొత్తం విద్యుత్తులో కనీసం 10 శాతాన్ని కేంద్రీకృత సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి కొనుగోలు చేయాల్సిందేనని, (రెన్యువబుల్ ఎనర్జీ పర్చేజ్ అబ్లిగేషన్(ఆర్‌పిపిఓ)) కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశించిన మాట నిజం కాదా? కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పడిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇ సిఐ–సెకి)యే కదా ఈ ఒప్పందాలు చేసింది. కార్పొరేట్ల నుంచి విద్యుత్తును ఎక్కువ ఖరీదుకు కొనుగోలు చేసి బలవంతంగా రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు అంటగట్టే బ్రోకర్ గా సెకి తయారైంది. ఇందుకోసం యూనిట్‌కు ఏడు పైసల కమిషన్ కూడా తీసుకుంటామని ఈ ఒప్పందాల్లో సైతం పేర్కొంది కూడా! ఆర్‌పిపిఓ ను కండిషన్‌గా చూపి, ఇతర ఆశలు పెట్టి సెకి రాష్ట్రాల డిస్కంలతో ఒప్పందాలు చేసుకుంటోంది. కనుక ఈ ఒప్పందాలకు మూల కారకులు కేంద్ర పాలకులేనన్నది నిర్వివాదాంశం. అదాని అవినీతికి ప్రధాన రక్షకులు వారే!

**వైసీపీ మద్దతు :** మేం కేంద్ర ప్రభుత్వ సంస్థయైన సెకితో ఒప్పందం చేసుకున్నాం తప్ప అదానితో కాదన్న వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట వాదనకు నిలబడేది కాదు, వాస్తవ విరుద్ధమైనది కూడా! రాష్ట్ర ప్రభుత్వ రంగంలోని మూడు డిస్కంల సిఎండిలు చేసుకున్న ఒప్పందంలో విద్యుత్ సరఫరా అదాని గ్రీన్ నుండి జరుగుతుందనీ, కమిషన్‌గా సెకి కి యూనిట్‌కు ఏడు పైసలు చెల్లిస్తామనీ సంతకాలు చేశారు కదా! ఇక ఒప్పందం అదానితో కాదంటూ బుకాయిస్తే ఎలా? జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సౌర విద్యుత్ ఒప్పందమేగాక అదానికి అనేక రూపాల్లో ఈ రాష్ట్ర సంపదను హారతి పళ్లెంలో పెట్టి అప్పగించిన మాట వాస్తవం కాదా? విశాఖపట్నం మధురవాడలో డేటా సెంటర్ పేరిట రూ. వేల కోట్ల విలువ చేసే 270 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించారు. గంగవరం పోర్టు యజమాని డివిఎస్ రాజు కుటుంబాన్ని ఇడి, సిబిఐ ద్వారా బెదిరించి అదాని గుంజుకున్నారు. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వానికున్న 10.4 శాతం వాటాను జగన్ సర్కారు అదానికే కారుచౌకగా అప్పగించింది. శ్రీకాకుళం జిల్లాలో కొత్తగా నిర్మిస్తున్న మూలపాడు పోర్టు కూడా అదే అదాని గ్రూవునకు కట్టబెట్టారు. ఐదు జిల్లాల్లో 6,200 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి పవర్ ప్రాజెక్టులను ఎలాంటి టెండర్లూ లేకుండానే కట్టబెట్టారు. అంతకుమించి ఏజెన్సీ (ఐదవ షెడ్యూల్ ప్రాంతం)లో రాజ్యాంగాన్ని, పీసా చట్టాన్ని సైతం ఉల్లంఘించి అదానీకి ఇచ్చేశారు కదా! ఇన్ని చేసి మళ్లీ బుకాయింవులా?

**పెదవి విప్పని బాబు! :** ప్రతిపక్షంలో ఉండగా సెకి ఒప్పందంపై విమర్శలు చేసిన టిడిపి నాయకులు ఇప్పుడు నోరెత్తడం లేదు. ఒప్పందంలో రూ.2029 కోట్ల అవినీతి ఉందని, అందులో రూ.1757 కోట్లు జగన్‌కు అందినట్లు అమెరికా న్యాయ విభాగం తేల్చిన నేపథ్యంలో ఒప్పందంలో ఏముందో వివరించే పత్రాలను బయటపెట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. రూ.1.99 పైసలకు వచ్చే విద్యుత్‌ను రూ.2.49 పైసలకు గత ప్రభుత్వం ఎందుకు కొన్నదో బయటపెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆ పనిచేయకపోతే ఈ విషయంలో జగన్ మోహన్ రెడ్డిని సమర్థించినట్లే భావించాల్సి ఉంటుంది. చంద్రబాబు, జగన్ విధానాలు ఒక్కటేననీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వచ్చారు తప్ప, రాష్ట్రంలో ఇంకేమీ మారలేదని ఎవరైనా అంటే కాదనలేము కదా! పాత విధానాలే అమలవుతున్నాయని, అదానీతో జగన్ చేసుకున్న ఒప్పందాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారని జనం భావించక తప్పదు. అలాగే, మోడీ, జగన్ ఇద్దరూ మంచి స్నేహితులు కనుక కేంద్రంలోనూ దీనిపై చర్చ లేదు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి కూడా ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ కుంభకోణం గురించి కానీ అదాని పేరు కానీ ప్రస్తావించేందుకు కూడా సాహసించ లేదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మౌనం వీడి జగన్‌పై చర్య తీసుకోవాలన్నది జన వాక్యం


సెకి తో డిస్కంలు ఒప్పందం చేసుకోవడాన్ని సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు వ్యతిరేకించాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఎదుట పబ్లిక్ హియరింగ్‌లలో ఆయా సందర్భాల్లో లేవనెత్తారు. అయితే, ఈఆర్‌సి యథావిధిగా బుల్డోజ్ చేసింది.

**ప్రజలపై భారాలు :** సోలార్ విద్యుత్ యూనిట్ రూ.1.99 కి టెండర్లు పడిన రోజుల్లో సెకితో రూ.2.49 కి కొంటామని ఒప్పందం చేసుకున్నారు. దానికి తోడు అంతర్రాష్ట్ర రవాణా (ఐఎస్‌టిఎస్) చార్జీల పేరిట యూనిట్‌కు రూ.1.70 అదనం. 25 ఏళ్లపాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్ల రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. ఇది మోయలేని భారమే! రాష్ట్రంలో ఇటీవల తీసుకొచ్చిన ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు కూడా అదాని కంపెనీవే! ఇప్పుడున్న మీటర్లు కచ్చితంగా పని చేస్తున్నాగాని మీటర్ మార్చాల్సిందే! దాని విలువ 13 నుండి 18 వేల రూపాయలు ఏడు నుండి తొమ్మిదేళ్లలో నెలనెలా వినియోగదారులే చెల్లించాలి. మోడీ సర్కారు తెచ్చిన ఆర్‌పిపిఓ పర్యవసానంగా రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు కచ్చితంగా వినియోగించాలనే (మస్ట్ రన్) కేటగిరీ కింద సెకీతో ఒప్పందాలు చేసుకున్నాయి. రాష్ట్రప్రభుత్వం జెన్‌కో ఆధ్వర్యంలో వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి నెలకొల్పిన థర్మల్ ప్లాంట్ల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోకుండా, ప్రైవేటు కంపెనీల సోలార్ తప్పనిసరిగా వినియోగించుకోవలసిన కేటగిరీ కింద ఒప్పందం చేసుకోవడం ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీయడానికే! ఈ ఒప్పందాల పర్యవసానంగా విద్యుత్ కొనుగోలు ఖర్చు పెరిగింది. ఇలాంటి నిర్ణయాలమూలంగా విధిస్తున్న ఎఫ్‌పిపిసిఎ చార్జీలను వ్యతిరేకించాల్సిందే. గతంలో కొన్న విద్యుత్‌కు ఇప్పుడు చార్జీలు విధించడం అంటే గత విద్యుత్ చార్జీల టారిఫ్‌ను ఇప్పుడు పెంచడమే అవుతుంది. ఇది వాయిదా వేసిన చార్జీల టారిఫ్ పెంపుదలగా భావించాలి. ఏ సరుకుకూ లేని విధంగా గతంలో వాడిన దానికి ఇప్పుడు రేట్లు పెంచి వసూలు చేయడం దారుణం. అందువల్ల ఈ ట్రూఅప్, సర్దుబాటు చార్జీల విధానాన్ని వ్యతిరేకించాలి.

అమెరికా కోర్టులో కేసు నమోదైన వెంటనే కెన్యా ప్రభుత్వం అదాని గ్రూవుతో చేసుకున్న ఎయిర్‌పోర్ట్ ఒప్పందాన్ని రద్దు చేసింది. శ్రీలంక ప్రభుత్వం అదాని గ్రూవుతో ఒప్పందాలపట్ల వునరాలోచన చేస్తున్నట్టు ప్రకటించింది. బంగ్లాదేశ్ సర్కారు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసింది. అదే విధంగా మన రాష్ట్రంలో అదాని గ్రూవుతో చేసుకున్న విద్యుత్, పోర్టులు, డేటా సెంటర్ తదితర ఒప్పందాలన్నిటినీ ప్రభుత్వం రద్దు చేయడం అవశ్యం. గౌతం అదాని, ఇతర నిందితులను అరెస్టు చేయాలి. ఈ దిశగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

# తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేధం

## నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ నిర్ణయించింది. నిత్యం గోవింద నామాలతో మారుమోగే పవిత్రమైన తిరుమల దివ్య క్షేత్రంలో, గత కొంతకాలంగా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన రాజకీయ నాయకులలో కొంతమంది, దర్శనానంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోందని భావించిన టీటీడీ బోర్డు ఇటీవల రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని తీర్మానం చేసింది. తిరుమలకు విచ్చేసి రాజకీయ విమర్శలు చేసే వ్యక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతీసే ప్రసంగాలకు దూరంగా ఉండి టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలియ చేసింది.

# దమ్ముంటే నిరూపించండి

● కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రవీణ్ కుమార్ సవాల్

తెలంగాణ బ్యూరోప్రతినిధి: గురుకులాల్లో జరుగుతున్న ఘటనల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందనే అనుమానం ఉంది... ఆయన ఒక మాఫియాను నడిపిస్తారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ స్పందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ సవాల్ విసిరారు. దమ్ము ఉంటే తన మీద విచారణకు ఆదేశించాలని ఛాలెంజ్ చేశారు. ఏ విచారణకైనా తాను సిద్ధమని అన్నారు. శనివారం ఏబీఎన్తో ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. దమ్ముంటే తన మీద విచారణకు ఆదేశించాలని చెప్పారు. తన విద్యార్థులు గురుకులాల్లోనే కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉంటారని గుర్తుచేశారు. రూ. 99 కోట్లు కాదని.. రూ. 999 కోట్లు పేద విద్యార్థుల కోసమే ఖర్చు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రభుత్వం మీది ... నిఘా వ్యవస్థలు మీ చేతిలోనే ఉన్నాయి' అని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి అనుకుంటే నేరుగా తన మీద విచారణ చేయించవచ్చు అని తెలిపారు. చిల్లర మాటలు కొండా సురేఖాకు సరి కావని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇటీవల గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్ వాడీ కేంద్రాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయి. నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాలలో వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు ఆహారం కలుషితం అయ్యింది. వందల సంఖ్యలో విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వగా.. చికిత్సపొందుతూ ఓ విద్యార్థిని మృతిచెందింది. ఫుడ్ పాయిజన్ ఘటనలపై తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం సైతం దాఖలైంది.




# రైతులే బ్రాండ్ అంబాసిడర్లు

## అభివృద్ధిని అడ్డుకోవద్దు

● ఏడాదిలోపే రూ. 18 వేల కోట్ల రుణమాఫీ ● వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్ ● కల్వకుంట్ల దోపిడి అంతా ఇంతా కాదు ● కుట్రలు, కుతంత్రాలకు బెదరను ● రైతు పండుగ సభలో సీఎం రేవంత్ రెడ్డి



మహబూబ్నగర్ బ్యూరో, మేజర్ న్యూస్ : కాంగ్రెస్ ప్రభుత్వానికి, తనకు రైతులే బ్రాండ్ అంబాసిడర్లు అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే వారి రుణం తీర్చుకోవడానికి రాష్ట్రంలో ఏడాది పాలన లోపే రూ. 18 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన రైతు పండుగ సభలు మొట్టమొదటి సారి శనివారం సాయంత్రం మహ బూబ్నగర్లో జరిగాయి. అమిస్తాపూర్లో ఏర్పాటు చేసిన రైతు పండు గకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లక్షలాది మంది రైతులను ఉద్దేశించి సియం మాట్లాడుతూ వరి ధాన్యం పండించ డంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. వరి ధాన్యం ఉత్పత్తి కోసం రైతులకు 500 బోనస్ ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా 77 వేల ఎకరాల్లో 158 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగిందని ఇది తమ ప్రభుత్వ ఘనతగా ఆయన చెప్పుకొచ్చారు. ఇందుకు రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత కరెంటు, వరి ఉత్పత్తికి బోనస్, సాగునీరు వంటి సౌకర్యాలు కల్పించడం ద్వారా రైతు కుటుంబాల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ముఖ్యంగా తనపై కుట్రలు చేసేందుకు ప్రతిపక్షాలు బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు తిప్పి కొడుతున్నట్లు తెలిపారు. గత 10 సంవత్సరాలు ఏకధాటిగా రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందన్నారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన దోపిడి అంతా ఇంతా కాదు అని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మండి పడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసిన తాను భయపడను అని స్పష్టం చేశారు. అభివృద్ధిని అడ్డుకుంటే తొక్కుకుంటు వెళ్తా తప్ప వెను తిరిగి చూడను అన్నారు. వైయస్ఆర్ ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. వెనుకబడిన ప్రాంతమైన మహబూబ్నగర్ జిల్లా దత్తత తీసుకుంటాము అని ఆనాడు అనేక మంది పాలకులు చెప్పారే తప్పా జిల్లాను అభివృద్ధి చేసింది ఏమి లేదు అన్నారు. ఇప్పుడు దత్తత అవసరం లేదు ఈ జిల్లా బిడ్డగా అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు.



ఈ జిల్లా అభివృద్ధి కోసం ఏడాదికి 20 వేల కోట్ల రూపాయలు తీసుకో వద్దా ? ఈ లెక్కన 5 సంవత్సరాల కాలంలో పెద్ద ఎత్తున నిధులను రాబ ట్టి మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో 1300 ఎకరాల భూసేకరణ చేపట్టి పరిశ్రమలు స్థాపించి పేదలకు నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి అనుకుంటే భూములు గుంజుకుంటున్నారు అని బిఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్ని రైతులను రెచ్చ గొట్టారు అని ఆరోపించారు. ఏకంగా కలెక్టర్పై దాడి చేయించి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసే పని చేశారు అన్నారు. రైతులు అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు అని హెచ్చరించారు. రైతులు కూడా వస్తావాలు గ్రహించి బిఆర్ఎస్ నేతల కుట్రలకు మోసపోవద్దు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫాంహౌస్కు 1000 ఎకరాల భూమి ఉండగా కొడంగల్ ప్రజల కోసం 1300 వందల ఎకరాలు భూమి సేకరించ వద్దా అని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన రైతులకు తక్కువ నష్ట పరిహారం ఇస్తున్నాము అని ప్రచారం చేయడం పద్దతి కాదు అన్నారు. 10 లక్షలు కాదు అవసరమైతే 20 లక్షలు కూడా ఇచ్చే సత్తా అధికారం తనకు ఉందన్నారు. కొడంగల్లో పరిశ్రమలు స్థాపిస్తే ఉపాధి అవకాశాలు కలగడంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కెసిఆర్ మాదిరిగా కొకాపేట భూములు అమ్మి ఆ సొమ్మును రైతులకు చెల్లించే స్థితి తమ ప్రభుత్వానికి లేదు అన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన మల్లారెడ్డి అనే రైతు తన చితిపై తానే నిప్పుఅంటించుకొని చనిపోతే అప్పుడు



మంత్రి హరీష్ రావు కన్నీళ్లు ఎక్కడ ఉన్నాయి అని ప్రశ్నించారు.

**రుణమాఫీపై మోడీ, కెసిఆర్ బహిరంగ చర్చకు సిద్ధమేనా..?: సియం**

ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణలో 10 నెలల కాలంలోనే రైతులకు పెద్ద ఎత్తున రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తం గా 25 లక్షల రైతు కుటుంబాలకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఈ విషయంలో ప్రధాని మోదీగాని, మాజీ సియం కెసిఆర్ గాని బహిరంగ చర్చకు రావాలి అని ఆయన సవాల్ విసిరారు. ఈ అంశంపై చర్చించేందుకు ఇద్దరు కలిసివచ్చినా సరే అని ఆయన అన్నారు. డిప్యూటీ సియం మల్లు భట్టి విక్రమార్క మాట్లా డుతూ ప్రాజెక్టుల పేరుతో టిఆర్ఎస్ ప్రభుత్వం అడ్డంగా దోచుకుందని మండిపడ్డారు. కాళేశ్వరం, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు కూలి పోయాయి అని విమర్శించారు. ఇక్కడ నుండి నీళ్ల లేకున్నా పెద్ద ఎత్తున లక్షల టన్నుల పంట ఉత్పత్తి చేసే విధంగా రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు 15 ఆగష్టు లోగా రైతులకు రుణమాఫీ చేశాము అన్నారు. ఈ సభలో మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, దామోదరం రాజ నర్సింహా, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాలకు
# అన్యాయం జరగనీయం

● మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ప్రభుత్వ ప్రతినిధిగా ప్రభుత్వంలో భాగస్వామీ గా బలహీన వర్గాల మంత్రిగా ఇప్పు దున్న పాలసి ల కంటే మంచి పాలసీ తీసుకొని బలహీన వర్గాలకు ఎక్కడ అన్యాయం జరగకుండా చూసుకుం టామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం గచ్చిబౌలిలోని టీ హాబ్లో జరిగిన బీఐసీపీఐ అవార్డ్స్ -2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభా కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బిక్కి వార్షిక అవార్డుల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన బీసీ పారిశ్రామిక వేత్తలకు లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డులను ప్రదానం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకొచ్చింది. అందులో బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలు లేవని మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకుపోయా. వెంటనే బీసీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఒక కమిటీని ఏర్పాటు చేశాం. అందులో ఎఎస్ఎంఈ పాలసీ లో బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలు చేర్చాలని కమిటీ నిర్ణయం తీసుకుంది.

బలహీన వర్గాలకు సంబంధించి హబ్ పెట్టాలన్న ఎమ్మెస్ఎమ్ఈ కి సంబంధించి అంశాలు ఏం పెట్టలనేదానిపై బలహీన వర్గాలు మంత్రిగా చర్చిస్తాం. దేశంలోనే మొదటిసారి సామాజిక ఇంటింటి కుల సర్వే జరుగుతుంది సర్వేకి అందరూ సమాచారం ఇవ్వండి... ఎవరైనా సర్వేలో పాల్గొనకపోతే భాగస్వామ్యం కండి బలహీన వర్గాలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకుల తో సడలింపు ఇచ్చేలా డిఫాల్టర్ కాకుండా ట్రేడింగ్ ఎంటర్ప్రైజర్ పెంచుకుంటూ ముందుకు పోవాలి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా వ్యవహరిస్త అని చెప్పారు. బలహీన వర్గాల నుండి నా గొంతు వినిపిస్తా ప్రభుత్వంలో మనకు న్యాయం చేసుకునే విధంగా అండగా ఉంటా. రెండు రోజుల్లో ఈ పాలసీలో చేర్చాల్సిన అంశాలపై కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాలకు పారిశ్రామికంగా ప్రోత్సహించడానికి అందులో ఏం చేర్చలేనేదానిపై చర్చిస్తామని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ఎన్ని మంచి పనులు చేసినా
# బీఆర్ఎస్ అబద్ధాలు ప్రచారం చేస్తోంది

● టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



తెలంగాణ బ్యూరోప్రతినిధి: తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబంతో సహా బీఆర్ఎస్ నాయ కులు ఇష్టం వచ్చినట్లు దోచుకుని నాశనం చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్కుమార్ గౌడ్ ధ్వజ మెత్తారు. తమ ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా భారాస అబద్ధాలు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని కాంగ్రెస్ నేతలకు పిలుపునిచ్చారు. కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, అన్ని రకాల పదవుల్లో నాయకులకు అవకాశం ఇస్తామని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. శనివారం గాంధీభవన్లో ఎస్టీ సెల్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో మహేష్కుమార్గౌడ్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రిని చేసేందుకు మనందరం కృషి చేయాలన్నారు. నాగార్జునసాగర్లో వారంరోజులపాటు ఆదివాసీ క్యాంపు ఏర్పాటు చేసి వారి అంశాలపై లోతుగా చర్చిస్తామని ఏఐసీసీ నాయకుడు కొప్పుల రాజు తెలిపారు. ఆదివాసీ క్యాంపులో రోజుకు 7, 8 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు.


# ప్రజలంతా సర్వేకు సహకరించాలి

● కుల సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న మంత్రి కొండా సురేఖ ● వీలైనంత త్వరలో సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచన ● రైతుపై పులి దాడితో మంత్రి దిగ్భ్రాంతి ● ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచన

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు అదేశం

తెలంగాణ బ్యూరోప్రతినిధి: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో వివరాలు నమోదు చేయించుకున్నారు. జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, సూపర్వైజర్గంగాధర్ ,ఎన్యుమరేటర్ రమేష్ ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సర్వే పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం మేరకు వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేలా కార్యాచరణను అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రజలంతా తప్పనిసరిగా సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని వారిని ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఈ మహా యజ్ఞం విజయవంతమయ్యేలా సహకరించాలని మంత్రి కొండా సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని ఈజ్గాంలో పులి దాడి ఘటనలో మరణించిన గన్నారం మండల వాసి కళ్యాణి కుటుంబానికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూ. 10 లక్షల పరిహారం అందజేత ప్రక్రియను పూర్తి చేసినట్లు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ ప్రకటించారు. పత్తి సేకరణకు వెళ్లిన కళ్యాణి పులి దాడిలో మరణించడం తనను ఎంతో వేదనకు గురి చేసిందని పేర్కొన్నారు. శాఖాపరంగా అటవీ శాఖ అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ ఈ దుర్ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. నష్టపరిహారంతో పాటు వారి కుటుంబ అవసరాల మేరకు తగిన విధంగా సహాయ, సహకారాలను అందిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

సిర్పూర్ (టి) మండలంలోని దుబ్బగూడెంలో సురేష్ అనే రైతుపై మరో దాడి ఘటన జరగడంతో మంత్రి సురేఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ జిల్లా డిఎఫ్ఓ నీరజ్ ను రైతు పరిస్థితి పై ఆరా తీశారు. ప్రాథమిక చికిత్స అనంతరం రైతు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల జిల్లా హాస్పిటల్ కు సురేష్ ను తరలిస్తున్నట్టు డిఎఫ్ఓ మంత్రికి వివ రించారు. ప్రస్తుతం పులి కదలికల పై సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మహారాష్ట్ర వైపు పులి కదలికలను గుర్తించినట్టుగా డిఎఫ్ఓ మంత్రికి తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల పశువులపై కూడా పులి దాడి ఘటనలు నమోదైన నేపథ్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి పిసిసిఎఫ్ ను



ఆదేశించారు. వ్యవసాయ పనులకు వెళ్లేవారు, పశువులను మేతకు తీసుకొని పోయేవారు జాగ్రత్తగా ఉండాలనీ, అటవీ శాఖ సూచనలను పాటించాలని మంత్రి సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు. పులి సంచారానికి సంబంధించిన జాడలు కనిపించడం, పులిని చూసినట్లుగా ఎవరైనా సమాచారం అందించిన పక్షంలో సమీప ప్రాంతాల ప్రజలను వెంటనే అప్రమత్తం చేయాలని అటవీ అధికారులకు సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన కార్యాచరణను అమలు చేయాలని అటవీ అధికారులను నిర్దేశించారు. రాకపోకల సందర్భంగా పులి నుంచి ప్రమాదం పొంచి ఉందని భావించిన పరిస్థితుల్లో పులి దాడి నుంచి బయటపడడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సురేఖ అటవీ అధికారులకు స్పష్టం చేశారు.

# తెలంగాణకు ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్

● నేడు, రేపు తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన
● హెచ్చరించిన వాతావరణ శాఖ



తెలంగాణ బ్యూరోప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఫెంగల్ తుఫానుగా మారి మరికొన్ని గంటల్లో తీరం దాటనుంది. తమిళనాడు, పుదుచ్చేరి వైపు.. బలంగా దూసుకొ స్తున్న ఈ ఫెంగల్ తుఫాను కారణంగా తమిళనాడు వ్యాప్తంగా చాలా జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నా యి. ఏపీలో చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలో కూడా ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్తో వర్షాలు కురవనున్నాయి. నేడు, రేపు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురవ నున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రెండ్రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా క్లౌడీ వెదర్ కండిషన్స్ ఉండనున్నాయి. తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసే అవకా శాలు ఉన్నాయి. నాగర్కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, ఖమ్మం, భద్రాది కొత్త గూడెం జిల్లాల్లో వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

# పోషకాహార తెలంగాణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

● అంగన్ వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో గ్యాప్ ఉండొద్దు
● 100 శాతం టార్గెట్ను రీచ్ కావలిసిందే
● మూడు నెలల సమయం ఇస్తున్నాం
● పాల సరఫరాను విజయ డెయిరీ మెరుగు పరుచుకోవాలి
● ఆరోగ్య లక్ష్మీ పథకంపై మంత్రి సీతక్క సమీక్ష

తెలంగాణ బ్యూరోప్రతినిధి: అంగన్ వాడీ కేంద్రాలకు చేసే పాల సరఫరాలో ఎటువంటి గ్యాప్స్ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు జారీచేసారు. మారు మూల ప్రాంతాల్లోని అంగన్ వాడీ కేంద్రాలను సకాలంలో పాల సరఫరా జరగాల్సిందేనని స్పష్టం చేసారు. పోషకాహర తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య లక్ష్మీ పథకం పై మంత్రి సీతక్క శనివారం నాడు సచివాలయంలో తన చాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రాలకు జరుగుతున్న పాల సప్లై పై మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులతో కలసి మంత్రి సీతక్క సమీక్షించారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహరం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని అమలు చేస్తుంది. ఇందులో బాగంగా ప్రతి రోజ 200 ఎం ఎల్ పాలను గర్భిణీలు, బాలింతలకు




అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పంపిణి చేస్తారు. ప్రభుత్వ విజయ డెయిరీ టెట్రా ప్యాకెట్ల అంగన్ వాడీ కేంద్రాలకు సప్లై చేస్తుంది. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 1.67 కోట్ల లీటర్ల సరఫరా కోసం ఆర్డర్ చేయగా...1.56 కోటి లీటర్ల పాలను విజయా డెయిరీ సరఫరా చేయగలిగింది.

అంటే 94 శాతం మేర సప్లై చేయగలిగింది. అయితే కొన్ని అంగన్ వాడీ సెంటర్లకు సకాలంలో పాలు సప్లై కాకపోవడం పట్ల మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం కోరినంత మేర పాలు సరఫరా చేయగలరా? లేదా?..అంత సామర్థ్యం ఉందా? లేదా? సరిపోయినంత సప్లై చేసే శక్తి లేకపోతే..మీ ఇండెంట్ ను తగ్గించి ఇతర సంస్థల ద్వారా సప్లై చేసుకోవాలా అని విజయ డెయిరీ ప్రతినిధులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. మరో మూడు నెలల పాటు అవకాశం ఇస్తామని..పాల సరఫరా సంతృప్తికరంగా లేకపోతే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ విజయ డెయిరీ రైతుల నుంచి పాలను సేకరిస్తుందని...అందుకే రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు విజయ డెయిరీ నుంచి పాలను కొనుగోలు చేస్తున్నామని గుర్తు చేసారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు తమకు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంరక్షణ అంతే ముఖ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేసారు. అందుకే అంగన్ వాడీ కేంద్రాలకు జరిగే పాల సప్లై లో ఏలాంటి గ్యాప్స్ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ఆరోగ్య తెలంగాణ, పోషకాహర తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని..ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అయ్యే పాల నాణ్యతను స్వయంగా రుచి చూసి మంత్రి సీతక్క పరిశీలించారు. పాల నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. ప్రస్తుతం లీటర్ టెట్రా ప్యాక్ ను రూ.57 కి విజయ డెయిరీ సరఫరా చేస్తుంది. ధరలను సవరించాలని విజయా డెయిరీ ప్రతిపాదించగా..మంత్రి తిరస్కరించారు. మూడు నెలల పాటు ఏలాంటి గ్యాప్స్ లేకుండా పాలను సరఫరా చేసిన తర్వాత మరో సారి సమీక్షించి ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేసారు.

# 317 జీవో బాధితులు అందరికీ న్యాయం చేయాలి

● టీపీటీఫ్ అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్,
● ప్రధాన కార్యదర్శి నన్నే బయిన తిరుపతి డిమాండ్




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సబ్ కమిటీ ఇచ్చిన రిపోర్టు మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం స్పౌజ్, విడోస్, మ్యూచ్ వల్ బదిలీలపై జారీ చేసిన మార్గదర్శకాలను స్వాగతిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. అనిల్ కుమార్ తెలిపారు. 317 జీవో ద్వారా అన్యాయానికి గురైన ఉపాధ్యాయుల ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రుల సబ్ కమిటీ ఇచ్చిన రిపోర్టును రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. ఈనాటి వరకు కూడా రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను అమలు చేయకపోవడంతో ఉపాధ్యాయులలో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. రాష్ట్ర క్యాబినెట్ లో ఆమోదించిన విధంగా మిగిలిపోయిన 13 జిల్లాల స్పౌజ్ కేటగిరి ఉపాధ్యాయుల,మెడికల్ గ్రౌండ్ ఉపాధ్యాయుల, మ్యూచువల్ టీచర్ల బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. 317 జీవోలో స్థానికత కోల్పోయిన వేలాదిమంది ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్పోస్ కేటగిరీలో సెంట్రల్ హౌస్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా చేర్చాలన్నారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు కూడా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. టిపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ... ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ లో ఓటు హక్కు కల్పించేటువంటి విధంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి, రాజ్యాంగ సవరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయిని పోస్టును కేటాయిస్తూ, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన సర్వే విధులు ప్రాథమిక పాఠశాలలకు అప్పజెప్పడం వల్ల గత 15 రోజులుగా పాఠశాలలు ఒక పూట మూసివేయడం తద్వారా విద్యార్థులకు అభ్యసనములో తీవ్రమైన నష్టం జరిగిందని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆన్లైన్ విధుల నుండి ఉపాధ్యాయులను తప్పించి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జిహెచ్ఎంసిని లూటీ చేస్తున్నాయి


● కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు
● బీజేపీ కార్పొరేటర్ల నిరసన

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీఆర్ఎస్, కాంగ్రెస్, ఏంఐఏం పార్టీలు కలిసి బల్దియాను లూటీ చేస్తున్నారంటూ బీజేపీ కార్పొరేటర్లు నినాదాలు చేశారు. స్టాండింగ్ కమిటీ మీటింగ్కు వచ్చిన మేయర్ను బీజేపీ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని అడ్డుకునేందుకు బీజేపీ కార్పొరేటర్లు యత్నించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ కార్పొరేటర్లు ఇవాళ శనివారం నిరసన చేపట్టారు. దీంతో కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వెంటనే కౌన్సిల్ సమావేశాన్నినిర్వహించాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఇవ్వాళ జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని అడ్డుకుంటామని బీజేపీ కార్పొరేటర్లు తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి బల్దియాను లూటీ చేస్తున్నాయంటూ బీజేపీ కార్పొరేటర్లు నినాదాలు చేశారు. స్టాండింగ్ కమిటీ మీటింగ్కు వచ్చిన మేయర్ను బీజేపీ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని అడ్డుకునేందుకు బీజేపీ కార్పొరేటర్లు యత్నించారు. దీంతో భారీగా పోలీసుల మోహరించారు. పోలీసులకు, బీజేపీ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ తోపులాటలో కొంతమంది కొందపడిపోయారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్యపూరితంగా వ్యవహరిస్తోందని బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. బీజేపీ కార్పొరేటర్లను సమావేశంలో లోపలకు పోలీసులు అనుమతించలేదు. స్టాండింగ్ కమిటీలో బీజేపీ మినహా కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఉన్నారని చెప్పారు. అన్ని డివిజన్లలో పన్నులు వసూలు చేసి కేవలం ఓల్డ్ సిటీ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అడ్వర్టైజ్మెంట్ డిపార్ట్మెంట్లో రూ. 500 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపించారు.

# రైతుబంధును బంద్ పెట్టేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర

● మాజీ మంత్రి హరీశ్ రావు

తెలంగాణ బ్యూరోప్రతినిధి: సాగుకు పెట్టుబడి సాయం అందించి రైతన్నకు భరోసా కల్పించిన రైతుబంధు పథకాన్ని శాశ్వతంగా బంద్ పెట్టే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపడం సిగ్గుచేటని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. రైతుబంధు కంటే సన్నాలకిచ్చే రూ.500 బోనసే మేలని రైతులు చెబుతున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి చెప్పడం శోచనీయమన్నారు. ప్రపంచంలో రైతుకు పెట్టుబడి సాయం అందించిన ఏకైక పథకం రైతుబంధు అని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించిందని గుర్తుచేశారు. అలాంటి గొప్ప పథకాన్ని ఒక ప్రణాళిక ప్రకారం రూపుమాపే ప్రయత్నం చేస్తుండడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే 5,19,605 క్వింటాళ్ల సన్న వడ్లను క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ లెక్కన రైతులకు దక్కిన బోనస్ సుమారు రూ.26 కోట్లు మాత్రమేనని చెప్పారు. అదే రైతుబంధు కింద ఏడాదికి రూ.7500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పినట్లు ఎకరాకు రూ.15 వేలు చెల్లిస్తే ఇది ఇంకా ఎక్కువ అవుతుందని తెలిపారు. మరి రైతు బంధు కంటే, బోనస్ అందించడం రైతులకు మేలు ఎట్లవుతుందో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ సగం మందికి చేసి, సగం మందికి మొండి చేయి చూపారని విమర్శించారు. ఆ తర్వాత అన్ని పంటలకు బోనస్ అని, చివరకు సన్నాళ్లకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు రైతుబంధును



శాశ్వతంగా రద్దు చేసే ప్రయత్నం మొదలుపెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధును బందు చేస్తారని కేసీఆర్ గారు ముందే హెచ్చరించారని గుర్తుచేశారు. అనుకున్నట్టే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నదని చెప్పారు. రైతు భరోసా వస్తదని ఎదురుచూస్తున్న రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు మోసపోయినట్లేనా అని ప్రశ్నించారు. రైతులను విజయవంతంగా మోసం చేసినందుకు రైతు పండుగ నిర్వహిస్తున్నావా రేవంత్ రెడ్డి అని నిలదీశారు. మేనిఫెస్టోలో చెప్పి, రైతులను నమ్మించి అధికారంలోకి వచ్చాక దగా చేసినందుకు విజయోత్సవాలా రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. రైతుల బతుకులు మార్చేందుకు కేసీఆర్ తీసుకొచ్చిన రైతు బంధు పథకాన్ని నిలిపివేసే కుట్రను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. శనివారం మహబూబ్నగర్లో నిర్వహించే కార్యక్రమంలో రైతు బంధు అమలుపై స్పష్టత ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న వానకాలం రైతుబంధుతో పాటు, యాసంగికి పంట పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# రేవంత్ రెడ్డి కెసిఆర్నే ఫాలో అవుతున్నారు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అహంకారిపూరిత వైఖరినే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాలో అవుతున్నారని కేంద్రమంత్రి కిషన్రెడ్డి ఆరోపించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్కు డిపాజిట్ రాలేదని చెప్పారు. మోదీ నాయకత్వంలో తెలంగాణలో అధికారం బీజేపీదేనని తెలిపారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా సహాయం అందించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నుంచి నిధులు ఇస్తుందని.. ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆందోళనలో ఉన్నారని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా 731 నుంచి 757 మిలియన్ల ప్రపం మానవాళి ఆకలి కేకలు పెడుతున్నారని, ప్రతి 11 మందిలో ఒక్కరు ఆకలి వలయంలో చిక్కి బక్కపడుతున్నారని తాజాగా ఐరాస ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన "స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్ 2024 (ఎస్ఓఎఫ్ఐ-2924)" నివేదిక స్పష్టం చేసింది. ఆహార అభద్రత, పోషకాహార లోపాలు ప్రపంచ మానవాళిని వెంటాడుతున్నాయని, ఆసియా ఖండంలోనే అత్యధిక పోషకాహార లోపంతో బాధపడుతున్న ప్రజలు ఉన్నారని తెలుస్తున్నది. 2023లో దాదాపు 2.33 బిలియన్ల ప్రపంచ ప్రజలు సాధారణ లేదా తీవ్రమైన ఆహార అభద్రతలో బతుకులు ఈడుస్తున్నారని పేర్కొనబడింది. తీవ్రమైన ఆహార అభద్రతలో 864 మిలియన్ల ప్రపంచ ప్రజలు ఉన్నారని, ప్రతి ఒక్కరికి రోజుకు సగటు ఆరోగ్యకర భోజన ఖర్చులు 3.96 డాలర్లు ఉందని నివేదిక తెలిపింది. దాదాపు 55.6 శాతం భారతీయులు ఆరోగ్యకర భోజనాలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తున్నది. ఐదేళ్ల లోపు పిల్లల్లో స్టంటింగ్, వేస్టింగ్ సమస్యలు తగ్గినట్లు, ప్రపంచవ్యాప్తం స్థూలకాయ సమస్యలు పెరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. 15 - 40 ఏండ్ల లోపు మహిళల్లో రక్తహీనత పెరుగుతూ ప్రజారోగ్యం సమస్యగా నిలుస్తున్నదని వర్ణించబడింది. భారత్‌లో ఆహార భద్రత, పోషకాహారం పెంచడానికి నిధులు పెంచినప్పటికీ ఇంకా ఎంతో ప్రగతి సాధించాల్సి ఉందని గమనించారు.

## ప్రపంచ ఆకలికి అంతమే లేదా !

ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో 194.6 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపాలతో గడుపుతున్నారని, దీర్ఘ కాలం పాటు ఆహార అభద్రత సమస్యలతో సతమతం అవుతూ 13 శాతం ప్రజలు తీవ్రమైన పోషకాహార లోప సమస్యలతో బాధ పడుతున్నట్లు తేలింది. "2023 ప్రపంచ ఆకలి సూచీ" జాబితాలో భారత్ 111వ స్థానానికి దిగజారడం మన దుస్థితులను వివరిస్తున్నది. దక్షిణ ఆసియా దేశాల్లో ఇండియాలోనే అత్యధికంగా 18.7 శాతం వేస్టింగ్, అధికంగా 31.7 శాతం స్టంటింగ్ సమస్యలు పిల్లల్లో ఎదురవుతున్నట్లు గమనించారు. పోషకా హారలోపం కలిగిన తల్లుల వల్ల 27.4 శాతం శిశువులు తక్కువ బరువుతో పుడుతున్నారని, ఇది ప్రపంచంలో అత్యధికమని వెల్లడించారు. భారతీయ మహిళల్లో 53 శాతం రక్తహీనత, 2.8 శాతం పిల్లల్లో/7.3 శాతం పెద్దల్లో స్థూల కాయం నమోదు అయ్యాయి. కోవిడ్-19 సమయంలో ఆదాయం పడిపోవడం, జీవనోపాధులు తగ్గడం, ఆహార సరఫరా శృంఖలం గాడి తప్పడంతో ఆహార అభద్రత, పోషకాహార లోపం రెచ్చిపోయాని మనకు తెలుసు. ఎస్ఓఎఫ్ఐ-2024 థీమ్‌గా "ఆకలి, ఆహార అభద్రత, పోషకా హారలోపాలను అంతం చేయడానికి ఆర్థిక పెట్టుబడులు కావాలి" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ఈ లక్ష్యంతో వ్యవ సాయ ఆధార పరిశ్రమల ఏర్పాటు లేదా బలోపేతం చేయడం, అసమానతల తొలగింపు, ఆహార భద్రతను గాడిలో పెట్టడం, పోషకాహార లభ్యతకు వనరుల కల్పన లాంటివి ఫలిస్తాయని ఆశిస్తున్నారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి చేరడానికి కావలసిన ఆర్థిక వనరులను ఆయా ప్రభుత్వాలు ప్రాధాన్యతాక్రమంలో కేటాయించాలని, 2030 నాటికి ఆకలి కేకలు వినిపించరాదని ఐరాస కోరుకుంటున్నది.

## ఫలించిన అమెరికా, ఫ్రాన్స్ దౌత్యం

ఇజ్రాయెల్ ఎట్టకేలకు మంచి మనసు చేసుకుంది. ఎంతో మంది ప్రాణాలు పోయిన సందర్భంలో నెతన్యాహు శాంతి ప్రక్రియ బాట పట్టడం ముదావహం. గాజ లో అయితే పౌరులు బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారు. ఇక లెబనాన్ లో కూడ ఇజ్రాయెల్ హోరు దాడితో బేంబేలెత్తించింది. హిజ్ బుల్లా ను నిర్వీర్యం చేసే స్థాయికి తెచ్చింది. ప్రతి రోజు ఇజ్రాయెల్ దాడులతో అటు గాజా, ఇటు లెబనాన్ కోలుకోలేని స్థితికి ఇజ్రాయెల్ తెచ్చింది. పౌరుల, పసి పిల్లల, గర్భిణుల ఆక్రందనలు తెలుసుకుని విశ్వం లోని దేశాలు కలవర పడ్డాయి. రష్యా, ఉక్రైన్ యుద్ధం కంటేఇది హేయమైన చర్య అనుకుని ఇజ్రాయెల్ ఎప్పుడు కాల్పుల విరమణ చే స్తుందో దోనని ఎదురు చూశాయి. అందుకు అనుగుణంగా అమెరికా, ఫ్రాన్స్ ముందుకు వచ్చి లెబ నాన్ హిజ్ బుల్ల మధ్య మధ్యవర్తిత్వం చేశాయి. రెండు అగ్రదేశాల ప్రతిపాదనను ఇజ్రాయెల్ అంగీకరించిముందడుగు వేసింది. అయితే లెబ నాన్ లోని హిజ్ బుల్ల నుంచి ఇంకా నిర్ణయం వెలువడ లేదు. ఇది మంచి ప్రయత్నమని కాల్పులకు ఇజ్రాయెల్ అంగీకరించటం, ఆ దేశ భద్రతా దళం కూడ సమ్మతి తెలపడం స్వాగతించాల్సిన విషయమని పరిశీలకుల అభిప్రాయం. కాల్పుల విరమణ తక్షణమే అమలులోకి వస్తుందని వైట్ హౌస్ నుంచి బైడెన్ ఒక ప్రకటన చేశారు. తాను లెబ నాన్ ప్రధాని తో కూడ మాట్లాడాననిదీనికి అతను సూత్రప్రాయంగా అంగీకరించారని బైడెన్ చెప్పడం విశేషం. నెత న్యాహు ను ఫ్రాన్స్ చాలా వరకు శాంతికి ప్రాముఖ్యం ఇవ్వాలని, కా ల్పులతో ప్రయోజనం శూన్యమని నచ్చజెప్పింది. అమెరికా, ఫ్రాన్స్ చొరవతోనే ఇజ్రాయెల్ తక్షణమే కాల్పుల విరమణ ఆపుతామని ప్రకటించారు. అయితే హిజ్ బుల్ల ఏమాత్రం తోక జాడించిన, ఒప్పొందం ఉల్లంగించిన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇజ్రాయెల్ హెచ్చరిక చేసింది. ఇప్పుడు బంతి హిజ్బుల్ కోర్టు లో ఉంది. వచ్చిన అవకాశాన్ని సధ్వినియోగం చేసుకుంటుందా అనేదే ప్రశ్న. ఒక వేళ హిజ్బుల్లా కాల్పుల విరమణకు సమ్మతి చేయకపోతే మాత్రం హిజ్బుల్ ను ఎవరూ రక్షించలేరు. అమెరికా, ఫ్రాన్స్ శాంతి ప్రక్రియ కు విలువ ఉండదు. ఇక్కడ హిజ్బుల్లా పట్టు సడలించాలి. రెండు దేశాల దౌత్యం ను హిజ్బుల్లా అంగీకరిస్తుందని, దాదాపు ఇదే రష్యా, ఉక్రైన్ దేశాల మధ్య కూడ శాంతి ప్రక్రియ కుఅమెరికా, ఫ్రాన్స్ మరియు భారత్ ముందుకు వచ్చి అటు ఉక్రైన్ కు, ఇటు రష్యాకు నచ్చజెప్పితే యుద్ధం ఆగుతుందని ఆశీద్దాం.

**కనుమ ఎల్లారెడ్డి, అమెరికా, 93915 23027.**

## రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలు రద్దు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాల కేంద్రాలలో ఇటీవల ఇద్దరు ఉపాధ్యాయులు మరణించారు. ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాలు వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహించాలని, అదీ కూడా నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని ఎన్నో సార్లు విన్నవించాయి కానీ ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తులను పట్టించుకోకుండా రెసిడెన్షియల్ విధానంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. దీంతో ఒత్తిడి, అనారోగ్య కారణాలతో ఉపాధ్యాయులు శిక్షణ కేంద్రాలలో చనిపోతున్నారు. రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలు వద్దని కోరుతున్నప్పటికి ప్రభుత్వం మొండిగా నిర్వహిస్తూ ఉపాధ్యాయుల మరణాలకు కారణమవుతున్నది. రాష్ట్రస్థాయి అధికారుల ఇప్పటికైనా రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలు రద్దు చేయాలి. ఉపాధ్యాయులందరికీ అందుబాటులో ఉన్న మండల లేదా డివిజన్ కేంద్రాల్లో శిక్షణ నిర్వహించాలి. సుదూర ప్రాంతాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడి గురవుతున్నారు. ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు అన్నీ జిల్లాల్లో జిల్లా కేంద్రాల్లోనే నిర్వహించాలి, శిక్షణా సమయాలు పాఠశాల సమయాల్లోనే నిర్వహించాలి, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే నిర్వహించాలని, యాభై సంవత్సరాలు పైబడిన వారికి, దీర్ఘ కాలిక వ్యాధులు ఉన్న వారికి శిక్షణా కార్యక్రమాల నుంచి మినహాయిపు ఇవ్వాలి, ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు ఆన్లైన్ నందు జరిగేలా చూడాలి.

**- వాసిలి సురేష్, 9494615360**

# కోర్ట్ ఆఫ్ రికార్డ్ అమలుకు దారేది?

- జీవో 29 విషయంలో జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు
- పెల్లుబిక్కిన నిరుద్యోగ యువత నిరసన కార్యక్రమాలు
- పత్రికలన్నీంటా పతాక శీర్షికలో కథనాలు
- ఇటు బిఆర్ఎస్ అటు బిజెపి మద్దతు కొసమెరుపు
- పలు కులసంఘాల నాయకులు, మేధావులు సోషల్ మీడియా వేదికగా రద్దుకు పట్టు



**భాస్కర్ యలకంటి**
**8919464488**

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-1 నియామక ప్రక్రియలో భాగంగా విడుదల చేసిన జీవో 29 విషయంలో జరిగిన రచ్చ అంతా ఇంత కాదు. నిరుద్యోగ యువత నిరసన కార్యక్రమాలకు ప్రతిపక్ష పార్టీలు ఇటు బిఆర్ఎస్ అటు బిజెపి మద్దతు ఇవ్వడంతో అది ప్రధాన చర్చనీయాంశంగా మారింది. పత్రికలన్నీ పతాక శీర్షికలో కథనాల్ని ప్రచురించాయి. ఆ జీవో వల్ల సామాజిక రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందని రద్దు చేయాల్సిందేనని పలు కులసంఘాల నాయకులు,మేధావులు సోషల్ మీడియా వేదికగా పట్టుబడుతున్నారు. మరోపక్క జిల్లా కేంద్రాలలో బీసీ సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఉత్తర్వులను పరిగణలోకి తీసుకున్న కింది కోర్టులు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను సైతం పెడచెవిన పెడుతున్నాయని అది "కోర్ట్ ఆఫ్ రికార్డ్" ను ముమ్మాటికి ఉల్లంఘించడమే అవుతుందని పలువురు రాజ్యాంగ నిపుణులు, న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల విషయంలో పైకోర్టు ఇచ్చిన పలు తీర్పులలో కింది కోర్టుల ద్వారా అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను "కోర్ట్ ఆఫ్ రికార్డ్" గా పరిగణిస్తారు. దానికి వ్యతిరేకంగా కింది కోర్టులు తీర్పులు ఇవ్వరాదు. అయితే ఆచరణలో మాత్రం అది విరుద్ధంగా కనబడుతున్నది. సుప్రీంకోర్టు ఇచ్చినతీర్పులు అమలుకు నోచుకోవడం లేదు. దీనికి అనేక దృష్టాంతాలు వెలుగులోకి వచ్చాయి. సామాజిక రిజర్వేషన్లకు చెందిన అభ్యర్థులు ఓపెన్ కోటాలో అవకాశం పొందినను వారిని రిజర్వేషన్ కేటగిరీ కింద పరిగణించరాదని సౌరవ్ యాదవ్ కేసులో పేర్కొనగా, సామాజిక రిజర్వేషన్లను అన్ని స్టేజీలలో అమలు చేయాలని దీపేందర్ యాదవ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది.

ఈ రెండు తీర్పులను విభేదిస్తూ తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జీవో 29 అందుకు విరుద్ధంగా ఉన్ననూ, దానిపై తలెత్తిన వివాదానికి హైకోర్టు పరిష్కారం చూపకపోగా తాత్సారం చేస్తోందని సామాజికవేత్తలు, రాజ్యాంగ పండితులు గర్హిస్తున్నారు.

ఇదిలా ఉండగా రాజేష్ కుమార్ దారియా కేసులో వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ల విషయంలో విస్పష్టమైన తీర్పు వెలువడింది. బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు మాత్రమే సామాజిక రిజర్వేషన్లు వర్తిస్తాయని, వాటిని వర్టికల్ గా అమలు చేయాలని మిగిలిన రిజర్వేషన్లు అన్నీ ప్రత్యేక రిజర్వేషన్లుగా పరిగణిస్తూ వాటిని హారిజంటల్ గా అమలు చేయాలని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం హారిజంటల్ రిజర్వేషన్ ను అమలు చేయకపోవడాన్ని సవాలు చేయగా సుమారు సంవత్సరకాలం పాటు వాద ప్రతి వాదనలు జరిగాక మహిళలకు హారిజంటల్ రిజర్వేషన్లను వర్తింపజేశారు. కానీ వికలాంగుల కోటాకు, స్పోర్ట్స్ కోటాలకు కూడా వర్తింప చేయకపోగా వర్టికల్ విధానాన్నే అనుసరిస్తున్నారు. ఈ విషయాన్ని కూడా సవాలు చేస్తూ మరో పిటిషన్ దాఖలు అయ్యింది. ఇప్పటికీ సుమారు 8నెలలు గడుస్తున్నా ఇంత వరకు తీర్పు వెలువడలేదు. అంటే సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు దిక్కే లేకుండా పోయిందని న్యాయ నిపుణులు వాపోతున్నారు.

ఇక "మండల్" తీర్పుగా పరిగణించే ఇందిరా సహాని కేసులో సామాజిక రిజర్వేషన్లు 50% దాటకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చిన తమిళనాడు రిజర్వేషన్లకు తప్ప మిగతా వాటికి ఇది వర్తిస్తుంది. రాజ్యాంగ సవరణ చేసిన తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మాత్రమే రిజర్వేషన్ల పెంపు చేయాలి. కానీ దానికి విరుద్ధంగా ఇటీవల తెలంగాణ ప్రభుత్వము ఒక జీవో ద్వారా ఎస్టీ రిజర్వేషన్లను 6% నుండి 10% కు పెంచింది. దీన్ని సవాలు చేస్తూ హైకోర్టులో వేసిన పిటిషన్ సింగిల్ బెంచ్ నుండి డివిజనల్ బెంచ్ కి,డివిజనల్ బెంచ్ నుండి సింగిల్ బెంచ్‌కి బదిలీ అవుతూ ఊగిసలాడుతుందే తప్ప పరిష్కారానికి నోచుకోవట్లేదు.

మరో పక్క ఉద్యోగ భర్తీ ప్రక్రియలో భాగంగా వివిధ రాష్ట్రాలు అమలు పరుస్తున్న రోస్టర్ విధానాలకు మార్గదర్శక సూత్రాలను సుప్రీంకోర్టు 1996 ఆర్కే సబర్వాల్ కేసులో వెలువరించింది. ఒక కేడర్ కు చెందిన ఏదేని ఒక రిజర్వేషన్ కేటగిరీ 100% స్థాయి పొందితే ఆ తరువాత ఏర్పడ్డ ఖాళీలలో ఓపెన్/రిజర్వేషన్ కేటగిరిలను గుర్తించి సంబంధిత అభ్యర్థుల ద్వారా భర్తీ చేయాలి. ఉదాహరణకు ఒక కేడర్ స్ట్రెంత్ మొత్తం 200 పోస్టులు ఉన్నాయంటే ఎస్సీలకు 30(15%), ఎస్టీలకు 12(6%), బీసీలలో అన్ని గ్రూపులకు కలిపి 58(29%) వచ్చేవరకు రోస్టర్ విధానం అమలులో ఉంటుంది. ఆ తర్వాత కేడర్ లో ఏర్పడ్డ ఖాళీలో ఏ స్థానాల్లో ఖాళీ ఏర్పడితే సంబంధిత ఓపెన్/రిజర్వేషన్ అభ్యర్థులతో అంటే "పోస్ట్ బేస్డ్ రిజర్వేషన్" విధానంలో భర్తీ చేయాలని స్పష్టంగా ఉన్ననూ దానికి విరుద్ధంగా ఏర్పడ్డ ఖాళీలను బట్టి రిజర్వేషన్ విధానం అంటే 100 పాయింట్స్ సైకిల్ రోస్టర్ ద్వారా "వేకెన్సీ బేస్డ్ రిజర్వేషన్" ను అమలు పరుస్తున్నారు. దీన్ని సరి చేయవలసి ఉన్నది.

ఇక ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేసే విషయంలో కూడా వివాదం రోజురోజుకు రాజుకుంటూనే ఉన్నది. బీసీ,ఎస్సీ,ఎస్టీ సామాజిక రిజర్వేషన్లు పోనూ మిగిలిన 50% ఓపెన్ కోటాలో మాత్రమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల తీర్పు వెలువర్చింది. మరోపక్క ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రత్యేక రిజర్వేషన్లని వాటిని హారిజాంటల్ గా అమలు చేయాలని తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు అయింది. దానిపై కూడా కోర్టులు ఇంకా ఇంతవరకు ఏమీ తేల్చలేదు. "న్యాయం ఆలస్యం అవ్వడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే" అవుతుందని పలువురు న్యాయ కోవిదులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో "కోర్ట్ ఆఫ్ రికార్డ్" ను గౌరవిస్తూ కింది కోర్టులు సకాలంలో తీర్పులు వెలువర్చి ఏకీకృత న్యాయ వ్యవస్థను కాపాడాలని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరి కోర్టులు ఎలా స్పందిస్తాయో చూడాలి.

# ప్రజాస్వామ్య మనుగడకు వెన్నెముక రాజ్యాంగం

- శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల సమన్వయం
- ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సారధ్యం
- 2 సంవత్సరాల,11 నెలల, 18 రోజుల పాటు రాజ్యాంగ నిర్మాణ సమయం
- ఇటాలిక్ కాలిగ్రఫి లో చేతి తో రాసిన ప్రేమ్ బిహారీ నారాయణ్ రాయ్ జాదా
- అనేక అంశాలపై పాలకులకు అవగాహన కలిగినప్పుడే రాజ్యాంగం కు వాస్తవ రూపం




**కామిడి సతీష్ రెడ్డి,**
**9848445134.**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దశ, దిశా,నిర్దేశాలు, విధి విధానాలు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు, హక్కుల గురించి తెలియజేసే లిఖిత మైన మహత్తర గ్రంథమే భారత రాజ్యాంగం. ప్రభుత్వ పరిపాలన ఎలా ఉండాలో, ప్రజలకు పాలకులు ఏ విధమైన పరిపాలన చేయాలో తెలియజేసే శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల సమన్వయం ఎలా ఉండాలో తెలిపేదే భారత రాజ్యాంగం. మన రాజ్యాంగం ప్రపంచంలో కెల్లా అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా చెప్తారు. ఇది దేశ ప్రజలకు ఒక భగవద్గీత, ఖురాను, ఒక బైబిల్ లాంటిదని చెప్పవచ్చును. రాజ్యాంగంలో 448 అధికరణాలు, 12 షెడ్యూల్ కలవు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే రాజ్యాంగ ముసాయిదాను రూపకల్పన చేశారు. అందుకు ఒక కమిటీగా రాజ్యాంగ పరిషత్ ను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సభ్యులను పరోక్ష ఎన్నిక ద్వారా, భారత్ సంస్థానాల నుండి 93 మంది, రాష్ట్ర శాసనసభల ద్వారా 292 మంది, చీఫ్ కమిషనర్ ప్రావిన్స్ ప్రతినిధుల నుండి నలుగురిని, ఇలా 389 మంది సభ్యులతో రాజ్యాంగ పరిషత్ నిర్మాణం జరిగింది. దీనిని రాజ్యాంగ సభ గా చెప్పుకుంటారు. 1947 జూన్ మాసంలో అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటెన్ ఆధ్వర్యంలో దేశ విభజన జరిగింది. ఆయన సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ (రాజ్యాంగ సభ) సభ్యుల సంఖ్యను 299 మందికి కుదించారు. ఈ రాజ్యాంగ సభ మొట్టమొదటి సమావేశం 1946 డిసెంబర్ 9న ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్లో 211 మందితో సమావేశం జరిగింది. దీనికి డాక్టర్ సచ్చిదానంద సిన్హా ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానాఅబుల్ కలాం ఆజాద్, జేబీ కృపలానీ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సరోజినీ నాయుడు, టంగుటూరి ప్రకాశం పంతులు మొదలైనవారు ఈ సభలో సభ్యునిగా ఎన్నుకోబడ్డారు. వారి నేతృత్వంలో స్వతంత్ర భారత రాజ్యాంగం ముసాయిదాను తయారు చేశారు. ఈ ముసాయిదా కమిటీ (డ్రాఫ్ట్ కమిటీ) అధ్య క్షుడిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను 1947 ఆగస్టు 29న ఎన్నుకున్నారు.

రాజ్యాంగ నిర్మాణం: స్వతంత్ర భారత దేశానికి వెన్నుముకగా చెప్పుకునే భారత రాజ్యాంగం నిర్మాణానికి 2 సంవత్సరాల,11 నెలల, 18 రోజులు పట్టింది. రాజ్యాంగ రాతప్రతిని తయారు చేయుటకు రాజ్యాంగ సభ 11 సార్లు, సుమారు 165 రోజులు సమావేశమైంది. రాతప్రతిని తయారుచేసే క్రమంలో 2473 ప్రతిపాదనలు రాగా వాటిని పరిశీలించి 7635 సవరణలు చేసి రాతప్రతిని తయారు చేయడం జరిగింది. ఈ రాత ప్రతిని 1949 నవంబర్ 26 న రాజ్యాంగ ఆమోదించారు. 1950 జనవరి 24న రాజ్యాంగ ప్రతి పై సంతకాలు చేశారు. ఆ తరవాత రోజున రాజ్యాంగ సభ రద్దయి జనవరి 26, 1950 న భారత రాజ్యాంగాన్ని అమలు లోకి తీసుక రావడం జరిగింది.

మన రాజ్యాంగాన్ని రూపొందించడానికి సుమారు 64 లక్షలు ఖర్చు కావడం జరిగింది. రాజ్యాంగాన్ని ప్రేమ్ బిహారీ నారాయణ్ రాయ్ జాదా ఇటాలిక్ కాలిగ్రఫి లో చేతి తో రాశారు . ప్రతి పేజీని అందంగా తీర్చి దిద్ది ఇంగ్లీష్,హిందీ భాషల్లో సైతం రాయడం జరిగింది దీనిని పార్లమెంట్ భవన్ లోని గ్రంథాలయం లో హీలియం వాయువు నింపిన పెట్టెలో భద్రపరిచారు. ఈ రాజ్యాంగాన్ని పరిపాలన సౌలభ్యం కోసం కొన్ని సందర్భాలలో సవరణలు చేస్తుంటారు.

మన రాజ్యాంగం భారతీయుల స్వేచ్ఛ,సమానత్వ, సౌభ్రాతృత్వం పట్ల నిబద్ధతను తెలుపుతుంది. మొదటగా భారతదేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగా పేర్కొన్నారు. ఆ తర్వాత 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్వసత్తాక, సౌమ్య వాద, లౌకిక, ప్రజాస్వామ్య , గణతంత్ర రాజ్యాంగా అవతరించింది. భారత రాజ్యాంగం ఐక్యత, సమగ్రత, వైవిద్యత ల సమాహారం అని , దేశాన్ని ముందుకు నడిపే చోదక శక్తి రాజ్యాంగానికి ఉంటుందని గత సంవత్సరం రాజ్యాంగ సభ చారిత్రక 250 వసంతాల సమావేశాల సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. 2015 లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 వ జయంతి సందర్భంగా రాజ్యాంగ దినోత్సవం చరిత్ర, ప్రాముఖ్యత గూర్చి నేటితరం యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించి నరేంద్ర మోడీ నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం గా జరుపుకోవాలని ప్రకటన చేశారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని గతంలో న్యాయ దినోత్సవంగా, సంవిధాన్ దివాస్ గా పిలుస్తారు. ఆ సందర్భంగా ముంబై లోని హిందూ మిల్స్ కంపౌండ్ లో అంబేద్కర్ స్మారక చిహ్నానికి పునాదిరాయి వేశారు. దేశం గర్వించే విధంగా స్మారక చిహ్నాన్ని నిర్మించడం జరిగింది. ఇది భారతీయులందరికీ గర్వకారణం. రాజ్యాంగం అనేది దేశ పరిపాలన వ్యవస్థకు ఒక అద్దం అలాంటిది. ఒక దిక్సూచి, ఒక వెన్నెముకగా చెప్పుకోవచ్చును. పాలకులు రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలి తప్ప దాని పరిధి దాటి పోకూడదు. కానీ కొన్ని సందర్భాల్లో అనుభవం లేని పాలకులు ప్రాతినిధ్య సభలలో అడుగు పెట్టడం వల్ల ప్రజాస్వామ్య విలువలు అడుగంటి పోతున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలు సమాజంలో గొప్పగా అమలు కావాలంటే ముందుగా మన గ్రంథ మైన "రాజ్యాంగం 'విలువలు, ఆదర్శాలు, చట్టసభల నిర్మాణం, న్యాయపరమైన సలహాలు , సూచనలు ఇలా అనేక అంశాలపై పాలకులకు అవగాహన కలిగినప్పుడే అంబేద్కర్ ఆశయాలు, ఆదర్శాలు అమలు అవుతాయని చెప్పవచ్చు. గతంలో రాజ్యాంగ దినం గూర్చి పాఠశాల ,కళాశాల, విశ్వవిద్యాలయాల స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ , డిబేట్, లాంటివి నిర్వహిస్తూ, రాజ్యాంగ ప్రవేశిక, ప్రతిజ్ఞ, రాజ్యాంగ నిర్మాణం పై అవగాహన కల్పించడం జరిగింది . కాబట్టి ఆ దిశగా రాజ్యాంగం నిర్మాణం విలువలు, రాజ్యాంగ చరిత్ర గురించి ముఖ్యంగా ప్రాతినిధ్య సభలోని ప్రతినిధులు,యువత, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, అవగాహన చేసుకున్నప్పుడే సుపరిపాలన ప్రజలకు చేరువ అవుతుందని చెప్పవచ్చును.

# క్షీణిస్తున్న మానవీయ విలువలు

పుట్టేటప్పుడు చెప్పి పుడతామా? పోయేటప్పుడు చెప్పి పోతామా? తల్లిగర్భంలో నవమాసాలు ఁలదాచుకుని,భూమిపై అడుగిడి ,ఆనందాన్ని కురిపించి, బోసినవ్వులతో అలరించి, జోలపాడించుకుని,లాలపోయించుకుని బొమ్మలతో ఆటలాడుకుని, ముద్దుగా చంకనెక్కి, ఉయ్యాల్లో ఓలలాడి,అన్న ప్రాసనతో గోరు ముద్దలు తిని, నేలపై పాకుతూ, పడుతూ లేస్తూ, బుడిబుడి నడకలతో మొదలై వడి వడి అడుగులు పడుతూ నిలబడి వయ్యారాలు పోతూ, నెలవంకను చూస్తూ గోరుముద్దలు తింటూ, కూనిరాగాల మధ్య కునికిపాట్లు పడుతూ, నిద్ర పుచ్చే తరుణంలో కనులు మూస్తూ, ఓర కంట పరికిస్తూ తనకు రక్షణగా మరొకరున్నారని ధైర్యంగా నిదురబోతూ, అమాయకంగా అగుపించే పసిబిడ్డల నగుమోమును గాంచి ముసి ముసి నవ్వులు నవ్వకుంటూ, తడబడే గొంతుతో తబ్బిబ్బవుతూ, ప్రేమామృతంలో తడిసిన గొంతునుండి పలికే భావాలకు విలువ కట్ట గలమా? బోసినవ్వులను కోట్లతో కొనగలమా? తడబడుతూ, పడుతూ లేచే పసిప్రాయాన్ని డబ్బుతో తులతూచగలమా? తప్పటడుగులను తప్పని చెప్పే సాహసం చేయగలమా? మురిపి స్తూ,మైమరపిస్తూ, క్రమక్రమంగా పెరుగుతూ, అక్షరాభ్యాసం చేసి, బాల్యాన్ని బడికి అంకితమిచ్చి,అక్షరాలను అవపోసన పట్టి, ఓనమాలు దిద్ది పదాలను పలికి,పుస్తకాలను పఠించి,పాఠాలను నేర్చుకుని, పాఠశాలలో గెలిచి,కళాశాలకు అడుగిడే సమయంలో అల్లరి చేసే వయసొస్తుంది. అది పసిప్రాయంలో చేసే అల్లరి కాదు. చిరుప్రాయంలో చిందించే అమాయకపు నవ్వులు కావు. తప్పటడుగులని సరిదిద్దే వయసు కాదది. తప్పటడుగులని తెలిసి,మందలించే వయసది. యవ్వనం దరిచేరి, కోరికలకు రెక్కలొచ్చి,కవ్వించే ప్రాయంలో నూనూగు మీసాల దశలో పట్టాలు పుచ్చుకుని, పట్నమెల్లి ప్రేమల్లో మునిగి, నాఅన్న వారిని మరచి,ముద్దాడిన చేతులను వదలి,మత్తెక్కించే విలాసాల్లో మునిగి, ఉద్యోగాల వేటలో, జీతాల రాకతో జేబునిండా పైసాలతో షికార్లు చేసి, ప్రేమల్లో తరించి, పెళ్ళిళ్ళు చేసుకుని ఊహల రెక్కలు కట్టుకుని, ఆశల సౌధాలను నిర్మించుకుని పడి లేస్తూ, నిలబడుతూ రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోతూ,మట్టిలో పుట్టి,మట్టినే తూలనాడి, మైమరచి, నేలవిడిచి సాము చేసి, అందని కోరికలకు అర్రులు చాస్తూ, ఆకా శానికి నిచ్చెనలేస్తూ,ఎక్కిన నిచ్చెనను నేలపై తోసేసి, ఎదుగుతున్న దశలో జీవితమనే పరమపద సోపానంలో స్వార్థం ఆవహించి, విచక్షణ నశించి,నడత చెడి, ఎవరో తిప్పే రంగుల రాట్నంలో పైకెగు రుతూ,క్రిందకు పడుతూ నింగికెగిరి, నేలను గేలి చేస్తూ జీవితాన్ని గెలిచేసామని భ్రమిస్తూ, వ్యక్తిత్వం లేని జీవితమనే బానిసత్వపు సంకెళ్ళలో బందీగా మారి పసి ప్రాయపు ఆప్యాయతలను, ఆస్వాదించిన అమృతపు క్షణాలను మరచిపోయి, ఎత్తుకున్న చేతులను వదిలేసి, కృత్రిమమైన బంధాల్లో బరువులను మోస్తూ లేని ఆనందాన్ని ఉన్నదనుకుని ఆస్వాదిస్తూ ఆప్యాయతలు పంచిన గుండెల్లో గునపాలు దింపితే అదొక ఉన్మాదం.

తైతక్కలాడే వయసు దాటి వృద్ధాప్యం దగ్గరకొచ్చిన నాడు గతకాలం గుర్తుకు వచ్చి వగచి వగచి ఏడ్చిన ఫలముండునా? పిసరంత జాలి లేని గుండెల్లో ఆఖరి దశలో వచ్చే ఆర్ద్రత అక్కరకు వచ్చునా? నవ్వుకున్న వయసంతా, నవ్వుల పాలై, నేలపై రాలే పండు వయసులో దిక్కులేక అలమటిస్తూ,చస్తూ,బ్రతుకుతూ, నిస్సహాయమైన చూపులతో ఏదో చేద్దామని తలంచినా చేతులాడవు, కాళ్ళు కదలవు, శరీరంలో ఓపిక లేక, గుప్పెడు మెతుకులేసే దిక్కులేక, ఆదరించే వారే కరువై, అనాథలా జీవించి, మంచంపై మూలుగుతూ లేవలేక, చావలేక, వద్దన్నా వదలని ఊపిరిని బిగబట్టుకుని,చావు కోసం తపిస్తూ, చావురాక ఏడుస్తూ, ఒంటరి పయనంలో ఆఖరి మజిలీ అస్తవ్యస్థమై అలమటిస్తే, పలకరించే దిక్కే లేక, బరువెక్కిన గుండెలపై భారాన్ని దింపుకుందామని ప్రయత్నిస్తే, ఆఖరి శ్వాస ఆగుతుంది. శరీరాన్ని విడి చి ఆత్మ ఎక్కడికో పయనమై పోతే,మంచంపై కాయం కూలబడుతుంది. పక్షులు అరుస్తుంటే, శునకాలు మొరుగుతుంటే, శవం పక్కన చీమలు పాకుతుంటే, ఎలుకలొచ్చి కొరుక్కుతింటుంటే, ప్రాణం పోయిన జీవిలో జీవమొచ్చునా? పీక్కుతింటున్న రాబంధులను బెదిరించునా? ఇదీ నిస్సహాయుల ఆఖరి మజిలీ. చిరుప్రాయపు నవ్వులెక్కడ? యవ్వనపు హుంకరింపులెక్కడ? నీ వాళ్ళని నమ్మిన వారెక్కడ? గత కాలపు స్మృతులన్నీ ఎడారి ఇసుకపై వెతుక్కునే లేని నీటి ధారల్లా జీవం కోల్పోయిన కాయాన్ని వెక్కిరిస్తుంటే ఇదే జీవితమని చెప్పే ఫిలాసఫర్లు బయలు దేరుతున్నారు జవసత్వాలుడిగిన వార్ధక్యంలో!! స్వార్థంతో జీవించి, అహంలో తేలియాడి, వృద్ధాప్యంలో వైరాగ్యం ఆవహిస్తే ఫలితమేముంటుంది? బాల్యం చిరునవ్వులతో వికసించాలి. ఆటపాటలతో గడపాలి. యవ్వనం విద్యలతో రాణించాలి. సంస్కారంతో శోభించాలి. సద్గుణాలతో జీవితం సాగాలి. జీవితం మానవత్వపు మాధుర్యంలో ఓలలాడాలి. వృద్ధాప్యం సేవాభావంతో పునీతం కావాలి. ఆఖరి క్షణాలు నా అనుకున్న వారి మధ్య ప్రశాంతంగా గడిచిపోవాలి. ఇదే నిండైన జీవితానికి నిజమైన నిర్వచనం. మనిషికి మనిషి భారమైపోతున్న వర్తమాన పరిస్థితుల్లో మానవత్వం గురించి మాట్లాడడం కూడా హాస్యాస్పదంగా మారింది. విలువలు విధ్వంసమైపోయి, స్వార్థం పరాకాష్ఠకు చేరి,ధనమే పరమార్థంగా రూపాంతరం చెందిన నేపథ్యంలో కనీసం భావి తరాల మస్తిష్కాల్లోనైనా మానవీయ విలువలను ప్రేరేపించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# ఆల్మండ్స్‌తో మీ రోగ నిరోధక శక్తిని బలోపేతం



కాలానుగుణ మార్పులతో, రోగనిరోధక శక్తి తరచుగా బలహీనపడుతుంది, దానిని బలోపేతం చేయడానికి సహజ మార్గాలను అనుసరించడం చాలా అవసరం. రోగనిరోధక శక్తిని ప్రభావవంతంగా మెరుగుపరుచు కోవటానికి పోషకాహార నిపుణులు రితికా సమద్దర్ మీ దినచర్యలో పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. అటువంటి సూపర్ఫుడ్లలో ఒకటి కాలిఫోర్నియా బాదం, ఇందులో 15 ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వైవిధ్యమైనప్పటికీ మరియు సంపూర్ణమైన ఆహారంగా , బాదం పోషకాహారం యొక్క పవర్హౌస్గా నిలుస్తుంది. ఏదైనా భోజనం, చిరుతిండి లేదా డైట్ ప్లాన్లో చక్కగా సరిపోతుంది. కాలిఫోర్నియా బాదంలో ప్రోటీన్, ఫైబర్ మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి, ఇవి సమతుల్య రోజువారీ ఆహారానికి అద్భుతమైన తోడ్పాటును అందిస్తాయి. వాటి ఆరోగ్య ప్రయోజనాలు విస్తృతంగా గుర్తించబడ్డాయి, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (%ఖీూూూ×%) బాదంపప్పును సహజంగా రోగనిరోధక శక్తిని పెంచడానికి ఒక ముఖ్యమైన ఆహారంగా గుర్తించింది. ఇంకా, ఇటీవల ప్రచురించిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ భారతీయుల కోసం ఆహార మార్గదర్శకాలు బాదంపప్పును మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ తినగలిగే పోషకమైన గింజగా గుర్తించాయి

## టిసిఎస్‌కు ఉత్తమ ఎంప్లాయర్ బ్రాండ్ అవార్డు




ముంబై : టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఐటి సేవలు, కన్సల్టింగ్ మరియు వ్యాపార పరిష్కారాలలో గ్లోబల్ లీడర్, లింక్డ్ఇన్లో కార్పొరేట్ సెక్టార్లో బెస్ట్ ఎంప్లాయర్ బ్రాండ్ను పొందింది. ప్రతిభా పురస్కారాలు 2024. పెద్ద కేటగిరీలో ఈ గుర్తింపు ఎంటర్ప్రైజెస్, 55 దేశాలలో 6,00,000 మంది ఉద్యోగులతో విభిన్నమైన వర్క్ఫోర్స్ కోసం ఆకర్షణీయమైన, భవిష్యత్-సిద్ధంగా పనిచేసే ప్రదేశాన్ని పెంపొందించడానికి టిసిఎస్ నిబద్ధతను నొక్కి చెబుతుంది. లింక్డ్ఇన్ యొక్క డేటా-ఆధారిత పద్ధతి ఆధారంగా, ప్లాట్ఫారమ్ యొక్క ప్రతిభ పరిష్కారాలను దాని భవిష్యత్తు మరియు ప్రస్తుత ఉద్యోగులతో అర్థవంతంగా కనెక్ట్ చేయడానికి, దాని యజమాని బ్రాండ్ను విస్తరించడానికి మరియు అగ్రశ్రేణి ప్రతిభను ఆకర్షించడానికి టిసిఎస్ సామర్థ్యాన్ని ఇది హైలైట్ చేస్తుం ది. గత నాలుగు సంవత్సరాలుగా, టిసిఎస్ భారతదేశంలో పని చేయడా నికి లింక్డ్ఇన్ యొక్క టాప్ కంపెనీలలో నిలకడగా నంబర్ 1 స్థానంలో ఉంది, ప్రతి సంవత్సరం దేశంలోని టాప్ 25 వర్క్ప్లేస్లలో ఒక స్థానాన్ని పొందుతోంది, టిసిఎస్ , చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ మాట్లాడుతూ, "లింక్డ్ఇన్ ద్వారా లభించిన ఈ గుర్తింపు, ఉద్యోగులు విలువైనదిగా మరియు సాధికారతతో పనిచేసేటటువంటి వర్క్ప్లేస్ను రూపొందించడంలో మా నిరంతర ప్రయత్నాలకు నిదర్శనం. ఇది భారతదేశంలో మరియు ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసుకునే యజమానిగా టిసిఎస్ స్థానాన్ని బలోపేతం చేస్తుంది. మేము టిసిఎస్ లో తదుపరి తరం ప్రతిభను మరియు నాయకులను ఆకర్షించడానికి మరియు నిలుపుకోవాలని చూస్తున్నప్పుడు, ప్రతిభ విలువ గొలుసు అంతటా జెన్ ఏఐ వంటి తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉద్యోగి అనుభవాన్ని అభివృద్ధి చేయడం మరియు పని యొక్క భవిష్యత్తును స్వీకరించడంపై మా దృష్టి ఉంటుంది.

## 57% స్టేట్ బోర్డుల నుంచే విదేశీ విద్య

హైదరాబాద్ : దక్షిణాసియాలో అతిపెద్ద విదేశీ విద్య ప్లాట్ఫాం అయిన లీప్ స్కాలర్ సంస్థ తన అప్లికేషన్ బేస్డ్ సర్వే 2024ను విడుదల చేసిం ది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డుల్లో చదివినవారి కంటే స్టేట్ సిలబస్లో చదివిన విద్యార్థులే విదేశీ విద్యపై ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని ఈ సర్వేలో తేలింది. హైదరా బాద్ నుంచే ఎక్కువ మంది విదేశీ విద్యకు వెళ్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో బెంగళూరు, ముంబయి, పుణె, విశాఖపట్నం, లక్నో తదితర నగరాలున్నాయి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డులలో చదివినవారికి ఎక్కువగా విదేశీ విద్యకు సంబంధించిన ఆకాంక్షలు ఉంటాయన్న నమ్మకం తప్పని ఈ సర్వే తేల్చింది. విదేశీ విద్యకు వెళ్లేవారిలో 34% విద్యార్థినులే ఉంటున్నారు. ఈ సందర్భంగా లీప్ స్కాలర్ సహ వ్యవస్థాపకుడు అర్ణవ్ కుమార్ మాట్లాడుతూ, "విదేశీ విద్య ఆకాంక్షలు గణనీయంగా పెరుగుతున్న నగరాల్లో హైదరాబాద్ కీలకమైంది. ప్రభుత్వ సమాచారం ప్రకారం 2024లో 13.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశీ విద్యకు వెళ్లారు. ఈ సంఖ్య 2022లో కేవలం 7.5 లక్షలే. ఈ సంఖ్య పెరగడానికి లీప్ స్కాలర్ కీలకపాత్ర పోషిస్తూ..విద్యార్థులకు తమ అంతర్జాతీయ కలలు నెరవేరేలా చేయడంలో ముందుంది. భారతీయ విద్యార్థులు ముందెన్నడూ లేనంతగా అంతర్జాతీయ విద్యకు బాగా వెళ్లడం నిజంగా స్ఫూర్తిదాయకంగా ఉంది" అని చెప్పారు. దీంతోపాటు.. విదేశీవిద్యకు ఏయే దేశాలకు, ఎలాంటి సబ్జెక్టుల కోసం విద్యా ర్థులు వెళ్తున్నారో కూడా ఈ సర్వే చెప్పింది. ఎక్కువగా కెనడా, యూకే, అమెరికా లాంటివి ముందుండగా.. భారతీయ విద్యార్థులు జపాన్, నెదర్లాండ్స్ లాంటి దేశాలనూ కొత్త ఆప్షన్లుగా ఎంచుకుంటున్నారు.

## ఐఐటి ఇండోర్‌తో సన్ లైఫ్ గ్లోబల్ సొల్యూషన్స్ ఇన్నోవేషన్ భాగస్వామ్యం



సన్ లైఫ్ గ్లోబల్ సొల్యూషన్స్ గ్లోబల్ ఇన్సూరెన్స్ మరియు అసెట్ మేనేజ్మెంట్ లీడర్ సన్ లైఫ్ యొక్క గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ - మైక్రోకోజమ్, ఐఐటి ఇండోర్తో వినూత్నమైన మరియు చారిత్రాత్మక భాగస్వామ్యాన్ని ప్రారంభిం చింది. ఇన్నోవేషన్ను నడపడానికి ఉద్దేశించిన ఈ భాగస్వామ్యంలో ఏఐ/ఎంఎల్, డేటా అనలిటిక్స్-ఉత్పాదకేఐవంటి కొత్త యుగ సాంకేతికతల అప్లికేషన్ను కలిగి ఉంటుంది, ముఖ్యంగా బీమారంగంలో రిస్క్ మదింపు మెరుగుదల, క్లెయిమ్ సెటిల్మెంట్ మరియు కస్టమర్ సంతృప్తి వంటి అంశాలు ఉంటాయి.
ఈ భాగస్వామ్యం ద్వారా, జిసిసి రంగంలో కొత్త సాంకేతిక సవాళ్లను పరిష్కరించగల నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని పెంపొందించడం ద్వారా ఉత్పాదకతను పెంచడం మరియు సేవా డెలివరీని మెరుగుపరచడం సన్ లైఫ్ లక్ష్యం. సన్ లైఫ్ గ్లోబల్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, తరుణ్ సరీన్ మాట్లాడుతూ, "ఐఐటి ఇండోర్తోమాసహకారం సాంకేతిక నైపుణ్యం ద్వారా అర్థవంతమైన ఆవిష్క రణలు మరియు పరిష్కారాలను నడిపించే మా అన్వేషణలో అద్భుతమైన కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది. పరిశోధన మరియు ఇంజినీరింగ్లో భారతదేశపు అగ్రగామిగా ఉన్న వ్యక్తులతో చేతులు కలపడం ద్వారా, మా ఖాతాదారుల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చే అత్యాధునిక పరిష్కారాలను అందించే మా సామర్థ్యాన్ని మేము వేగవంతం చేస్తున్నామన్నారు.

### ప్రావిడెన్స్ గ్లోబల్ సెంటర్‌కు సీఐఐ

## తెలంగాణ కార్పొరేట్ క్రికెట్ లీగ్ టైటిల్




హైదరాబాద్ బాలాపూర్ కేఎల్ ఆర్ క్రికెట్ గ్రౌండ్ లో శుక్రవారం జరిగిన సిఐఐ తెలంగాణ కార్పొరేట్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టైటిల్ ను ప్రావిడెన్స్ గ్లోబల్ సెంటర్ 76 పరుగుల తేడాతో అరబిందో ఫార్మా లిమిటెడ్ పై గెలిచింది. సంతోష్ జె 73 బంతుల్లో 208 పరుగులు చేయడంతో ప్రావిడెన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. అరబిందో ఫార్మా లిమిటెడ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది.మొత్తం 354 పరుగులు చేసిన సంతోష్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు కూడా లభించింది.

# 'స్టార్టప్స్ కోసం హీరో'ని ప్రారంభించిన హీరో మోటో కార్ప్



"హీరో ఫర్ స్టార్టప్ల ఆవిష్కరణలు, వ్యవస్థాపకత మరియు సహకారం ద్వారా చలనశీలత మరియు అంతకు మించి భవిష్యత్తును రూపొందించడానికి మా నిబద్ధత. మన గౌరవప్రదమైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ యొక్క ఆత్మనిర్భర్ భారత్ దృష్టిలో పాతుకుపోయిన ఇది భారతదేశాన్ని రాణించేలా శక్తివంతం చేసే పరివర్తన వేదిక. ప్రపంచ వేదికపై కలలు కనేవారిని, కార్యసాధకులను మరియు దార్శనికులను ఆహ్వానిస్తూ, ఈ చొరవ అసాధారణమైనది స్టార్టప్ల కోసం హీరో అపూర్వమైన అవకాశాలకు తలుపులు తెరిచేటప్పుడు భారత్కు వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఆలోచనలు భారతదేశం గ్లోబల్ లీడర్గా ఎదుగడాన్ని వేగవంతం చేస్తాయి, ఆవిష్కరణలు మరియు ప్రభావానికి కొత్త బెంచ్మార్క్లను ఏర్పరుస్తాయి మరియు రాబోయే తరాలకు అవకాశాల ప్రపంచాన్ని సృష్టిస్తాయి.
ప్రపంచంలోనే అతిపెద్ద మోటార్సైకిళ్లు మరియు స్కూటర్ల తయారీ సంస్థ అయిన హీరో మోటో కార్ప్, హీరో మోటోకార్ప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్. పవన్ ముంజాల్ ఈరోజు హీరో ఫర్ స్టార్టప్స్ కార్యక్రమాన్ని భారత్ మరియు అంతకు మించి మొబిలిటీని మార్చే లక్ష్యంతో ప్రారంభించారు.

# కేబెల్ స్టార్ సీజన్-3 విజేతలు వీళ్లే




విశాఖపట్నం : దేశంలోని ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రికల్ మరియు వైర్ , కేబుల్ తయారీదారు ఆర్ఆర్ కేబెల్, విశాఖపట్నంలో తన కేబెల్ స్టార్ స్కాలర్షిప్ ప్రోగ్రామ్ 2024 విజేతలను వెల్లడించింది. ఈ స్కాలర్షిప్ ప్రోగ్రామ్, ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన ఎలక్ట్రీషియన్ల పిల్లల కోసం రూపొందించబడింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి సంవత్సరం రూ. 1 కోటి కంటే ఎక్కువ నిధులను ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి మరియు మద్దతుగా కేటాయించింది. దేశవ్యాప్తంగా, ఇప్పటి వరకు ఒకొక్కరికి రూ. 10,000 చొప్పున వ్యక్తిగత స్కాలర్షిప్లను అందుకోవడానికి 3000 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కంపెనీ ఈ స్కాలర్షిప్ ప్రోగ్రామ్ యొక్క రెండు సీజన్లను విజయవంతంగా అమలు చేసింది మరియు ఇది గణనీయమైన సంఖ్యలో దరఖాస్తుదారులతో మూడవ సీజన్ను సూచిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 1000 మంది స్కాలర్షిప్ విజేతలలో, 54 మంది వ్యక్తులతో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక కేంద్రంగా నిలిచింది. విశాఖపట్నంలోని మంత్రీస్ హోటల్లో జరిగిన ప్రత్యేక వేడుకల్లో విజేతలకు సంబరాలు నిర్వహించారు. ఆర్ఆర్ గ్లోబల్ డైరెక్టర్, శ్రీమతి కీర్తి కాబ్రా మాట్లాడుతూ "మా ఎలక్ట్రీషియన్లు, ముద్దుగా 'కెబెల్ దోస్త్' అని పిలుస్తారు, ఇది ఆర్ఆర్ కేబల్ కెబెల్లో అంతర్భాగంగా ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ తమ కలలను సాకారం చేసుకునే అవకాశం ఉందని మేము గట్టిగా నమ్ముతున్నాము" అని అన్నారు.

# లక్ష్యం 27,381కి తగ్గించుకున్న నిఫ్టీ




ముంబై : భారతదేశంలో అత్యంత విశ్వసనీ యమైన ఆర్థిక సేవల సంస్థల్లో ఒకటి, పిఎల్క్యాపిటల్ - ప్రభుదాస్ లిల్లాధర్, తన తాజా ఇండియా స్ట్రాటజీ రిపోర్ట్లో భారతీయ మార్కెట్లు గమనంలో ఉన్నాయని, అయితే ఎదురుగాలులు ఇంకా గరిష్ట స్థాయికి చేరుకోలేదని పేర్కొంది. ఆర్థిక ఏడాది 25/26/27 కోసం 0.5/2.0/1.5 తగ్గించిన నిఫ్టీ ఈపిఎస్ పై సంస్థ తన బేస్ కేస్ నిఫ్టీ లక్ష్యా న్ని 27,381 (27,867 అంతకుముందు)కి తగ్గించింది మరియు దీర్ఘకాలిక లాభాల కోసం డిప్స్లు ఎంపిక చేసిన కొనుగోలును సిఫార్సు చేసింది.
నివేదిక ప్రకారం, తక్కువ బేస్ మరియు సాధారణ రుతుపవనాల కారణంగా గ్రామీణ డిమాండ్లో స్థిరమైన పెరుగుదలతో డిమాండ్ పరిస్థితులు మిశ్రమంగా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ, పెరుగుతున్న ద్రవ్యోల్బణం పట్టణ డిమాండ్ను తగ్గిస్తుంది, ముఖ్యంగా మెట్రోలు మరియు ప్రధాన నగరాల్లో, ఇది ఆర్థిక వ్యవస్థ యొక్క మొత్తం డిమాండ్లో సుమారు 35% దోహదం చేస్తుంది. చాలా ఆశావాదం ఇప్పుడు రాబోయే పండుగ మరియు వివాహ సీజన్లలో సంభావ్య డిమాండ్ బూస్ట్పై ఆధారపడి ఉంటుంది.
ఆహార ద్రవ్యోల్బణం 10.9%కి పెరిగింది ఇది ఆర్బీఐ సౌకర్య స్థాయి కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది, PL క్యాపిటల్ బడ్జెట్ తర్వాత మాత్రమే వడ్డీ రేటు తగ్గింపును అంచనా వేసింది. బలహీనమైన డిమాండ్ నేపథ్యంలో బ్రోకింగ్ వ్యాపారం స్టాక్-నిర్దిష్ట వ్యూహాన్ని సిఫార్సు చేస్తుంది. ప్రస్తుత ధరల ప్రకారం, మూలధన వస్తువులు, మౌలిక సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలు, ఆసుపత్రులు, ఫార్మాస్యూటికల్స్, టూరిజం, ఆటోమొబైల్స్, న్యూ ఎనర్జీ, ఇ-కామర్స్ మరియు ఆభరణాలు వంటి థీమ్లు తగినవని %ూూ% క్యాపిటల్ విశ్వసిస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో డొనాల్డ్ ట్రంప్ విజయం, స్థిరమైన భౌగోళిక రాజకీయ అనిశ్చితి, యుఎస్డి బలం మరియు బంగారం ధరల తగ్గుదల మధ్య 72,000 కోట్ల రూపాయల FII అమ్మకాల ప్రభావాన్ని చూపుతున్న బెంచ్మార్క్ ఇండెక్స్ నిఫ్టీ 50 అక్టోబర్ 12 నుండి 6% తగ్గింది.

# షేర్‌ఖాన్ కొనుగోలు చేసిన మిరాయి అసెట్ ఫైనాన్షియల్ గ్రూప్

ముంబై: నియంత్రణ సంస్థలపరమైన అన్ని అనుమతులు వచ్చిన మీదట షేరా?న్ కొనుగోలును పూర్తి చేసినట్లు మిరాయి అసెట్ ఫైనాన్షియల్ గ్రూప్ప్ కటించింది. మిరాయి అసెట్ షేరా?న్ ఇకపై మిరాయి అసెట్ కుటుంబంలో భాగం కావడంతో ఇరు కంపెనీల ప్రస్థానంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఈ కొనుగోలుతో, మిరాయి అసెట్ యొక్క అంతర్జాతీయ అనుబ వాన్ని ఉపయోగించుకుని భారతదేశవ్యాప్తంగా క్లయింట్లకు మరింత మెరుగైన ప్రొడక్టులు మరి యు ఆర్థిక సేవలను అందించడానికి సంబంధించి షేరా?న్ తన వ్యాపారం, కార్యకలాపాలను మెరుగుపర్చుకోవడాన్ని కొనసాగిస్తుంది. మార్కెట్లో పటిష్టమైన స్థానం ఉన్న షేరా?న్కు మిరాయి అసెట్ యొక్క అంతర్జాతీయ వనరులను కూడా జతపర్చడం ద్వారా వివిధ వర్గాల క్లయింట్ల అవసరాలకు అనుగుణంగా సమగ్రమైన ఆర్థిక సేవల ప్లాట్ఫాంను తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశిం చుకోబడింది. ఈ ఏకీకరణ మరియు ఆకాంక్షల కలయికతో కొత్త లోగో రూపొందించబడింది. భారత షేర్ మార్కెట్లో పాలుపంచుకునే వారి ఆకాంక్షలను నెరవేర్చే విధంగా, ఊర్ధ్వముఖంగా వృద్ధిని సూచిస్తూ, సజావుగా సాగిన రెండు సంస్థల మేలు కలయికను ఇది ప్రతిఫలిస్తుంది. షేరా?న్ను కొనుగోలు చేయాలన్న మిరాయి అసెట్ నిర్ణయమనేది భారత రిటైల్ బ్రోకరేజి మార్కెట్లో స్థానాన్ని పటిష్టం చేసుకోవాలనే లక్ష్య సాధనకు అనుగుణంగా తీసుకోబడింది. "షేరా?న్ కొనుగోలు అనేది వృద్ధికి కీలకమైన మార్కెట్గా భారత్పై మిరాయి అసెట్కి గల చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తుంది. సంపద సృష్టికి సంబంధించి క్లయింట్లకు కొత్త అవకాశాలు కల్పించే దిశగా మిరాయి అసెట్ యొక్క పర్మనెంట్ ఇన్నోవేటర్ మైండ్సెట్కు, అంతర్జాతీయ పరిధిని భారత ఆర్థిక రంగంపై షేరా?న్కి గల అపారమైన అవగాహనకు జోడించడంపై మేము ఆసక్తిగా ఉన్నాం" అని మిరాయి అసెట్ ఫైనాన్షియల్ గ్రూప్ వ్యవస్థాపకుడు & జీఎస్వో (గ్లోబల్ స్ట్రాటెజీ ఆఫీసర్)ి యోన్-జూ పార్క్ తెలిపారు.

### ఇండియన్ ఉమెన్స్ క్రికెట్ టీమ్ కోసం

# కొత్త జెర్సీని ఆవిష్కరించిన అడిడాస్ - బీసీసీఐ




ముంబైః భారత క్రికెట్ జట్టు అధికారిక కిట్ స్పాన్సర్ అడిడాస్. వరుసగా రెండో ఏడాది కూడా బీసీసీఐతో భాగస్వామ్యాన్ని కొనసాగిస్తున్న అడిడాస్.. ఇప్పుడు బీసీసీఐ ప్రధాన కార్యాలయం ముంబయిలో భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్తో కలిసి కొత్త ఓడీఐ జెర్సీని ఆవిష్కరించింది. అయితే ఇందులో విశేషం ఏంటంటే... క్రికెట్ చరిత్రలో తొలిసారిగా భారత మహిళల జట్టుతో కలిసి జెర్సీని ఆవిష్కరించడం. భారతదేశంలో మహిళల క్రికెట్కు ఆదరణ మరింతగా పెంచాలన్న ఉద్దేశంతో బీసీసీఐ ఈ అద్భుతమై కార్య క్రమాన్ని మహిళల జట్టుతో నిర్వహించింది. మరోవైపు మైదానం వెలుగుపల మరియు లోపల... క్రీడలలో మహిళా భాగస్వామ్యం పెంచాలన్న అడిడాస్ నిబద్ధతకు ఇది నిదర్శనం.అద్భుతమైన ట్రూ-బ్లూ కలర్లో రూపొందించబడిన, కొత్త ఓడీఐ జెర్సీ స్లీవ్లపై భారతీయ జాతీయ జెండాలోని మూడు రంగులు ఇక్కడ ఉంటాయి. ఇది భారతదేశం యొక్క గర్వం మరియు జాతీయ ఉత్సాహాన్ని తెలియజేస్తుంది. ఇక జెర్సీ మన్నిక విషయానికి వస్తే ఎక్కడా రాజీపడకుండా రూపొందించారు. జెర్సీని అడిడాస్ జాక్వర్డ్ బేస్ ఫాబ్రిక్ను టెర్రీ లూప్ ప్యాటర్న్ తో అప్డేట్ చేశారు. మరోవైపు చెమట పట్టినా కూడా ఆటగాళ్లు ఇబ్బంది పడకుండా వేగంగా పీల్చి వేసేలా క్లైమేట్ కూల్ టెక్నాలజీ ద్వారా ఈ జెర్సీని రూపొందించారు. అన్నింటికి మించి ఇది పూర్తిగా 100% రీసైకిల్ మెటీరియల్తో తయారు చేయబడింది. భారత పురుషుల మరియు మహిళల క్రికెట్ టీమ్ పట్ల అడిడాస్కు ఉన్న నిబద్ధతను ఈజెర్సీ ప్రతిబింబి స్తుంది.
అడిడాస్ ఇండియా జనరల్ మేనేజర్ నీలేంద్ర సింగ్ మాట్లాడుతూ... "బీసీసీఐతో మా భాగస్వామ్యం రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినందుకు, అలాగే కొత్త జెర్సీ ఆవిష్కరణ లాంటి చారిత్రాత్మక ఘట్టంలో పాలు పంచుకున్నందుకు మేము ఎంతో గర్విస్తున్నాము మరియు చాలా ఆనందంగా కూడా ఉంది. క్రీడలలో మహిళలకు మా నుంచి సంపూర్ణ మద్దతు అన్నివేళలా ఉంటుంది. భారత మహిళల జట్టుతో కలిసి సరికొత్త ఓడీఐ జెర్సీని విడుదల చేయడం.. ఈ క్రీడలో మహిళలకు మా అచంచలమైన మద్దతుకు నిదర్శనం. బీసీసీఐతో కలిసి, అన్ని స్థాయిలలో అథ్లెట్లకు సాధికారత కల్పించడంలో పురోగతి సాధించడం మాకు గర్వకారణం. దీనిద్వారా వారి పనితీరు మరియు అభిరుచిని మరింతగా పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది అని అన్నారు ఆయన.
ఈ సందర్భంగా బీసీసీఐ సెక్రటరీ జై షా మాట్లాడుతూ... "భారతదేశంలో మహిళా క్రికెట్ అద్భుతమైన మైలురాళ్లను అందుకుంది. అంతేకాకుండా బీసీసీఐ దగ్గర మహిళల జట్టు అయినా, పురుషుల జట్టు అయినా ఒకటే. మాకు రెండు సమానమే. బీసీసీఐ మరియు అడిడాస్ ఆవిష్కరించిన కొత్తజెర్సీ మహిళల జట్టు ప్రదర్శనను మరింత హైలెట్ చేయడమే కాకుండా ప్లేయర్స్ కు మరియు దేశానికి మరింత ఉత్సాహాన్ని అందిస్తుంది. బీసీసీఐ మరియు అడిడాస్ రెండూ కలిసి క్రికెట్ లో మరిన్ని మైలురాళ్లను సాధించేందుకు కలిసి కట్టుగా ప్రయాణం చేస్తున్నాం అని అన్నారు ఆయన.
ఈ సందర్భంగా భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్ మాట్లాడుతూ... "భారత మహిళల జట్టు కెప్టెన్గా కొత్త ఓడీఐ జెర్సీని ఆవిష్కరించడం నాకు మరియు నా జట్టుకు ఎంతో గర్వకారణం. ఈ జెర్సీ కేవలం యూనిఫాం మాత్రమే కాదు, ఇది భారత దేశంలో మహిళా క్రికెట్ ఎంత సాధించిందో మరియు దేశం నుంచి మహిళల జట్టుకు ఎంత గౌరవం వచ్చిందో దానికి చిహ్నం. అడిడాస్ యొక్క అత్యాధునిక పనితీరుతో రూపొందించిన ఈ జెర్సీని ధరించడం వల్ల మేము కూడా మా శక్తివంచన లేకుండా మైదానంలో శ్రమించేందుకు, గొప్ప గొప్ప విజయాలు సాధించి మన దేశాన్ని అగ్రపథాన నిలిపేందుకు మాకు అవకాశం లభించింది అని అన్నారు ఆమె.
క్రికెట్ ప్రేమికుల కోసం సరికొత్త ఓడీఐ జెర్సీ... డిసెంబరు 2, 2024 నుంచి అందుబాటులో ఉంటా యి. వీటి ధరను రెండు రకాలుగా నిర్ణయించారు. అథెంటిక్ మ్యాచ్ జెర్సీ అయితే రూ. 5999గా, ఫ్యాన్ జెర్సీ అయితే రూ. 999 గా నిర్ణయించారు. ఇవి ఎంపిక చేసిన స్టోర్స్, యాప్ లో అందుబాటులో ఉంటాయి.

## రిటైర్మెంట్ ప్లానింగ్‌పై హెచ్‌డిఎఫ్‌సి తాజా ప్రచారం

భారతదేశంలోని ప్రముఖ బీమా సంస్థల్లో ఒకటైన హెచ్డిఎఫ్సి లైఫ్, సకాలంలో పదవీ విరమణ ప్రణా ళిక కోసం కీలకమైన ఆవశ్యకతపై దృష్టి సారించి తన తాజా ప్రచారాన్ని ఆవిష్కరించింది. భారతదేశంలో పెరుగుతున్న వృద్ధుల జనాభా మరియు ఆరోగ్య సంరక్షణలో పురోగతి మెరుగైన జీవన ప్రమాణాల కారణంగా పెరుగుతున్న ఆయుర్దాయం, పదవీ విరమణ ప్రణాళికను తప్పనిసరి చేస్తుంది. హెచ్డిఎఫ్సిలైఫ్ యొక్క తాజా ప్రచారం పదవీ విరమణ ప్రణాళికను వాయిదా వేయడానికి దారితీసే సాధారణ అవరోధాన్ని హైలైట్ చేస్తుంది. తల్లిదండ్రులు సాధారణంగా వారి స్వంత పదవీ విరమణ ప్రణాళిక కంటే గృహ రుణ చెల్లింపులు, పిల్లల విద్య లేదా తక్షణ కుటుంబ అవసరాలు వంటి ఆర్థిక కట్టుబాట్లకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ వాయిదా వలన పదవీ విరమణ కార్పస్ తగ్గుతుంది, ఎందుకంటే ఆలస్యంగా ప్లాన్ చేయడం వల్ల సంపద పోగుపడేందుకు పరిమిత సమయం ఉంటుంది. విశాల్ సుభర్వాల్ - గ్రూప్ హెడ్ స్ట్రాటజీ & చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ - హెచ్డిఎఫ్సి లైఫ్ మాట్లాడుతూ, "ఒకరి పొదుపును మించిపోయే ప్రమాదం అనేది వ్యక్తు లు వారి జీవితకాలంలో ఎదుర్కొనే అతిపెద్ద ఆందోళనలలో ఒకటి. సమ్మేళనం యొక్క శక్తిని ఉపయోగించు కోవడానికి పదవీ విరమణ ప్రణాళికను ముందుగానే ప్రారంభించడంలో పరిష్కారం ఉంది. చాలా తరచుగా, భారతదేశంలో, వారి పిల్లల భవిష్యత్తు సురక్షితం అయ్యే వరకు వ్యక్తులు దీనిని వాయిదా వేస్తారు. ఈ ప్రచారం ద్వారా మా ప్రధాన సందేశం ఏమిటంటే, ఒక వ్యక్తి వారి స్వర్ణ సంవత్సరాల కోసం ముందుగానే ప్రణాళికను ప్రారంభించాలి మరియు ఇప్పుడు ఉత్తమ సమయం అన్నారు.

## అలరించిన అడ్వెంచర్స్ ఇన్ ది వండర్‌ల్యాండ్ థీమ్




హైదరాబాద్ : సీనియర్ సీడ్స్ ప్రైమరీ క్యాంపస్మ సీడ్స్ ఏరియన్ క్యాంపస్ (శ్రీవాణి నగర్, ఆమీనపూర్, కోకా-కోలా ఫ్యాక్టరీ పక్కన) సంగమం వార్షికోత్సవ వేడుకలు మియాపూర్ 'విశ్వనాథ్ గార్డెన్స్'లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ వైస్-చైర్మన్ శ్రీ పాండు రంగా చారి, ఫౌండర్ & మేనేజింగ్ డైరెక్టర్ ఈద్పుగంటి నరేంద్ర ప్రసాద్ అకాడెమిక్ హెడ్ డాక్టర్ జయశ్రీ నాయర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ అశోక్ చక్రవర్తి, ప్రముఖ కథకురాలు రేణు చామర్తి హజరయ్యారు. స్కూల్ హెడ్స్ గరిమాకుమార్ . నాగవల్లి సమర్పించిన వార్షిక నివేదిక, రెండూ క్యాంపస్ల అభివృద్ధి మరియు సాధనలను హెచ్చరించి, తల్లిదండ్రులను ఆనందపరిచింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు "అడ్వెంచర్స్ ఇన్ ది వండర్ల్యాండ్" అనే ప్రత్యేకమైన థీమ్ ఆధారం గా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను ప్రదర్శించారు. రంగులతో అలంకరించిన వేదికపై విద్యార్థుల ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకుని మంత్రముగ్ధులను చేశాయి. నృత్య, గీతాలు మరియు నాటికలు వంటి ప్రదర్శనలు ఈ కార్యక్ర మానికి ఆకర్షణగా నిలిచింది. ప్రతిష్ఠాత్మమైన ఈ "సంగమం" కార్యక్రమం అందరికీ మధురమైన జ్ఞాపకాలను అందించడంతో పాటు, కొత్త ఆశయాలను నింపడంలో విజయవంతమైంది.

## ఐఎంటి హైదరాబాద్ స్నాతకోత్సవం




హైదరాబాద్:విద్యా సంవత్సరం విజయవంతంగా ముగిసిన సందర్భంగా 2022-2024 బ్యాచ్కి తమ క్యాంపస్లో స్నాతకోత్సవ వేడుకను ఐఎంటి హైదరాబాద్ నిర్వహించిం ది.ఐఎంటి హైదరాబాద్డీన్ (అకడ మిక్స్) డాక్టర్ చక్రపాణి చతుర్వేదుల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా సిమెన్స్ ఇండియా ఎండి & సీఈఓ సునీల్ మాథుర్ హాజరు కాగా, ఈ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఐఎంటి హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీహర్ష రెడ్డి, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యులు మరియు అధ్యాపకులు పాల్గొ న్నారు. డాక్టర్ కె. శ్రీహర్ష రెడ్డి వార్షిక నివేదికను అందజేస్తూ 2024 విద్యా సంవత్సరంలో ముఖ్య విశేషాలను పంచుకున్నారు. హెచ్సిఎల్ టెక్ సహకారంతో ప్రారంభించబడిన పిసిడిఎం-ఐటి మరియు సిఐఐ- ఇన్స్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్ సహకారంతో ప్రారంభించబడిన పిజిడిఎం లాజిస్టిక్స్ మరియు సప్లై చైన్ మేనేజ్మెంట్ అనే రెండు కొత్త ప్రోగ్రామ్లను పరిచయం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. విద్యార్థులకు అనేక ఉత్తేజకరమైన అవకాశాలను పలు సంస్థలు అందించడం గురించి ఆయన నొక్కి చెప్పారు.ఐఎంటి హైదరాబాద్ చీఫ్ మెంటర్ కమల్ నాథ్, 2024 గ్రాడ్యుయేటింగ్ క్లాస్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఇన్స్టిట్యూట్ యొక్క కఠినమైన విద్యా వాతావరణం మరియు సమగ్రత , దయ, ఆవిష్కరణల యొక్క ప్రధాన విలువలను ప్రశంసించారు. స్థిరత్వం మరియు నైతిక నాయకత్వం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, సవాళ్లను స్వీకరించడానికి, సానుకూల సామాజిక మార్పును నడపడానికి మరియు తమ ఆకాంక్షలను ధైర్యంగా కొనసాగించడానికి గ్రాడ్యుయేట్లను ప్రేరేపించారు.
ముఖ్య అతిథి సునీల్ మాథుర్, తన ప్రసంగంలో, అత్యాధునిక సాంకేతికతలు మరియు భవిష్యత్తును రూపొందించే ఆవిష్కరణల పరివర్తన పాత్ర గురించి చర్చించారు. ఈ పురోగతులు భారతదేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో కూడా మార్పును ఎలా నడిపిస్తున్నాయో చెబుతూ, పోటీతత్వాన్ని కొనసాగించేందుకు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రంగాలలో ముందంజలో ఉండవలసిన అవసరాన్ని ఎత్తిచూపారు. భవిష్యత్తు విజయానికి నిరంతర అభ్యాసం మరియు నెట్వర్కింగ్ కీలక కారకాలుగా ఆయన నొక్కి చెప్పారు.

## డిసెంబర్ 5 వరకు అమెజాన్ హోమ్ షాపింగ్ స్ప్రీ

బెంగళూరు : అమెజాన్ హోమ్ షాపింగ్ స్ప్రీ తో శీతాకాలం సీజన్ కోసం మీ ఇంటిని తయారు చేయండి. హోమ్, కిచెన్, అవుట్ డోర్స్‌లో విస్తృత శ్రేణి ఉత్పత్తులను అతి తక్కువ ధరలకు అందిస్తోంది. కస్టమర్లు ఫిలిప్స్, హావెల్స్, బెర్గ్ నర్, లైఫ్ లాంగ్, హిట్, అగారో మరియు ఇంకా ఎన్నో ప్రముఖ బ్రాండ్స్ నుండి 1 నుండి 5 డిసెంబర్ 2024 వరకు బెస్ట్ సెల్లర్స్ పైన ఉత్తేజభరితమైన డీల్స్ ను కూడా ఆనందించవచ్చు. ఇంకా, హెచ్ డిఎఫ్ సి, వన్ కార్డ్, మరియు ఏక్సిస్ బ్యాంక్ ఈఎంఐ కార్డ్స్ పైన 10% వరకు తక్షణ డిస్కౌంట్ పొందవచ్చు. కస్టమర్ అత్యంతగా ప్రేమించే కార్యక్రమాన్ని మిస్ చేయవద్దు .

# మీ మహా అనుమానాలు వింటాం..

## వచ్చి చెప్పండని కాంగ్రెస్‌కు ఈసీ పిలుపు

డాల్లీ: మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అనుమానాలు వ్యక్తంచేస్తోన్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఈసీ స్పందించింది. ఆ అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు డిసెంబరు 3న కాంగ్రెస్ ప్రతినిధులు రావాలని ఆహ్వానించింది."ఎన్నికలు ప్రతి దశలోనూ పారదర్శకంగా జరిగాయి. వారి చట్టపరమైన ఆందోళనలను మేం పరిశీలిస్తాం. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల బృందం అనుమానాలు విన్న తర్వాత రాతపూర్వక సమాధానం ఇస్తాం" అంటూ హస్తం పార్టీ బృందాన్ని ఈసీ ఆహ్వానించింది. మహారాష్ట్ర ఎన్నికల్లో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. వ్యక్తిగతంగా హాజరై తమ అనుమానాలు తెలియజేస్తామని కోరింది. ఈక్రమంలోనే ఈసీ నుంచి పిలుపు వచ్చింది. %ఇటీవల వెల్లడైన మహా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి భారీ విజయాన్ని సాధించింది. భాజపా 132 సీట్లు సొంతం చేసుకోగా.. శిందే శివసేనకు 57, అజిత్ పవార్ ఎన్సీపీకి 41 సీట్లు దక్కాయి. విపక్ష మహావికాస్ అఘాడీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. కాంగ్రెస్కు కేవలం 16 సీట్లు దక్కగా.. శివసేన(యూబీటీ) 20, ఎన్సీపీ(ఎస్పీ) 10 స్థానాలు సొంతం చేసుకుంది.




# పాలస్తీనియన్ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నాం

● పాలస్తీనా ప్రజలకు అండగా ఉంటాం ● పాలస్తీనా ప్రజలకు భారత ప్రధాని మోడీ లేఖ..
● హమాస్- ఇజ్రాయెల్ మధ్య శాంతియుత చర్చలు జరగాలని పిలుపు

న్యూఢిల్లీ : పాలస్తీనా ప్రజలకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లేఖ రాశారు. పాలస్తీనా అభివృద్ధికి తాము మద్దతుగా ఉంటుందని తెలిపారు. పాలస్తీనాలో కొనసాగుతున్న ఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హమాస్, ఇజ్రాయెల్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ యుద్ధం వల్ల వేలాది మంది ప్రజలు చనిపోయారు.. అలాగే, ప్రపంచంలోని చాలా దేశాలు అనేక రకాలుగా నష్టపోయా యని వెల్లడించారు. తక్షణమే కాల్పుల విరమణ, బందీలను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఉగ్రవాద కార్యకలాపాలకు స్వస్తి పలకాలని నరేంద్ర మోడీ కోరారు.ఇక, భారత ప్రధాని మోడీ రాసిన లేఖపై న్యూఢిల్లీలోని పాలస్తీనా రాయబార కార్యాలయం స్పందించింది. ఇజ్రాయెల్- హమాస్ మధ్య శాశ్వత పరిష్కారానికి సంబంధించిన చర్చలు జరగాలని భారతదేశం విశ్వసిస్తుందని ఆ దౌత్య కార్యాలయం ఇన్చార్జి అబేద్ ఎల్రాజేజ్ అబు జజార్ తెలిపారు. గాజా ప్రజలకు మానవతా సహాయం అందించడం కొనసాగించడానికి భారత్ తన నిబద్ధతను కలిగి ఉందని పేర్కొన్నారు. త్వరలోనే హమాస్- ఇజ్రాయెల్ మధ్య సమస్యలు పరిష్కారం దొరుకుతుందని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

"భారతదేశం తక్షణ కాల్పుల విరమణకు, అన్ని ఉగ్రవాద చర్యలకు ముగింపు పలకాలని, బందీలను విడుదల చేయాలని మరియు పాలస్తీనా ప్రజలకు మానవతా సహాయాన్ని నిరంతరం అందించాలని పిలుపునిస్తోంది" అని ప్రధాని లేఖలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న సంఘర్షణ ఫలితంగా విషాదకరమైన ప్రాణనష్టం జరిగిందని మరియు పాలస్తీనా మరియు విస్తృత పశ్చిమాసియా ప్రాంత ప్రజలకు అపారమైన బాధలు కలిగించాయని పేర్కొన్న %ూవీ%, "ప్రస్తుత భద్రత మరియు మానవతా పరిస్థితులపై భారతదేశం చాలా ఆందోళన చెందుతోంది" అని రాశారు.మరోసారి "చర్చల ద్వారా రెండు-రాష్ట్రాల పరిష్కారానికి మద్దతు ఇవ్వడం, సార్వభౌమ, స్వతంత్ర మరియు ఆచరణీయమైన పాలస్తీనా స్థాపనకు దారితీసింది, పక్కపక్కనే జీవిస్తుంది. ఇజ్రాయెల్తో శాంతితో".చర్చలు మరియు దౌత్యమే శాశ్వతమైన మరియు శాంతియుత పరిష్కారానికి కీలకమని భారతదేశం దృఢంగా విశ్వసిస్తోంది,

ముఖ్యంగా, అక్టోబర్ 2023లో సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి, భారతదేశం ఉగ్రవాదాన్ని ఖండించింది - ఇజ్రాయెల్పై హమాస్ దాడులను సూచి స్తుంది - అదే సమయంలో రెండు-రాష్ట్రాల పరిష్కారాన్ని కూడా సూచిస్తుంది. "స్థిరమైన అభివృద్ధి భాగస్వామి"గా భారతదేశం యొక్క మద్దతును కూడా అందజేస్తూ, ఈ ప్రయాణంలో భారతదేశం పాలస్తీనా ప్రజల అవసరాలు మరియు ప్రాధాన్యతల ఆధారంగా విభిన్న రంగాలలో ప్రజల-కేంద్రీకృత ప్రాజెక్టుల అమలుతో సహా వారితో పాటు నిలబడుతుందని ప్రధాని మోడీ రాశారు.ఈ సందేశానికి ప్రతిస్పందిస్తూ, న్యూ ఢిల్లీలోని పాలస్తీనా రాయబార కార్యాలయం చార్జ్ డి అఫైర్స్, అబేద్ ఎల్రాజెగ్ అబు జాజర్, "భారత ప్రధాన మంత్రి సందేశాన్ని మేము స్వాగతిస్తున్నాము మరియు అత్యంత అభినందిస్తున్నాము" అని చెప్పారు.పాలస్తీనా ప్రజలు సాధించడానికి ప్రయత్నిస్తున్న దౌత్య మరియు రాజకీయ మార్గం ద్వారా ఆచరణీయమైన పాలస్తీనా రాజ్య స్థాపనకు మరియు రెండు-రాష్ట్రాల పరిష్కారానికి భారతదేశం యొక్క మద్దతును పునరుద్ఘాటిస్తూ, ముఖ్యమైన విషయాలను ఈ సందేశం కలిగి ఉంది.



# 'ఫెయింజల్'ఎఫెక్ట్.. చెన్నై ఎయిర్‌పోర్ట్ మూసివేత



చెన్నై: బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు అనూహ్యంగా మారడంతో తీవ్ర వాయుగుండం తుపానుగా మారింది. పుదుచ్చేరి, తమిళనాడు తీరాల వైపు బలంగా దూసుకొస్తున్న ఈ 'ఫెయింజల్' తుపాను .. మరికొన్ని గంటల్లో తీరాన్ని తాకే అవకాశం ఉంది. దీంతో తమిళనాడు వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని చెన్నైలో ఇప్పటికే పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. వర్షాల కారణంగా విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు.బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు కురుస్తుండటంతో శనివారం సాయంత్రం 5 గంటల వరకు చెన్నై ఎయిర్పోర్ట్ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే శుక్రవారం నుంచి విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు పలు ఎయిర్లైన్లు ప్రకటించాయి. కొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. తాజాగా ఎయిర్పోర్టులో కార్య కలాపాలను నిలిపివేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.శనివారం సాయంత్రం నాటికి ఈ తుపాను కారైకాల్, మహాబలిపురం మధ్య తీరం దాటొచ్చని చెన్నై వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. తీరం దాటేటప్పుడూ ఉద్ధృతంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. భీకర గాలులు, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.దీంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే సహాయక శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. తుపానును ఎదుర్కొనేందుకు సంసిద్ధత చర్యలను ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అటు పుదుచ్చేరిలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. పలు ప్రాంతాల్లో నీరు చేరింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రభుత్వం సూచించింది.

# అంతరిక్ష రంగంలోనూ స్టార్టప్‌ల జోరు..



● గ్లోబల్ మార్కెట్లో పెరిగిన భారత్ వాటా! ● ఇప్పటి వరకు 431 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించిన ఇస్రో
● అంతరిక్ష రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందన్న సోమనాథ్
● 'ఇస్రో విజన్ భారత స్పేస్ టెక్ కంపెనీల పెరుగుదల' అనే అంశంపై కీలక ఉపన్యాసం

న్యూఢిల్లీ: భారతదేశంలో అంతరిక్ష కార్యకలాపాలను ప్రోత్సహించడంలో ప్రైవేట్ రంగం, స్టార్టప్లు కీలక పాత్ర పోషిస్తాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అన్నారు. వారి సహకారంతో గ్లోబల్ మార్కెట్లో దేశం మరింత వాటాను పొందగలదని ఆయన అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్లో మరింత వాటాను కైవసం చేసుకునేందుకు భారత్ తన అంతరిక్ష కార్యకలాపాలను పెంచుకోవాలని చూస్తోంది. శుక్రవారం(నవంబర్ 29) కేరళ స్టార్టప్ మిషన్ నిర్వహించిన దేశ ఫ్లాగ్షిప్ స్టార్టప్ ఫెస్టివల్ హడిల్ గ్లోబల్ 2024లో 'ఇస్రో విజన్ భారత స్పేస్ టెక్ కంపెనీల పెరుగుదల' అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు.తిరువనంతపురంలో కేరళ స్టార్టప్ మిషన్ కార్యక్రమం 'హడిల్ గ్లోబల్ 2024'లో 'ఇస్రో విజన్ భారతదేశంలో అంతరిక్ష సాంకేతిక సంస్థల పెరుగుదల'పై ఎస్ సోమనాథ్ మాట్లాడుతూ, అంతరిక్ష శక్తిగా గుర్తించబడినప్పటికీ, ప్రపంచ వ్యాపారంలో భారతదేశం వాటా కేవలం రెండు మాత్రమే. శాతం అంటే 386 బిలియన్ యుఎస్ డాలర్లు. 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు, 2047 నాటికి 1,500 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్ యోచిస్తోందన్నారు.

ప్రైవేట్ రంగానికి వాణిజ్య కార్యకలాపాలకు ఉన్న అవకాశాలను సూచిస్తూ, భారతదేశంలో కేవలం 15 కార్యాచరణ అంతరిక్ష ఉపగ్రహాలు మాత్రమే ఉన్నాయని, ఇది చాలా తక్కువ అని సోమనాథ్ అన్నారు. అంతరిక్ష సాంకేతికతలో భారత్కు ఉన్న నైపుణ్యం, పెరుగుతున్న ఉపగ్రహాల తయారీ కంపెనీల దృష్ట్యా కనీసం 500 ఉపగ్రహాలను అంతరిక్షంలో ఉంచగల సామర్థ్యం మన దేశానికి ఉందని సోమనాథ్ తెలిపారు. "ప్రస్తుత మార్కెట్లో అనేక ప్రైవేట్ సంస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి ఉపగ్రహాలను తయారు చేసి వాటిని కక్ష్యలో ఉంచగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నా యి. ప్రైవేట్ 'లాంచ్యాడ్లు' కూడా నిర్మిస్తున్నాయి. 2014లో అంతరిక్ష సంబం ధిత స్టార్టప్లు ఒక్కటే ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 250కి పైగా పెరిగింది. 2023లోనే స్పేస్ స్టార్టప్ విభాగంలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు వచ్చా యని సోమనాథ్ తెలిపారు. పెద్ద కంపెనీలు ఇప్పుడు అంతరిక్ష రంగానికి చురుకుగా సహకరిస్తున్నాయని సోమనాథ్ KSUM విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భారతదేశం అంతరిక్షంలో తన కార్యకలాపాలను ఇంటర్-ప్లానెటరీ అన్వేషణకు విస్తరించడంతో, భారతదేశం మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్యాన్ , భారత అంతరిక్ష కేంద్రం వంటి భవిష్యత్ ప్రాజెక్టులు కూడా ఇస్రో, ప్రైవేట్-రంగం మధ్య సహకార ప్రయత్నాలుగా ఉంటాయని సోమనాథ్ తెలిపారు. చిన్న ఉపగ్రహాలు, జియోస్పేషియల్ సొల్యూషన్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఆర్బిటల్ ట్రాన్స్ఫర్ వెహికల్స్ వంటి మరెన్నో రూపకల్పన, ప్రయోగాలలో ప్రైవేట్ రంగ ప్రమేయానికి అపారమైన అవకాశం ఉందని ఆయన అన్నారు. ఇస్రో ఇప్పటి వరకు 431 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించామని, అంతరిక్ష రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని సోమనాథ్ పేర్కొన్నారు.

# మహా సీఎం రేసులో కొత్త పేరు

కేంద్రమంత్రి మురళీధర్ మొహోల్ కి అవకాశం?
మహారాష్ట్ర సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారంటూ ఊహాగానాలు
సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పోస్టులపై స్పందించిన ఎంని
అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేసిన కేంద్రమంత్రి



ముంబయి: మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరు అనే విషయంపై ఇంకా సందిగ్ధం నెలకొనే ఉంది. భవిష్యత్తు కార్యాచరణపై శిందే 24 గంటల్లో కీలక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈనేపథ్యంలో సీఎం రేసులో భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ పేరుతో పాటు భాజపా పుణె ఎంపీ, ప్రస్తుత కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ పేరు తెర పైకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో మహారాష్ట్ర సీఎంగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పోస్టులు దర్శనమిస్తున్నాయి. ఈవిషయంపై ఎంపీ స్పందిస్తూ అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు. సీఎం రేసులో తన పేరు ఉందంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా కల్పితమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎవరనే విషయం భాజపా పార్లమెంటరీ బోర్డు తేలుస్తుందని, సోషల్ మీడియా కాదని వివరణ ఇచ్చారు. తమ నాయకుడు దేవేంద్ర ఫడణవీస్ నాయకత్వంలో మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా పోరాడి, అద్భుత విజయం సాధించిందని మురళీధర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై స్పష్టత లేదు. మహాయుతి తరఫున ముఖ్యమంత్రి ఎవరనేది ఇంకా స్పష్టం కాలేదు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే సతారా జిల్లాలోని తన స్వగ్రామానికి వెళ్లినందున కూటమి నేతలు బహుశా ఆదివారం సమావేశం కావచ్చని తెలుస్తోంది. అయితే శిందేను ముఖ్యమంత్రిగా కొనసాగించడానికి భాజపా విముఖత చూపడంతో ఆయన అసంతృప్తితో ఉన్నారని ఊహాగానాలు సాగుతున్నాయి. ఈనేపథ్యంలో మురళీధర్, వినోద్ తావ్డే, రాధాకృష్ణ విఖే-పాటిల్ వంటి ప్రత్యామ్నాయ పేర్లను అగ్రనాయకత్వం పరీక్షిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సీఎం పదవికి పోటీపడుతున్న దేవేంద్ర ఫడణవీస్కు భాజపా జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి .. అయితే.. ఫడ్నవీస్ సీఎంగా ఉంటారని.. డిప్యూటీ సీఎంలుగా షిండే, అజిత్ పవార్ ఉంటారంటూ పేర్కొంటున్నారు.. దీనిపై క్లారిటీ రావాలంటే మరో మూడు రోజులు ఆగాల్సిందే..

# ఇలాంటి అధికార దుర్వినియోగం మునుపెన్నడూ చూడలేదు

● మహాయుతిపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ఆగ్రహం




పుణె: ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార మహాయుతి తీరుపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవాం విమర్శలు గుప్పించారు. దేశంలో ఇంతకు ముందెన్నడూ చూడనివిధంగా మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార దుర్వినియోగం జరిగిందన్నారు. కొందరు నేతలు, మీడియా వర్గాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుపెట్టిందని ఆరోపించారు. పార్లమెంటు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎప్పుడూ ఇలా జరగలేదని వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ నిరసనకు దిగిన సామాజిక కార్యకర్త బాబా అధవ్ను కలిసి సంఘీభావం తెలిపారు. బాబా అధవ్.. సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే నివాసమైన పూలే వాడలో మూడు రోజులు నిరసన చేపట్టారని, కాని ఇది మాత్రమే చాలదని పవార్ అన్నారు. ప్రజల్లో తిరుగుబాటు రాకపోతే ప్రజాస్వామ్యం నాశన మవుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఈవీఎంలలో అవకతవకలు జరిగినట్లు ప్రతిపక్ష మహావికాస్ అఘాడి (ఎంవిఎ) నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే.

ఈవిషయంపై పవార్ మాట్లాడుతూ.. దేశ పగ్గాలు తమ చేతుల్లో ఉన్నవారు ఎన్నికల్లో జరుగుతున్న అవకతవకలను పట్టించుకోవడం లేదన్నారు. వారికి అనుగుణంగా నిర్ణయాలుతీసుకొని చట్టాలు రూపొందించుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈవీఎంలలో జరుగుతున్న అవకతవకల విషయంలో దేశ వ్యాప్తంగా విస్తృతంగా చర్చలు జరుగుతున్నా.. విపక్షాలు పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తడానికి ప్రయత్నిస్తున్నా కేంద్రం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అంశాలపై పార్లమెంటులో మాట్లాడడానికి ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నా.. అవకాశం ఇవ్వట్లేదని.. ఈవిధంగా వారు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు.నవంబర్ 20న జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో శివసేన, భాజపా, ఎన్సీపీలతో కూడిన మహాయుతి 288 అసెంబ్లీ స్థానాల్లో 230 స్థానాల్లో విజయం సాధించగా, ప్రతిపక్ష మహావికాస్ అఘాడి కేవలం 46 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఈ ఫలితాలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు వద్దని.. బ్యాలెట్ పేపర్లే తాము కోరుకుంటున్నామన్నారు.

# యుద్ధాన్ని ఆపేస్తాం

నాటో భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వాలన్న జెలెన్స్కీ



ఉక్రెయిన్ : రెండున్నరేళ్లకు పైగా సుదీర్ఘంగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుపట్టట్లేదు. అటు కీవ్ సైనికులు కూడా రష్యా దూకుడును ఎదుర్కోలేమంటూ చేతులెత్తేస్తున్నారు. ఈ పరిణామాల వేళ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. కీవ్ అధీనంలో ఉన్న భూభాగాన్ని నాటో పరిధిలోకి తీసుకొస్తే యుద్ధాన్ని ముగించే అవకాశాలున్నాయని వెల్లడించారు. బ్రిటన్ మీడియా సంస్థ 'స్కై న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. "యుద్ధంలోని కీలక దశను ఆపాలనుకుంటే మా నియంత్రణలో ఉన్న ఉక్రెయిన్ ( భూభాగానికి నాటో భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వాలి. అప్పుడే మేం కాల్పుల విరమణకు అంగీకరించే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత అంతర్జాతీయ సరిహద్దుల పరిధిలో ఉన్న మొత్తం మా దేశాన్ని (రష్యా ఆక్రమిత ప్రాంతాలతో కలిపి) నాటోలో చేర్చుకోవాలి. అలా జరిగితే రష్యా ఆక్రమించుకున్న భూభాగాన్ని దౌత్యపరంగా సాధించుకు నే వీలు మాకు లభిస్తుంది" అని జెలెన్స్కీ వెల్లడించారు. అయితే తన సూచనను పరిగణనలోకి తీసుకోవడం కష్టమే అని ఉక్రెయిన్ అధ్యక్షుడు అన్నారు. ఇప్పటివరకు నాటోలోని ఏ దేశమూ తమకు ఈ విధమైన హామీ ఇవ్వలేదన్నారు. "మమ్మల్ని ఎప్పటికైనా నాటోలో చేర్చుకుంటారా అనేది సందేహమే..! ఇప్పటివరకు మాకు దీనిపై ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు. కేవలం దేశంలోని కొంత భాగాన్ని మాత్రమే చేర్చుకుంటామని ఆహ్వానించడం సరికాదు. ఉక్రెయిన్ అంటే మా మొత్తం భూభాగం. రష్యా అనేది వేరు" అని జెలెన్స్కీ పేర్కొన్నారు.2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్పై సైనిక చర్య పేరుతో రష్యా దండెత్తిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ఇరుదేశాల మధ్య భీకర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

# దేశ జీడీపీ కనిష్ఠంగా నమోదు



● అదానీ వ్యవహారంలో బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు ● లేబర్ డైనమిక్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్' కొత్త నివేదిక
● దేశ మధ్యస్థ, దీర్ఘకాలిక ఆర్థిక సామర్థ్యం వేగంగా క్షీణిస్తోందని ఆరోపణలు
● మోడీ కన్నా మన్మోహన్ హయాంలో బెటర్ అని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వృద్ధి రెండేళ్ల కనిష్ఠానికి క్షీణించడంపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. దేశ మధ్యస్థ, దీర్ఘకాలిక ఆర్థిక సామర్థ్యం వేగంగా క్షీణిస్తోందని ఆరోపించింది. భయంకరమైన వాస్తవాలను ఎంతకాలం దాస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

"జులై-సెప్టెంబర్ 2024కి సంబంధించిన దేశ జీడీపీ వృద్ధి గణాంకాలు ఊహించిన దానికంటే చాలా దారుణంగా ఉన్నాయి. భారత్ 5.4శాతం వృద్ధిని నమోదు చేసింది. వినియోగ వ్యయాల వృద్ధి 6శాతం వృద్ధి చెందింది. ఈ ఆర్థిక మందగమనానికి గల కారణాల పట్ల నాన్ బయోలాజికల్ ప్రధాన మంత్రి, ఆయన సహచరులు అంటిముట్టనట్లుగా ఉన్నారు. దేశ జీడీపీ గురించి ముంబయికి చెందిన ప్రముఖ ఆర్థిక సమాచార సేవల సంస్థ, ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ విడుదల చేసిన 'లేబర్ డైనమిక్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్' అనే కొత్త నివేదిక వెల్లడించింది." అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అగ్రహం వ్యక్తం చేసారు.

ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో హరియాణా, అసోం, యూపీలోని కార్మికుల వేతనాలు కూడా క్షీణించాయని జైరాం రమేశ్ ఆరోపించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో వ్యవసాయ కార్మికులకు ఏటా వేతనాలు 6.8శాతం చొప్పున పెరిగాయని అన్నారు. నరేంద్ర మోదీ హయాంలో వ్యవసాయ కార్మికులకు వేతనాలు ప్రతి ఏటా 1.3శాతం తగ్గాయని విమర్శించారు. "2017-2022 మధ్య కాలంలో కార్మికులు, స్వయం ఉపాధి కార్మికుల ఆదాయాలు తగ్గాయి. ఇటుక బట్టీ కార్మికుల వేతనాలు తగ్గుముఖం పట్టాయి. దేశ జీడీపీపై వాస్తవాలను ఎంతకాలం విస్మరిస్తారు. ప్రధానమంత్రి హైప్ను క్రియేట్ చేస్తున్నప్పుడు దేశ ప్రజలు ఆశతో జీవించడం కొనసాగిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ 8.1 శాతం వృద్ధి చెందింది. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 4.3 శాతం వద్ద మునుపటి కంటే కనిష్ఠ స్థాయిలో జీడీపీ వృద్ధి నమోదైంది." అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

**అదానీ విషయంలో కేంద్రంపై వ్యంగ్యాస్త్రాలు:** అదానీ గ్రూప్పై అమెరికా జరిపిన దర్యాప్తులో భారత ప్రభుత్వం ఏ విధంగానూ భాగం కాదన్న భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. 'అదానీ గ్రూప్ వ్యవహారంలో అమెరికా దర్యాప్తులో భారత ప్రభుత్వం భాగం కాదని విదేశాంగ శాఖ ప్రతినిధి చాలా స్పష్టంగా చెప్పారు. ఈ ప్రభుత్వం తనకు తాను దర్యాప్తులో ఎలా భాగం అవుతుందిలే?" అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ విమర్శించారు. ప్రభుత్వంపైనే విమర్శలు వచ్చాయనే ఉద్దేశంలో ఈ విమర్శలు గుప్పించారు.

సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు అదానీ గ్రూపు లంచాలు ఇచ్చారని అమెరికా చేసిన ఆరోపణలపై భారత విదేశాంగ ప్రతినిధి రణ్ధీర్ జైస్వాల్ స్పందించారు. "ఇది ప్రైవేటు సంస్థలు, కొంతమంది వ్యక్తులు, అమెరికా న్యాయశాఖకు సంబంధించిన అంశం. ఇటువంటి కేసుల్లో అనుసరించాల్సిన విధానాలు, చట్టపరమైన మార్గాలు స్పష్టంగా ఉన్నాయి. అవి వాటిని అనుసరిస్తాయని విశ్వసిస్తున్నాం. ఇప్పటివరకు భారత సర్కారుకు ఎటువంటి సంబంధం లేని ఈ అంశంపై అమెరికా ప్రభుత్వంతో ఎటువంటి చర్చలు జరపలేదు" అని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తాజాగా విమర్శలు గుప్పించింది.

# ఇరాక్ నుంచి దూసుకొచ్చిన డ్రోన్లు..


● నేలకూల్చిన ఇజ్రాయెల్



హెజ్బుల్లా: ఇజ్రాయెల్-హెజ్బొల్లాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినా నేటికీ ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ఇరాక్ వైపు నుంచి ఇజ్రాయెల్లోకి రెండు డ్రోన్లు దూసుకొచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. మధ్యధరా సముద్రంలోని నేవీ మిస్సైల్ బోటు సాయంతో వాటిని తమ మిలిటరీ దళాలు నేలకూల్చాయని తెలిపారు. అవి 'తూర్పు' నుంచే వచ్చాయని, ఇరాక్ వాటిని ప్రయోగించింది అని చెప్పడానికి అదొక కోడ్ అని వివరించారు. కాగా డ్రోన్లు దూసుకొస్తున్న సమయంలో ఎలాంటి సైరన్లు మోగలేదని వెల్లడించారు. ఇటీవల ఇరాన్ నుంచి ఇజ్రాయెల్ వైపు దూసుకొచ్చిన మరో అనుమానిత డ్రోన్ను ఇజ్రాయెల్ వైమానిక దళం కూల్చివేసినట్లు వెల్లడించారు.

కాగా ఇజ్రాయెల్-హెజ్బొల్లాల మధ్య యుద్ధం నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లిన లెబనాన్ సరిహద్దు ప్రాంతాల ప్రజలు కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం తిరిగి తమ ప్రాంతాలకు ప్రయాణమయ్యారు. దీనిపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ స్పందిస్తూ లెబనాన్ దక్షిణభాగంలోని సరిహద్దు ప్రాంత ప్రజలకు హెచ్చరికలు చేసింది. సురక్షిత ప్రాంతాలకు వెళ్లినవారు కాల్పుల విరమణకు సంబంధించిన తదుపరి నివేదిక వచ్చే వరకు తమ సొంత గ్రామాలకు తిరిగిరావొద్దని పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం, ఐడీఎఫ్ ఈ గ్రామాల నుండి వైదొలగడానికి 60 రోజుల సమయం ఉంది.

# రియల్ టైంకు అనుగుణంగా చర్యలు



● సహాయక చర్యలు, పునరావాస కార్య క్రమాల కు సమాయత్తం ● అన్నదాతలకు సమాచారం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: వేగంగా దూసుకొస్తున్న ఫెంగల్ తుఫాన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విపత్త నిర్వహణ శాఖ, జిల్లా కలెక్టర్లు, సీఎంఓ, రియల్ టైం గవర్నెన్స్ అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు రియల్ టైంలో అంచనా వేసి అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీజీ ద్వారా నిరంతర పర్యవేక్షణతో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచనలు జారీ చేశారు. తుఫాన్ కారణంగా ఆకస్మిక వరదలు వస్తాయనే సమాచారం నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు డిజాస్టర్ టీంను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందు నుంచే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలకు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్లకు సీఎం ఆదేశించారు. తుఫాన్‌పై ధాన్యం రైతులు ఆందోళనగా ఉన్నారని, నిర్దిష్టమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరవేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచనలు జారీ చేశారు. తుఫాన్ కారణంగా ఆకస్మిక వరదలు వస్తాయనే సమాచారం నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు డిజాస్టర్ టీంను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందు నుంచే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలకు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్లకు సీఎం ఆదేశించారు. తుఫాన్‌పై ధాన్యం రైతులు ఆందోళనగా ఉన్నారని, నిర్దిష్టమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరవేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచనలు జారీ చేశారు. తుఫాన్ కారణంగా ఆకస్మిక వరదలు వస్తాయనే సమాచారం నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు డిజాస్టర్ టీంను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందు నుంచే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలకు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్లకు సీఎం ఆదేశించారు.



# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● ఫెయింజల్ తుపాను కారణంగా రైతులకు అందుబాటులో ఉండాలి ● మత్స్యకారులు తుపాను ప్రభావం తగ్గే వరకు వేటకు వెళ్లకుండా చర్యలు ● తుపాను ప్రభావం ఉన్న జిల్లాల్లో అధికారులు సెలవు పెట్టవద్దు ● రాష్ట్ర వ్యవసాయ, సహకార మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఫెయింజల్ తుపాను కారణంగా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులందరూ రైతులకు అందుబాటులో ఉండాలని, తుపాను సమయంలో రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. తుపాను తీవ్రత, తాజా పరిస్థితిని తనకు ఎప్పటికప్పుడు తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. తీరప్రాంతాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తుపాను ప్రభావం తగ్గే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమ జిల్లాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉండడంతో తుపాను తీవ్రత తగ్గిన వెంటనే చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు రైతులకు తెలియచేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తిరుపతి, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు, ఈదురు గాలులు, ఆకస్మిక వరదలకు అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులు ఎవరూ సెలవు పెట్టకుండా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.





# నేడు 'ప్రపంచ ఎయిడ్స్' దినం

● రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు ● హెచ్ఐవీ రోగుల సంఖ్యలో రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ ● బాధితుల్లో అత్యధికులు మహిళలే ● హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగులకు పింఛను, ఉచితంగా మందులు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ప్రపంచవ్యాప్తంగా ఏటా డిసెంబర్ 1న 'ప్రపంచ ఎయిడ్స్ దినం'గా నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఒక కొత్త నినాదంతో హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సంవత్సరం "హక్కుల మార్గాన్ని అనుసరించడం – నా ఆరోగ్యం, నా హక్కు" నేపథ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2023–24 నాటికి 2,22,338 మంది హెచ్ఐవీ రోగులు 'నేషనల్ ఎయిడ్స్ అండ్ ఎస్‌టీడీ కంట్రోల్ ప్రోగ్రాం' కింద చికిత్స పొందుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. బాధితుల్లో మహిళల సంఖ్య సగం కంటే ఎక్కువగా ఉంది. మొత్తం 1,22,124 మంది మహిళలు హెచ్ఐవీ చికిత్స పొందుతున్నారు. పురుషుల సంఖ్య 99,455 కాగా, థర్డ్‌జెండర్లు 759 మంది. మన రాష్ట్రంలో, 2019–20లో నమోదైన హెచ్ఐవీ రోగుల సంఖ్య 1,92,693 కాగా, 2023–24 నాటికి ఆ సంఖ్య 2,22,338కు, అంటే 15.38% పెరిగింది. వీరిలో 90% మంది 15–49 సంవత్సరాలు మధ్య వయస్సు వారే. దాదాపు 90% మందికి సురక్షితంకాని లైంగిక సంబంధాల కారణంగానే హెచ్ఐవీ సోకుతోంది. గుంటూరు, తూర్పు గోదావరి ,కృష్ణ, విశాఖ ఉమ్మడి జిల్లాల్లో వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి, హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం విస్తృత చర్యలు చేపట్టింది. సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, సూదుల ద్వారా మాదకద్రవ్యాలు తీసుకునే వ్యక్తులు, వలస కార్మికులకు హెచ్ఐవీ సోకే అవకాశాలు ఎక్కువ ఉన్నందున, వారిలో అవగాహన పెంచేందుకు స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోంది. దాదాపు 2 లక్షల మంది ఈ సేవలు అందుకుంటున్నారు. మన రాష్ట్రంలో మొత్తం 2,181 హెచ్ఐవీ పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. దాదాపు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా హెచ్ఐవీ నిర్ధరణ పరీక్షలు చేస్తున్నారు. హెచ్ఐవీ సోకిందని తెలియగానే ఏఆర్‌టీ చికిత్స మొదలు పెడుతున్నారు. హెచ్ఐవీ రోగులకు అవసరమైన మందులను 60 ఏఆర్‌టీ కేంద్రాలు, 161 లింక్ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. బాధితుల ఆర్థిక సంక్షేమం కోసం ప్రభుత్వం పింఛను కూడా ఇస్తోంది. హెచ్ఐవీ రోగుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు కాబట్టి, అనుమానం ఉన్న వ్యక్తులు ఎవరైనా నిర్భయంగా పరీక్షలు చేయించుకోవచ్చు.

**హెచ్ఐవీ బాధితులకు ఆర్థిక సాయం కోసం ఏఆర్‌టీ పింఛను నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్నారు.**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏఆర్‌టీ, లింక్ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా మందులు, పరీక్షలు, సలహాలు అందిస్తున్నారు. హెచ్ఐవీ బాధితులకు సామాజిక చికిత్స అందించడానికి కౌన్సెలింగ్ సెషన్‌లు నిర్వహిస్తున్నారు. హెచ్ఐవీ బాధితులకు హెపటైటిస్ వ్యాక్సిన్ ఇస్తున్నారు. ట్రాన్స్‌జెండర్‌లకు వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించడానికి ప్రత్యేక కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. ప్రజల్లో సుఖవ్యాధుల నియంత్రణ కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో 55 ప్రత్యేక సురక్ష క్లినిక్‌లను అందుబాటులో ఉంచింది. ప్రజలకు సురక్షితమైన రక్తం సరఫరా చేయడానికి 227 బ్లడ్ బ్యాంక్‌లు, 156 రక్త నిధి కేంద్రాల్ని నెలకొల్పింది. ప్రజల్లో, ముఖ్యంగా యువతలో హెచ్ఐవీ/ఎయిడ్స్ గురించి అవగాహన పెంచడానికి విస్తృతమైన కార్యక్రమాల్ని ఎపిశాక్స్ నిర్వహిస్తోంది. ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగా హెచ్ఐవీ బాధితులకు సకాలంలో వైద్యం అందుతోంది. ప్రజల్లో హెచ్ఐవీ గురించి అవగాహన పెరిగింది. హెచ్ఐవీ బాధితులపై సామాజిక వివక్ష తగ్గింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (%ూూూూజూ%), 'ప్రపంచ ఎయిడ్స్ దినం' సందర్భంగా విజయవాడలో ఆదివారం ఉదయం 8 గంటలకు భారీ ర్యాలీ చేపట్టనుంది. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వివిధ అవగాహన కార్యక్రమాల్ని ఏర్పాటు చేసింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ఈ ఏడాది ఆగస్టు 12 నుంచి నవంబరు 12 వరకు "మీకు తెలుసా?" పేరిట ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది. ప్రతి ఒక్క ప్రభుత్వ విభాగాన్ని ఇందులో భాగస్వామ్యం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో, ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తద్వారా, యువత స్థాయి నుంచే హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. దీంతోపాటు, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (ఎన్ఏసీవో) మద్దతుతో, ఏపీఎస్ఏసీఎస్ "యూత్‌ఫెస్ట్ 2024–2025" మారథాన్ కూడా నిర్వహించింది. స్త్రీ, పురుషులతో పాటు ట్రాన్స్‌జెండర్‌లను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చైతన్యవంతం చేశారు. లింగ సమానత్వాన్ని చాటేలా, ఈ మూడు విభాగాల్లోనూ ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించారు. రాష్ట్రస్థాయిలో విజేతలను జాతీయ స్థాయి మారథాన్‌కు ఎంపిక చేశారు. 9, 11 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు కూడా నిర్వహించారు. చాలామంది ప్రజలు హెచ్ఐవీ, ఎయిడ్స్ ఒకటే అనుకుంటున్నారు. అది నిజం కాదు. హెచ్ఐవీ అంటే "హ్యూమన్ ఇమ్యునో డెఫిసియన్సీ వైరస్". ఈ సూక్ష్మక్రిమి మానవ శరీరంలో ప్రవేశించి, శరీరంలోనే వృద్ధి చెంది, రోగ నిరోధక శక్తిని క్రమేణా నాశనం చేస్తుంది. ఈ కారణంగా ప్రజల ఆరోగ్యం క్రమంగా క్షీణించి అనేక వ్యాధుల బారిన పడతారు. ఎయిడ్స్ (%ూ×ణూ%) అంటే, "అక్వైర్డ్ ఇమ్యునో డెఫిసియన్సీ సిండ్రోమ్". హెచ్ఐవీ మానవ శరీరంలో వృద్ధి చెందాక, రోగ నిరోధక శక్తి తగ్గినప్పుడు ఏర్పడే అనారోగ్య పరిస్థితి ఇది. హెచ్ఐవీ ఉన్న అందరూ ఎయిడ్స్ రోగులు కాదు. హెచ్ఐవీ నుంచి ఎయిడ్స్ దశలోకి మారడానికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. హెచ్ఐవీ సోకినప్పటికీ, బలవర్ధకరమైన ఆహారం, క్రమం తప్పని చికిత్స, వ్యాయామాలతో చాలా ఏళ్లపాటు సాధారణ ప్రజల్లాగే ఆరోగ్యంగా జీవించవచ్చు.




## ప్రపంచ పర్యావరణ సంస్థకు
# ఉత్తమ ఎన్జీవో సేవ పురస్కారం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బిక్కి సంస్థ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ మహానగరంలో టీ హబ్బులో జరిగిన జాతీయస్థాయి అవార్డుల ప్రధాన మహోత్సవ కార్యక్రమంలో గత 12 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం పని చేస్తున్న ప్రపంచ పర్యావరణ సంస్థలు జాతీయ స్థాయి ఉత్తమ ఎన్జీవో సంస్థ గుర్తించి హైదరాబాదు నగరంలో టీ హబ్బులో బిక్కీ సంస్థ వారు జాతీయ స్థాయి ఉత్తమ ఎన్జీవో అవార్డుచేత సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీసీ రోడ్డు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా సమస్త అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర కి సమస్త కార్యవర్గ సభ్యులు సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్, చెల్లూరి శ్రీనివాస్‌కి శివదాసు గోపాల్ నాయుడు మరియు ప్రపంచ పర్యావరణ సంస్థ కార్యవర్గ బృందం అవార్డుని స్వీకరించడం జరి గింది ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రపంచ పర్యావరణ సంస్థ నేడు దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం పైన ప్రజలను విద్యార్థులను చైతన్యవంతులను చేస్తూ కాలుష్య రహిత సమాజ నిర్మాణం కోసం కల్తి లేని కాలుష్యం లేని మంచి ఆహారం కోసం స్వచ్ఛమైన గాలి కోసం స్వచ్ఛమైన మంచినీరు కోసం భవిష్యత్తు తరాలు గాలిని కూడా కొనుక్కునే దయనీయమైన స్థితిలోకి వెళ్లకుండా ఉండడం కోసం గాలి కాలుష్యాన్ని వాయు కాలుష్యాన్ని ప్రభుత్వాలు ప్రజలు స్వచ్ఛందంగా విద్యార్థి లోకాన్ని చైతన్యవంతులను చేస్తూ ప్రపంచ పర్యావరణ సంస్థ గత 12 సంవత్సరాలుగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అనేక సెమినార్లను సదస్సులను ఏర్పాటు చేసి నేడు రెండు తెలుగు రాష్ట్రాలలో 1000 నుంచి 1500 పాఠశాలల్లో ప్రతి ఉదయం విద్యార్థిని విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమం నేచర్ అవర్ టీచర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది ప్రతిరోజు వేలాది మంది విద్యార్థులు వారు తినే ఆహార పదార్థాలు ప్లాస్టిక్ బాక్సులలో కాకుండా స్టీల్ బాక్స్ లలో లంచ్ తెచ్చుకునే విధంగా స్నాక్స్ తెచ్చుకునే విధంగా పర్యావరణ సంస్థ విశేషంగా కృషి చేసింది మైక్రో ప్లాస్టిక్ మూలంగా విద్యార్థులకు అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లుగా ప్రపంచ పర్యావరణ సంస్థ పరిశోధనలు తెలియని విషయాలను విద్యార్థుల విద్యార్థులకు తెలియపరచి నేడు ప్లాస్టిక్ భూత నుంచి విద్యార్థిని విద్యార్థులను ప్రజలు రక్షించడంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ముందు వరుసలో నిలిచింది ప్లాస్టిక్ వాటర్ బాటిలలో విద్యార్థులు ప్రతిరోజు నీళ్ళు తెచ్చుకోవడం మూలంగా అనేక రకాల ఆరోగ్య సమస్యలు మానసిక సమస్యలు విద్యార్థిని విద్యార్థుల పైన పడుతున్నాయని ప్రపంచ పర్యావరణ సంస్థలు యొక్క అధ్యయనాలను చేసి స్టీల్ వాటర్ బాటిల్ రాగి వాటర్ బాటిల్ మట్టి వాటర్ బాటిల్ వాడాలని విద్యార్థిని విద్యార్థులకు పిలుపునివ్వడం జరిగింది నేడు వేలాదిమంది విద్యార్థులు విద్యార్థులు దీని పాటిస్తున్నారు భవిష్యత్తులో ప్రతి విద్యార్థి తన జీవితంలో ప్లాస్టిక్ పదార్థాలకు ప్లాస్టిక్ ఉత్పత్తులకు దూరంగా ఉంచి ఆరోగ్యవంతమైన దేశాన్ని నిర్మించడం కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రయత్నం చేస్తుందన్నారు ఈ సందర్భంగా సమస్త అధ్యక్షులు డాక్టర్ భద్ర మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సంస్థ నినాదమే పర్యావరణ పరిరక్షణకే విశ్వ మానవులంతా ఏకమవుతాం కులం మతం ప్రాంతం లింగభేదం లేకుండా ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అంటే అన్ని మతాలలో ఉన్న దైవం ప్రకృతి దైవాన్ని కాపాడుకోవడం దైవమంటేనే ప్రకృతి ప్రకృతి అంటేనే దైవం కాబట్టి ప్రతి ఒక్కరు కూడా ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న ఈ మహా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎవరికి వారు స్వచ్ఛందంగా ఈ మహా సంకల్పాన్ని సాధించడానికి తోడ్పాటున అందించాలని భద్ర పిలుపునిచ్చారు.

## రోజాగారు... ఇంతకీ ఇది మీ రాతలా?
# సాక్షి పంపిన స్క్రిప్టా?

● షర్మిల ప్రశ్నల పరంపర

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్కాం చేశారంటూ ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపణలపై మాజీ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం తన ఎక్స్ వేదికగా కాస్తా ఘాటుగా స్పందించారు. అయితే ఆర్కే రోజా స్పందనపై పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల.. తన ఎక్స్ వేదికగా శనివారం మరింత ఘాటుగా స్పందించారు. వైఎస్ షర్మిల ఏమన్నారంటే.. గౌరవ మాజీ మంత్రి రోజా గారు.. ఇంతకు ఇది మీ రాతలా? సాక్షి పంపిన స్క్రిప్టా? లేక సకల శాఖ మాజీ మంత్రి రాసిందా? అంటూ ఆర్కే రోజాను వ్యంగ్యంగా ప్రశ్నించారు. తెర వెనుక దాక్కొని మిమ్మల్ని ముందుపెట్టి అబద్ధాలను అందంగా వర్ణించే వాళ్లను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కొన్ని సూటి ప్రశ్నలు సంధిస్తుందన్నారు.

1) దేశంలో సోలార్ విద్యుత్ ధరలు గణనీయంగా తగ్గుతుంటే 25 ఏళ్ల కాంట్రాక్ట్ ఎందుకు చేశారు. 5 ఏళ్ల తర్వాత రూ 1.50 పైసలకే యూనిట్ ధర వచ్చునేమో కదా..? 2) ఇతర రాష్ట్రాల ఒప్పందాలను సమీక్షించకుండా ఏకపక్షంగా అదానీ వద్ద రూ.2.49 పైసలకు ఎందుకు కొన్నారు? అదానీ మీద మీకు అంత ప్రేమ ఎందుకు? 2020 ఏడాది గుజరాత్‌లో సోలార్ యూనిట్ ధర కేవలం రూ1.99 పైసలు మాత్రమే. మరి వెనకబడిన మన రాష్ట్రం అదానీ వద్ద 2021లో 50 పైసలు ఎక్కువ పెట్టీ ఎందుకు కొనాల్సి వచ్చింది ? ఇది రాష్ట్రం నెత్తిన అధిక భారం మోపినట్లు కాదా? 3) అదానీతో చేసుకున్న ఒప్పందాల్లో ట్రాన్స్మిషన్ చార్జీలు లేవని... రూ 2.49 పైసలకే యూనిట్ ధర పడిందని చెప్పినా వీలింగ్ ఛార్జీలు, అన్ని కలిపి యూనిట్‌కి రూ.4.16 పైసలు పడుతుందని విద్యుత్ రంగ అధికారులే చెప్తున్నారు.. మరి ఇది నిజం కాదా? 4) 2021లో సెకీ, సంస్థలు 20 గిగావాట్ల సోలార్ విద్యుత్‌కి పిలిచిన టెండర్లలో రూ.2.14 పైసలకే పలు కంపెనీలు ముందుకు వచ్చాయన్న సంగతి మీకు తెలియదా? 5)2021లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో టీపీ సౌర్యా అనే సోలార్ కంపెనీ రూ.2.14 పైసలకు, ఏఐ జోమయ్య అనే కంపెనీ రూ.2.15 పైసలు కోట్ చేసిన సంగతి మీరు గమనించ లేదా? 6) 2021లో రాజస్థాన్‌లో రెన్యువల్ ఎనర్జీ 1750 మెగావాట్ల సోలార్ విద్యుత్ కోసం పిలిచిన టెండర్లలో యూనిట్ ధర రూ.2.17 పైసలకు ఇచ్చేందుకు ముందు కొచ్చిన సంగతి మీరు చూడ లేదా? 7) గుజరాత్‌లో రూ1.99 పైసలు, రాజస్థాన్‌లో రూ 2.17 పైసలు, మధ్యప్రదేశ్‌లో రూ 2.14 పైసలు, మరి అదే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రూ.2.49 పైసలు పెట్టి కొనడం తక్కువ ధరనా? ఇదెక్కడి బంపర్ ఆఫర్? 8) చంద్రబాబు హయాంలో సోలార్ పవర్‌కి ఎక్కువ పెట్టి కొన్నారంటున్నారు. 2019లో మీరు అధికారంలో వచ్చాకా? దానిపై ఎందుకు దర్యాప్తు జరిపించ లేదు? టెండర్లు రద్దు చేశారు సరే.. మరి దాని వెనుక మర్మం ఏంటో విచారణ చేయాలి కదా? 5 ఏళ్లు అధికారంలో ఉండి గుడ్డి గుర్రాలకు పళ్ళు తోమారా? అటు తిప్పి, ఇటు తిప్పి ఇంగ్లీష్‌లో చెప్పినా, తెలుగులో చెప్పినా నిజాన్ని మాత్రం దాచ లేరు. అమెరికా దర్యాప్తు సంస్థల కళ్లు మూయ లేరు. అదానీ దగ్గర మీరు రూ.1750 కోట్లు లంచాలు తీసుకున్నది వాస్తవం. దేశంలో ఎవడు కొనని అదానీ సోలార్ పవర్‌ను ముడుపుల కోసం మీరు కొన్నది వాస్తవం కాదా?. అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు.



**ఇంతకీ ఆర్కే రోజా శుక్రవారం ఏమన్నారంటే..?**

వైఎస్ షర్మిల.. మీకు తెలుగు అర్థం కాదా.. ఇంగ్లీష్ అర్థం కాదా.. నిన్న మీ అన్న రెండు భాషల్లో సెకీతో ఒప్పందం అంశానికి సంబంధించి ఆధారాలతో సహా పూర్తి వివరాలు ఇచ్చారు. అయినా సరే ఆంధ్రజ్యోతి రాసిన స్టోరీలో పాయింట్లు పట్టుకుని మీరు మళ్లీ ఒక వితండవాదనతో తిరిగి వైఎస్ జగన్ మీద బురద జల్లుతున్నారని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆరోపించారు. అలాగే అదానీ సంస్థతో గతంలో జగన్ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలపై పలు అంశాలను ఆర్కే రోజా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ మేరకు ఆమె తన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆర్కే రోజా ప్రశ్నలకు వైఎస్ షర్మిల తనదైన శైలిలో ఆమెకు ప్రశ్నలు సంధించింది. మరోవైపు అదానీ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# కొడాలి నానికి ఉచ్చు?

● వరస ఫిర్యాదులతో ప్రభుత్వం సీరియస్ ● నియోజకవర్గానికి దూరంగా నాని ● జగనన్న కాలనీ నిర్మాణాలపై ఫిర్యాదులు ● కేసు నమోదు చేసిన పోలీసులు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వైసీపీ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారి పైన వరుస కేసులు నమోదు అవుతున్నాయి. విచారణ కొనసాగుతోంది. పలువురు ముఖ్య నేతల పైన గురి పెట్టారు. సోషల్ మీడియా కేసుల తరువాత ఈ నేతల అరెస్ట్ ల పైన పోలీసులు ఫోకస్ చేసే అవకాశం కనిపిస్తోంది. గుడివాడలో వరుస ఫిర్యాదులతో మాజీ మంత్రి కొడాలి నానికి ఉచ్చు బిగుస్తోంది. అదే సమయంలో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. కొడాలి నాని ఎక్కడ మాజీ మంత్రి కొడాలి నాని పై వరుస కేసులు నమోదవుతున్నాయి. వైసీపీ హయాంలో టీడీపీ నేతల ను లక్ష్యంగా చేసుకొని కొడాలి నాని తరచూ తీవ్ర వ్యాఖ్యలు చేసేవారు. దీంతో, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొడాలి నానిని పైన చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఫిర్యాదులు చేసారు. టీడీపీ కేడర్ నుంచి కొడాలి నాని అరెస్ట్ కోసం ఒత్తిడి పెరుగుతోంది. ఇదే సమయంలో గుడివాడలో జగనన్న కాలనీల్లో అక్రమాలు జరిగాయంటూ తాజాగా మరో కేసు నమెదు అయింది. ఈ కేసులో విచారణ వేగవంతం అయింది. వరుస ఫిర్యాదులతో గుడివాడలో జగనన్న కాలనీల కోసం 173 ఎకరాల భూమి సేకరించారు. మెరక పేరుతో అనుచ రులకు వర్క్ ఆర్డర్స్ ఇచ్చారని నాని మీద ఆరోపణలు ఉన్నాయి. అలా తనకు కావాల్సిన వాళ్లకు పనులు అప్పగించి 8కోట్ల రూపాయలతో పనులు చేపట్టి.. 40 కోట్ల దాకా స్వాహా చేసినట్లుగా కొడాలి నాని పైన ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటికే ఈ వ్యవహారం పైన విజిలెన్స్ విచారణ చేసింది. ఏపీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. జగనన్న కాలనీల కోసం గుడివాడ నియోజకవర్గం మల్లాయపాలెంలో 178.3 ఎకరాలు సేకరించారు. ఎకరా రూ.52 లక్షలు పెట్టి కొన్నారని తెలుస్తోంది. అక్కడ చదును చేయటం కోసం మెరక వర్క్ ఆర్డర్లు పొందిన వారంతా కొడాలి నాని అనుచరు లనే ఫిర్యాదులు ఉన్నాయి. నాని మెడకు ఉచ్చు నాని బినామీలే పనులు చేయించారనే ఆరోపణలతో విచారణ కొనసాగు తోంది. ఈ నివేదిక ఆధా రంగా కొడాలి నాని పైన చర్యలకు దిగే అవకాశం ఉంది. టీడీపీ పైన వైసీపీ హాయంలో విరుచుకు పడిన కొడాలి నాని..వల్లభనేని వంశీ ఇద్దరూ మౌనంగా ఉంటున్నారు. ఎక్కడా ఎలాంటి వ్యాఖ్యలు చేయటం లేదు. పార్టీ వ్యవహారాల్లోనూ పాల్గొనటం లేదు. కేసులు వెంటాడుతున్న సమయంలోనే ఇద్దరు నేతలు సైలెంట్ అయ్యారనే అభిప్రాయం ఉంది. అయితే, పూర్తి ఆధారాలతోనే కొడాలి నాని విషయంలో ముందుకు వెళ్లాలని ప్రభుత్వంలోని ముఖ్యులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో, నాని విషయంలో రానున్న రోజుల్లో ఎలాంటి నిర్ణయాలు ఉంటాయనేది ఉత్కంఠగా మారుతోంది.

# నూతన రేషన్ కార్డులకు దరఖాస్తులు

● డిసెంబర్ 2 నుంచి 28వ తేదీ వరకూ
● గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరణ
● పెండింగ్‌లో దరఖాస్తుల సంఖ్య 3,36,72000

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏపీ ప్రజలకు సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించనుంది. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు ఇతర సర్వీసులకు కూడా అవకాశం కల్పించనుంది. డిసెంబర్ 2 నుంచి 28వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇందుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనుంది. మార్పులు, చేర్పులు చేసిన కార్డులు, కొత్త కార్డులన్నింటినీ.. సంక్రాంతి 2025 కానుకగా లబ్ధిదారులకు అందించేలా ప్లాన్ చేసింది. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో.. కొత్తగా పెళ్లిళ్లు అయినవారు, రాజకీయాల కారణాలతో రేషన్ కార్డులు రానివారు వేల సంఖ్యలో ఎదురుచూస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు, కార్డుల్లో మార్పులు, సభ్యుల తొలగింపు.. ఇలా అన్నీ కలిపి ప్రస్తుతం 3,36,72000 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. కొత్త దరఖాస్తులతో పాటు వీటిని కూడా పరిశీలించి కొత్త రేషన్ అందించనుంది కూటమి ప్రభుత్వం.




# భోజనంలో పురుగులు

● నాగార్జున యూనివర్శిటీ విద్యార్థుల ఆందోళన ● ప్రభుత్వం సీరియస్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిది: గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో భోజనంలో పురుగులు రావడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. బాధ్యుడైన హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. దీంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి వారు ఆందోళనకు దిగారు. వర్సిటీలోని మహిళా హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి వెళ్లి వీసీ చాంబర్ ఎదుట బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. భోజనం ఇలా ఉంటే ఎలా తినాలంటూ ప్రశ్నించారు. వందలాది మంది విద్యార్థినులు నిన్న రాత్రి 9 గంటల నుంచి ఇవాళ తెల్లవారుజాము వరకూ ఆందోళన కొనసాగించారు. విషయం ఏపీ ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించింది. విచారణ నివేదికను వెంటనే ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# హెచ్ఐవీ పిల్లల్లో మనోధైర్యాన్ని కల్పించాలి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: హెచ్ఐవీ పిల్లల్లో ఎయిడ్స్ పట్ల అవగాహనతోపాటు వారిలో మనో ధైర్యాన్ని కల్పించి వారికి అండగా నిలబడేందుకు కమ్యూనిటీ బ్రేక్ ఫాస్ట్ ను పున్నమి ఘాట్‌లో శనివారం ఏర్పాటు చేసినట్లు ఏపీ శాక్స్ (ఏపీ శాక్స్ – ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సరస్వతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ... ముఖ్యంగా హెచ్ఐవి తో జీవిస్తున్న పిల్లల్లో మనోధైర్యాన్ని పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. అంతేకాకుండా పిల్లలతో కలిసి అందరూ కూడా బ్రేక్ ఫాస్ట్ చేయడం ద్వారా వాళ్లలో మనోధైర్యాన్ని పెంచాలి అనే ఒక మంచి సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా 60 మంది చిన్నపిల్లలు తో పాటు ప్రముఖులతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసామన్నారు.

# ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

● ఇంకెంత మంది పేద విద్యార్థులు చనిపోవాలి ● హై కోర్టు చురకులు వేసినా.. ఎందుకు నిర్లక్ష్యం? ● గురుకులాలు హాస్టళ్ళపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరపాలి ● సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన బీసీ నేత, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో వరుసగా జరుగుతున్న ఘటనలు చాలా బాధాకరమని, దీని పై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో వందలాది మంది విద్యార్థులు తీవ్ర అబ్బందులకు గురయ్యారని, హై కోర్టు జోక్యం చేసుకునే వరకు ప్రభుత్వంలో కదలిక లేక పోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆర్.కృష్ణయ్య బహిరంగ లేఖ రాశారు. ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ గురుకుల పాఠశాలలపై హాస్టళ్ళు నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిపి చర్చించాలని సంస్కరణలు చేపట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ విద్యా సంవత్సరంలో 42 మంది విద్యార్థులు చనిపోయారు. దాదాపు 1200 మంది విద్యార్థులు అనారోగ్యంతో ఆస్పత్తుల పాలయ్యారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా నిష్పక్షపాతంగా పిల్లల భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి సంస్కరణ కోణంలో చూడాలని సూచించారు. ప్రజలలో విశ్వాసం కలిగించే విధంగా చర్చలు తీసుకోవాలని కోరారు. గురుకులాల ఫుడ్ పాయిజన్, అనారోగ్య పరిస్థితులపై తీవ్రస్థాయి చర్చ జరుగుతున్నందున కొన్ని విషయాలు ముఖ్యంగా పాలన విధానంలో ఉన్న లోపాలు సరిదిద్దవలసిన అవసరం ఉంది. ఎక్కువ సంఖ్యలో గురుకుల పాఠశాలలో యున్నందున సంఖ్య అధికమై నియంత్ర విధానంపై పట్టు తప్పుతుంది. అలాంటప్పుడు మౌలికంగా పాలన విధానంలో పాలన సరిదిద్దవలసిన అవసరం ఉంది. గురుకుల పాఠశాలలో ఆర్‌సీవోలు – కోఆర్డినేటర్లు కొందరు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. దీన్ని మూలంగా ఆహారంలో క్వాలిటీ పడిపోతుంది. అలాగే భోజనాలు కాంట్రాక్టు పద్ధమీద భోజనాలు తయారు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు – కోఆర్డినేటర్లు చాలా చోట్ల కుమ్మకయ్యారు. నిత్యవసర వస్తువులలో కాలం చెల్లిన వాటిని భోజనం తయారీకి ఉపయోగిస్తున్నారు.


దీని మూలంగా ఫుడ్ క్వాలిటీ పడిపోతుంది. అంతేకాక ఒకరోజు మిగిలిన వంటలు మరుసటి రోజు ఇస్తున్నారు. వీటిని సరిదిద్దవలసిన అవసరం ఉంది. దీనిపై చర్చించి మార్పులు – పాలనలు సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. గురుకులాల్లో కాంట్రాక్ట్ వంటల పద్ధతిపై చర్చించి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించవలసిన అవసరం ఉంది. ఇక కాలేజీ హాస్టళ్ళ నిర్వహణ కూడా హస్తవ్యస్తంగా తయారయింది. దీనిపై కూడా చర్చించి మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. నాన్ టీచింగ్ సిబ్బందిని పెంచవలసిన అవసరం యుంది. రాష్ట్ర ప్రభుత్వం 2008లో ఉమ్మడి రాష్ట్రంలో 300 బి.సి బాలికల హాస్టళ్ళు, 2010 లో 300 బి.సి బాలుర హాస్టల్లు మంజూరు చేసింది. హాస్టళ్ళ పరిపాలన విధానంలో ఇంతవరకు ఒక నిర్దిష్టమైన– ప్రతిష్టమైన పాలన విధానం రూపొందించలేదు, ఈ హాస్టల్లో పీజీ, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ కోర్సులు చదివే విద్యార్థులు ఉన్నారు,. వీరికి మంచి భోజనం వసతి సౌకర్యాలు కల్పించవలసిన అవసరం ఉంది. అందుకుగాను ఈ క్రింది సూచనలు ప్రభుత్వానికి సూచిస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

**ప్రభుత్వానికి సూచనలు :** 1. బి.సి హాస్టళ్ళలో వర్కర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. ఔట్సోర్సింగ్ పద్ధతిలో నియమించడం వలన పని భారం ఎక్కువగా ఉండటం వలన ఉద్యోగం వదిలి వెళ్ళిపోతున్నారు. ప్రతి హాస్టల్ కు నలుగురు శాశ్వత వర్కర్స్ ను నియమించాలి. 1. అటెండర్ 2. వాచ్ మెన్ 3. కమాటి 4. కుక్ చొప్పున శాశ్వత ప్రతిపదికన నియమించాలి. ఇప్పుడు పని చేస్తున్న వారిని వరుసగా నాలుగు సంవత్సరాలుగా నిండి ఉన్నట్లైతే వారిని రెగ్యులర్ చేయాలి. 2 .హాస్టల్లో 150 విద్యార్థుల కంటే ఎక్కువ సంఖ్య ఉన్నచోట ప్రతి 25 మందికి ఒక వర్కర్ ను ఆధానంగా కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలి.

ప్రస్తుత 300 మంది విద్యార్థులలకి ముగ్గురు వర్కర్లు ఉన్నారు. పని భారంతో విద్యార్థులకు అసౌకర్యం గా ఉంది. విద్యార్థుల చదువు దెబ్బతింటుంది. హాస్టల్ పరిశుభ్రత దెబ్బతింటుంది. హాస్టళ్ళు శుభ్రం చేసేవారు లేక మురికి కూపాలుగా మారుతున్నాయి. 3. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టును గ్రేడ్‌గా అప్ గ్రేడ్ చేయాలి. గతంలో 2008కి పూర్వం మంజూరైన హాస్టళ్ళకు గ్రేడ్– వార్డెన్ పోస్టులు ఉన్నాయి. ఎందుకంటే హాస్టల్లలో ఎక్కువగా డిగ్రీ, పీజీ చేసే విద్యార్థులు ఉన్నారు వీరికి ఎక్కువ స్టేటస్ ఉన్న అధికారాలు కావాలి. కాబట్టి బి.సి హాస్టల్లను విద్యార్థుల చదువు, విద్యా ప్రమాణాలను పెంచవలసిన అవసరం ఉంది. మానవ వనరులను తీర్చి దిద్దవలసిన అవసరం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

# సాఫ్ట్‌వేర్‌లో ఉచిత శిక్షణ

● మానవసేవ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ● సమాజానికి సేవలు అందించడమే లక్ష్యం ● మానవ సేవా సంస్థ అధ్యక్షులు వంగరి సురేష్



అమరావతి బ్యూరో ప్రతినిధి: మానవ సేవా సంస్థ అధ్యర్యంలో ఉచితంగా సాఫ్ట్వేర్ కోర్స్ లో శిక్షణ ఇవ్వనున్నట్లు మానవ సేవా సంస్థ అధ్యక్షులు మంగరి సురేష్ తెలిపారు. ప్రతి సమత్సరం 500 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా సాఫ్ట్వేర్ కోర్స్ లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగిగా విద్యార్థినీ విద్యార్థులకు నా వంతుగా విద్యారంగంలో సేవ చేయాలనే దృక్పథంతో ఉచితంగా సాఫ్ట్వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది, విద్యార్థిని విద్యార్థు లు ,గృహిణులకు, నిరుద్యోగులకు ఇది ఒక మంచి సదా అవకాశం ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగిగా విద్యార్థిని విద్యార్థు లు మంచిగా అభివృద్ధి చెందాలని మంచి సూచనలతో మెరుగైన టెక్నాలజీలో ఉచితంగా శిక్షణ ఇచ్చి, వారిని ఉత్తమ శిఖరాలకు చేరుకునే విధంగా శిక్షణ ఇచ్చి తగు సూచనలు కూడా ఇవ్వటం జరుగుతుంది ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోగలరని విజ్ఞప్తి చేశారు. శనివారం ఉ 11 గంటలు నుండి మ 2 గం వరకు, ఆదివారం ఉ 11 గంటలు నుండి మ 2 గం వరకు, వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు : 9393771663, 7093529750 తరగతి : ఉ 11 గంటలు నుండి మ 2 గం వరకు ప్రతి శనివారం ( 3 గంటలు ), ఆదివారం ( 3 గంటలు ) మాత్రమే. కోర్స్ కాలపరిమితి : 3 నెలలు ( 14 వారాలు ) గుంటూరు , బాపట్ల మరియు ప్రకాశం జిల్లా విద్యార్థినీ విద్యార్థులకు మంగళగిరిలో క్లాసులు నిర్వహిం చబడునని, వివరాలకు ఫోన్ నంబర్లు : 9393771663 ,7093529750, 9985222857 సంప్రదించాలని కోరారు. గత 22 సంత్సరాలుగా నిరంతర ప్రజాసేవలో మానవ సేవా సంస్థ నిస్వార్థంగా సేవ చేయటంలో ఉన్న తృప్తి , అనుభూతి మీరు మాకు ఇచ్చారు , మీ సేవ కోసం మీ ముందుకు వస్తున్నాము. మానవ సేవా సంస్థ రాష్ట్ర మంతటా చేస్తున్న మా సేవా కార్యక్రమాలకు మీ ఆదరణ ,మీ సహకారం , మీ ఆశీర్వాదం మాకు కావాలి అదే స్ఫూర్తితో ఇంకా అనేక కార్యక్రమాలతో నేనున్నాను అంటూ మీ ముందుకు వస్తున్నామని తెలిపారు. మానవ సేవా సంస్థ 22 సం!! గా రెండు తెలుగు రాష్ట్రాలలో సేవా కార్యకమాలు చేసుకుంటూ సుమారు 14 లక్షల మందికి ఉచితముగా వైద్య సేవలు, 900 పైగా ఉచిత వైద్య శిబిరాలు , 4500 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు , 6000 మందికి ఉచితంగా కళ్ళ అద్దాలు, 5000 మందికి ఉచితంగా విద్య అందించినట్లు తెలిపారు.

# రామ్ చరణ్16లో మున్నాభాయ్ దివ్యేందు



గ్లోబల్ సక్సెస్ను సాధించి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను మెప్పించిన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇప్పుడు తన రామ్చరణ్16 సినిమా షూటింగ్ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. రీసెంట్గానే ఈ సినిమా షూటింగ్ను మైసూర్లో ప్రారంభించారు. తొలి చిత్రం ఉప్పెనతో బ్లాక్ బస్టర్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించిన దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సమర్పణలో ఈ భారీ పాన్ ఇండియా సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అనౌన్స్మెంట్ రోజు నుంచి అంచనాలు పెంచుతూ వస్తోన్న ఈ సినిమాను భారీ స్థాయిలో హై టెక్నికల్ వేల్యూస్తో అన్కాంప్రమైజ్డ్గా రూపొందిస్తున్నారు మేకర్స్. పాన్ ఇండియా సినిమాలోకి భారీ తారాగణం కూడా నటిస్తున్నారు. కరుణడ చక్రవర్తి శివరాజ్కుమార్ ఈ చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన చాలా పవర్ఫుల్ పాత్రలో మెప్పించబోతున్నారు. తాజాగా ఇప్పుడు బాలీవుడ్ యంగ్ సెన్సేషన్ దివ్యేందు ఇందులో కీలక పాత్రలో అలరించబోతున్నారు.

## మంచి సినిమా చేస్తే ప్రేక్షకుల ప్రేమను గెల్చుకోవచ్చు



థ్రిల్లర్ జానర్ లో ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ ఇచ్చి ఘన విజయాన్ని అందుకుంది కిరణ్ అబ్బవరం మూవీ క. ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్ గా నటించారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మించారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ క సినిమాతో తమ ప్రతిభ నిరూపించుకున్నారు. క సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేయగా..మలయాళంలో స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై డిస్ట్రిబ్యూట్ చేశారు. దీపావళి బాక్సాఫీస్ రేసులో విన్నర్ గా నిలిచిన ఈ సినిమా వరల్డ్ వైడ్ 50 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ మూవీ ఈటీవీ విన్ లో డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీతో స్ట్రీమింగ్ కు వచ్చి అక్కడా గ్రాండ్ సక్సెస్ అందుకుంది. అతి తక్కువ టైమ్ లో 100 మిలియన్ మినిట్స్ వ్యూయర్ షిప్ దక్కించుకుంది. ఈ సందర్భంగా క బ్లాక్ బస్టర్ ధమాకా ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – క సినిమాకు మేము ఎంతగా ప్రమోషన్ చేశామో, ఈటీవీ విన్ టీమ్ అంతా అంతే ప్రమోషన్ చేసి ఆడియెన్స్ కు సినిమా బాగా రీచ్ అయ్యేలా చేస్తున్నారు. పైరసీ అనేది జరగకుండా జాగ్రత్తలు తీసుకుని ప్రతి ఒక్కరి ఇంటికి క సినిమాను చేర్చారు. ఈటీవీ విన్ టీమ్ బాపినీడు, సాయి కృష్ణ ఇతర అందరికీ థ్యాంక్స్ చెబుతున్నాం. అలాగే డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీ నుంచి ఓటీటీలోకి వచ్చిన ఫస్ట్ తెలుగు సినిమా క కావడం విశేషం. అందుకు చాలా సంతోషంగా ఉంది. డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీలో మా సినిమా మరింత డీటెయిలింగ్ గా సౌండ్, విజువల్స్ మరింతగా ఆకట్టుకుంటాయి. థియేటర్ లో క సినిమా చూసిన వాళ్లు కూడా మరోసారి ఈటీవీ విన్ లో చూడండి. ఎందుకంటే సెకండ్ టైమ్ ఇంకా బాగా అనిపించింది అని చాలామంది చెబుతున్నారు అన్నారు.

## సెన్సేషనల్ కాన్సెప్ట్తో రాబోతున్న ఎంఫోర్ఎం



మూవీ మేకర్ మోహన్ వడ్లపట్ల దర్శకుడిగా, జో శర్మ (యూఎస్ఏ) హీరోయిన్గా తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ 'ఎంఫోర్ఎం' (4 – ) విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల సినిమా హైలైట్స్ చెప్పారు. వరల్డ్వైడ్గా అందరికి కనెక్ట్ అయ్యే సబ్జెక్టుతో తెరకెక్కించామని చెప్పారు. 110 ఏళ్ల సినీ చరిత్రలో ఇంతవరకు ఎవరూ తీసుకోని కాన్సెప్టుతో ఈ సినిమా చేసినట్టు తెలిపారు. రాబోయే పదేళ్లు ఈ సినిమా గురించే మాట్లాడుకుంటారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ.. "ఇటీవల 'ఎంఫోర్ఎం' మూవీ హిందీ ట్రైలర్ ప్రతిష్టాత్మక గోవా ఫిలిం ఫెస్టివల్లో ఇండియన్ మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విడుదల చేయడంతో సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చిందని, అంచనాలు భారీగా పెరిగాయన్నారు. ఎక్సలెంట్ టీంతో సినిమాను ఎంతో అద్భుతంగా పూర్తి చేశామన్నారు. హీరోయిన్ జో శర్మ తన ఫర్మార్మెన్స్తో సినిమాకు హైలైట్గా మారిందని డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల తెలిపారు. హాలీవుడ్ రేంజ్లో తెరకెక్కించామని, కథ, కథనాలను నమ్ముకునే సినిమాను తీశానని చెప్పారు.

# పవన్కి న్యూయర్ స్టార్టింగ్లోనే ఎండ్ కార్డా?

పవర్స్టార్ పవన్కళ్యాణ్ రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే ఓ పక్క సినిమాలను కూడా అంతే చురుగ్గా చేస్తున్నారు. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు'..'ఓజీ' సినిమాలు ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. రెండు చిత్రాల షూటింగ్ కూడా ముగింపు దశలోనే ఉన్నాయి. పవన్ కళ్యాణ్ కి సమయం దొరికి సవ్యంగా డేట్లు కేటాయించి ఉంటే? ఇప్పటికే వాటి షూటింగ్ కూడా పూర్తయ్యేది. కానీ రాజకీయం-సినిమా అనే రెండు పడవల ప్రయాణ నేపథ్యంలో ఎంత వేగంగా పూర్తి చేయాలి? అన్న సాధ్యపడటం లేదు. జనవరి ముగింపుకు రెండు సినిమా షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. పవన్ కల్యాణ్ పోర్షన్ మొత్తం పూర్తవుతుందన్నది తాజా అప్ డేట్. 'హరిహర వీరమల్లు'కు సంబంధించి పవన్ నాలుగు నుంచి ఐదు రోజులు గ్యాప్ లేకుండా డేట్లు ఇస్తే చాలా ముగించడానికి రెడీగా ఉంది టీమ్. అందుకు తగ్గట్టు పవన్ డేట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పవన్ పోర్షన్ పూర్తవుతుంది. ఇక 'ఓజీ' సినిమా కోసం 15 రోజులు కేటాయిస్తే చాలు ముగించడానికి సుజిత్ రెడీగా ఉన్నాడు. అందుకు తగ్గట్టే పవన్ డేట్లు కేటాయించినట్లు సమాచారం. జనవరి నుంచి పవన్ 'ఓజీ' షూటింగ్ లో పాల్గొంటారని సమాచారం. దీంతో ఓజీకి సంబంధించి పవన్ పోర్షన్ మొత్తం కంప్లీట్ అవుతుంది. అంటే జనవరి చివరికల్లా వీరమల్లు..ఓజీ ల పవన్ పోర్షన్ మేకర్స్ పూర్తి చేయనున్నారు.



## వీణారావ్ ఫస్ట్ దర్శన్



తెలుగు చిత్రసీమలో విశిష్టమైన నందమూరి వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ, లెజెండరీ శ్రీ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, దివంగత శ్రీ జానకిరామ్ తనయుడు యంగ్ చాప్ నందమూరి తారక రామారావు ఫిలిమ్స్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. డైనమిక్ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ ని న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన నందమూరి తారక రామారావు ఫస్ట్ దర్శన్ కి వరల్డ్ వైడ్ ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ద్వారా ప్రతిభావంతులైన కూచిపూడి డ్యాన్సర్, తెలుగు అమ్మాయి వీణారావు కథానాయికగా పరిచయం అవుతున్నారు. వీణారావు ఫస్ట్ దర్శన్ ని నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, స్వప్న దత్ లాంచ్ చేశారు. అచ్చతెలుగు అందాలరాశి వీణారావు ఫస్ట్ దర్శన్ అందరినీ మెస్మరైజ్ చేసింది. ఫస్ట్ దర్శన్ షో రీల్ లో ట్రెడిషనల్, మోడ్రన్ అవుట్ ఫిట్స్ లో వీణారావు డిఫరెంట్ బ్యూటీఫుల్ లుక్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి.



## సీతక్క చేతుల మీదుగా 'నారి' టైటిల్ పోస్టర్

ఆమని, వికాస్ వశిష్ఠ,మౌనిక రెడ్డి, ప్రగతి, కేదార్ శంకర్, ప్రమోదినీ తదితరులు కీలక పాత్రల్లో నటించిన సినిమా నారి. మహిళల్ని గౌరవించాలి, ఆడిపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి అనే కాన్సెప్ట్ తో దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. ప్రొడ్యూసర్ శ్రీమతి శశి వంటిపల్లి నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న నారి సిని మా డిసెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క ఈ సినిమా టైటిల్ పోస్టర్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ – మహిళలు ఎన్నో రంగాల్లో ఎదుగుతున్నారు. అయినా వారి పట్ల వివక్ష, చిన్నచూపు తగ్గడం లేదు. సమాజ నిర్మాతలు మహిళల అనే నిజాన్ని మనమంతా గుర్తుపెట్టుకో వాలి. ఆడ పిల్లలు ఎదిగేందుకు ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలి. మహిళల్ని గౌరవిం చాలి. ఇలాంటి గొప్ప కాన్సెప్ట్ తో నారి సినిమా చేసిన సూర్య వంటిపల్లికి అభినందనలు అన్నారు.

## తెలుగులో పా.. పా..గా తమిళ్లో డా..డా

తెలుగు తెరపైకి ఓ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా రాబోతోంది. తమిళ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ డా..డా మూవీ తెలుగులో పా.. పా.. టైటిల్తో జెకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై, నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. డిసెంబర్ 13న ఈ చిత్రాన్నిఆంధ్ర, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా థియేటర్లలో గ్రాండ్గా విడుదల కానుంది. గత ఏడాది తమిళంలో డా..డా మూవీ సెన్సేషనల్ హిట్ సాధించింది. కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రదారులుగా, డైరెక్టర్ గణేష్ కె బాబు తెరకెక్కించిన డా..డా చిత్రం తమిళ ఆడియన్స్ని విపరీతంగా ఆకట్టుకుంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూటర్లకు కాసుల వర్షం కురిపించింది. అతి తక్కువ బడ్జెట్తో తెరకెక్కిన ఈ సినిమా సుమారు 30 కోట్లు వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేసుకుంది.



## 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్'గా నభా నటేష్



బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్ మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్' గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకున్నారు. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ చేతుల మీదుగా నభా ఈ అవార్డ్ స్వీకరించారు. గ్లామర్ తో పాటు పర్ ఫార్మెన్స్ తో మెప్పించగల హీరోయిన్ గా పేరున్న నభా నటేష్ కు ఈ అవార్డ్ వెల్ డిసర్వడ్ అని అనుకోవచ్చు. స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకున్న నభా నటేష్ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

నభా లేటేస్ట్ గా తెలుగులో బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా మూవీస్ చేస్తోంది. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు మూవీలో నభా నటేష్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ లో ఉంది. అలాగే రీసెంట్ గా నాగబంధం అనే పాన్ ఇండియా మూవీని స్టార్ట్ చేసింది. ఈ రెండు చిత్రాలతో నభా నటేష్ మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స ఆమె ఖాతాలో ఉన్నాయి.

**PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD**, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **PRINTED AT SPR PRINTING PRESS,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232** RNI Registration No. **APTEL/2007/22044**